భానుమూర్తి, వారణాశి

దుర్గాదాస్

బరంపురం, 1927

Record no. 519

Bhānumūrti, Vāraṇāśi

Durgādās

Barampuraṃ, 1927

Record no. 519

## Bibliographic Record Target

భానుమూర్తి, వారణాశి.

దుర్గాదాస్ : ఐతిహాసిక నాటకము / గ్రంథకర్త వారణాశి భానుమూర్తిగారు.- 1st ed.- బరంపురం : భాగవతుల నృసింహశర్మ, 1927.

4, 108, (3) ; 22 cm.

Record no. 519

Bhānumūrti, Vāraṇāśi.

Durgādās : aitihāsika nāṭakamu / granthakarta Vāraṇāśi Bhānumūrtigāru.- 1st ed.- Barampuraṃ : Bhāgavatula Nṛsiṃhaśarma, 1927.

4, 108, (3) ; 22 cm.

Record no. 519

# దుర్గాదాస్

(ఐతిహాసిక నాటకము)

వారణాశి భానుమూర్తిగారు

గ్రంథకర్త.

Registered

Note this

గ్రంథమాల

Trade mark



విలువ రూ 1.0.0.

(Postage extra)

పోస్టుఖర్చులు కొనువారే భరింపవలెను.

గమనింపుడు:— అడ్వాన్సుగా బంపిన చందాదారులకు, పోస్టు ఖర్చులు మేమే భరించి పంపుదుము. చందాదారుల కిది చాల లాభకరము.

సర్వస్వామ్యములు
ప్రకాశకునివి.

Copy right Registered.

సంపాదకులు:—ఆదిభట్ల తరిణయ్యసిద్ధాంతిగారు.

ప్రకాశకులు:—భాగవతుల నృసింహశర్మగారు.

వేగుంజుక్క గ్రంథమాల,

పూడిపెద్దివారివీధి, బరంపురం (గంజాం.)

*Published by:*—**Bh. N. Serma,**
VEGU-JUKKA SERIES,
Pudipeddivari Street, BERHEMPUR,
*(Ganjam)*

*Printed by:*—**Cocanada printing works,**
COCANADA.

1ST EDITION
1000 COPIES.
1927

**Intimation for next issue "Chapala"**
**a high Class Detective Novel with wonderful incidents.**

భాగవతుల నృసింహశర్మ

ప్రొప్రయిటరు,

వేగుజుక్క గ్రంథమాల,

పూడిపెద్దివారివీధి, బరంపురం (గంజాం)

అడ్వాన్సు పంపువారికి ఖర్చులు మేమే భరించి పంపుదుము. చందాదారులు గమనింపవలెను.

అవసరము లేనివారు వెంటనే తెలియఁజేయఁ బ్రార్థితులు.

రాబోవునవల కిదియే ఇంటిమేషను.

# చపల.

అత్యద్భుత కథాసంవిధానముఁ గల్గిన నిరూపక నవల.

గ్రంథకర్త:—పండిత ఆదిభట్ల తరిణయ్యసిద్ధాంతిగారు.

ఇట్టిది మనభాషయందు వెలువడి యుండలేదు. వంగీయ పత్రికలన్నియు దీనిని బహుభంగులఁ బ్రశంసించినవి. ఇందు ముగ్గురు రహస్యపరిశోధకులు, ముప్వురు నాయకులు, ముప్వురు నాయికలు, మూడస్త్రములు, ముమ్మారు ప్రయోగము, మూడుహత్యలు, మూడు పలాయనములు, మూడు జాబులు, మూడు హింసలు, మూడు ప్రవృత్తులు, మూడు పూర్వవృత్తాంతములు, నవనీత కోమ లాంగియగు మ్లేచ్ఛస్త్రీ ఖాంన్‌బీబీ గావించిన పైశాచికకృత్యము

లు, నరరాక్షసుఁడగు శశిభూషణుని దుర్దాంత వ్యాపారములు. వలచిన కాంతను నిరాకరించుట, ఒల్లని యబలను బలాత్కరించి వివాహమాడుట. పెండ్లిలో బెద్దపెండ్లి. నిద్రలో దీర్ఘనిద్ర. క్రొత్తపెండ్లి కూతురు మగనిని జంపినట్లు నిర్ధారణ, వింత దొంగతనము, దొంగ నోట్లను సృష్టించుట, అబల దానవియగుట, మనుజుఁడు రాక్షసుఁడగుట, అనుమానము, పెనుభూతము, మోసము, అవిశ్వాసము, భ్రమ, పరాభవము, దంభము, వేషము, హెచ్చరిక మొదలగు విషయములతో నిండియుండును. దీనిని జదువ నారంభించినంతనే, ముగించువఱకు నిద్రాహారములం దభిరుచి యుండదు. గ్రంథము నీతిబోధకము, ఉద్వేగపరిపూర్ణము, కౌతూహలాక్రాంతము పాపవ్యక్తీకరణము, పాప విపాక సమాప్తము.

శైలి సులలితము, సలక్షణము.

దీనివెల చందాదారులకు రు. 1-0-0. ఇతరులకు రు. 1-8-0
పోస్టేజి కొనువారే భరించుకొనవలెను.

ఇట్లు విధేయుడు,

భా॥ నృ॥ శర్మ

"వేగుజుక్క" గ్రంథమాల.

N. B 1 మేము పంపిన పార్సెలుపై "రిజిష్టర్డు ట్రేడుమార్కు" (Registered trade mark) గమనించుచుండవలెను.

2 చిరునామాలు మార్చినప్పుడు వెంటనే తెలియజేయవలెను.

3 ఇంటిమేమను అందిన వెంటనే గ్రంథ మవసరము లేనివారు వెంటనే తెలియజేయవలెను.

మఱి చెప్పకేమి:—

# ఉభయులకు లాభకరము.

చందాదారులారా!

పోస్టేజి మనియార్డరు ఖర్చులు మేమే భరించి వి. పి ద్వారా గ్రంథముల బంపిన యెడల, 1 రూపాయికి పోస్టువారు 0-8-0 తీసికొనగా మాకు దక్కెడిది 0-8-0 మాత్రమే. ఇది మాకు కిట్టుబడికాదు. మీరే భరింపవలసివచ్చిన, నిష్కారణము దండగ యగుచున్నదని మీరేకాదు మేముకూడ, దుఃఖింపవలసినదే. అందుచే, ఉభయులకు నష్టము లేకుండ ఒక యుపాయము చెప్పుచున్నాము వినుండు. ముందు అడ్వాన్సుగా, 1 రూ మాత్రము, మేము ఇంటిమేమను పంపినవెంటనే, మాకుఁబంపినఁ జాలును. సంవత్సరము చందా ఒక్కమారుగ పంపవలెనను నిర్బంధములేదు. మీ అడ్వాన్సు అందినవెంటనే గ్రంథము అన్‌రిజిష్టర్డు పార్సెలు ద్వారా, (అందుకయిన పోస్టేజి మేమే భరించి) పంపుదుము. ఇది గ్రహింపక చందాదారులు మాకు నష్టముఁగూర్చిన ప్రయోజనము లేదు. పోషకులుగాని రాజపోషకులుగాని లేకపోయినను చందాదారుల యభిమాన ప్రోత్సాహముల బలమునిల్చి పనిచేయుచున్న మాగ్రంథమాలకుఁ దోడ్పడి యుద్ధరింపవలెను. చాలమంది చందాదారు లీవిధముగ అడ్వాన్సు పంపుచున్నారు. అన్‌రిజిష్టర్డు పార్సెలు ద్వారా పంపిన గ్రంథము తప్పక అందితీరును.

ప్రతివిషయములో మా యీక్రిందిచిరునామా గమనించవలెను.

భాగవతుల నరసింహశర్మ.

ప్రొప్రైటర్, "వేగుఁజుక్క" గ్రంథమాల,

పూడిపెద్దివారివీధి-బరంపురం (గంజాం)

జాగ్రత్త!

దొంగలు కొందఱు బరంపురమునుండి వేగుజుక్కగ్రంథమాల పంపినట్లు భ్రమింపజేయుచు మా చందాదారులకు పనికిమాలిన గ్రంథములు పంపవచ్చును. మా చందాదారులు మాపార్సెలుపైఁగల చిరునామాయును, రిజిష్టర్డు ట్రేడుమార్కును ముఖ్యముగా చూచి పుచ్చుకొనవలెను. "రేచుక్క" "పగటిచుక్క" దొంగల, దగాపనులకు మా చందాదారులు మోసపోకూడదు.

"దొంగలున్నారు. జాగ్రత్త"........

# మనవి.

ఆంధ్రసోదరులారా!

దేశాభిమానులగు వారలెల్లరు, శ్రీయుత ద్విజేంద్రలాల్ రాయ్ గారి నాటకరత్నములు, తప్పనిసరిగఁ జదువవలెనను తలంపుతో నే నీనాటకము ననువదించితిని. శ్రీయుత ద్విజేంద్రలాల్ రాయ్ గారి నాటకములలోఁ బ్రతిజ్ఞాచాణక్య నామాంతరము చంద్రగుప్తము, నూర్జహాను నాటకమును ప్రసిద్ధికెక్కినవి.

నే నీనాటకము కొన్నిమార్పులతో విరచింపవలసి వచ్చినది. తొలుతటి ప్రతి రచనమైనదో సంపూర్ణముగ మూలము నాంధ్రలోకమునకుఁ దెలియఁజేయఁగలను. గ్రంథవిస్తరభీతిచే, వేగుఁజుక్క వారు సమ్మతింపకపోవుటచే, నే తదంశముఁ గూర్చి యిపుడు వివరింపఁజాలను.

వేగుఁజుక్క పరిషణ్మండలివారు, నా యీద్వితీయమాతృకను సాంతముగఁ బఠించి, యీవిధముగఁ బ్రకటించినందులకు నే నెంతయుఁ గృతజ్ఞుఁడను. నే నీగ్రంథమును సర్వస్వామ్యసంకలితముగ వేగుఁజుక్క గ్రంథమాలాధికారులగు బ్ర॥ శ్రీ భాగవతుల నృసింహశర్మగారి కొసఁగితిని. తత్ప్రతిఫలము నాకు ముట్టినదని సంతోషమిందుమూలముగ వెల్లడించుచున్నాను.

ఈనాటకముఁ బఠించి, ఆంధ్రసోదరులు, మంచిచెడ్డల నాకెఱింగించిరేని భాషాసేవకుఁ బ్రయత్నించువాఁడ నని మనవిచేయుచున్నాను.

ఈనాటకదృశ్యములలో నచ్చటచ్చటఁ గల ముఖ్యములగు పద్యములు, ప్రతిజ్ఞ చాణక్య, తులసీరామాయణాది గ్రంథకర్తలగు బ్ర॥ శ్రీ॥ భాగవతుల నృసింహశర్మగారివని తెలియఁగవలెను.

పంతముచే నే నీనాటకమును పదిదినములలోఁ బూర్తిఁజేయవలసి వచ్చుటచే నందందు లోపము లుండవచ్చును. మహనీయు లెఱింగించిన, ద్వితీయముద్రణమున దిద్దుకొనఁగలవాఁడను.

ఇట్లు,
బుధజనవిధేయుఁడు,
వారణాశి భానుమూర్తి
గ్రంథకర్త.

బ్రహ్మపురము,
20—5—27.

# అంకితము.

గీ. తల్లిదండ్రులకుం గాని । తనుజుఁ డొందు
దనుజుఁ డనియందు రామాట । తథ్యమగును;
తల్లి హెచ్చని యెంచి స । ద్భక్తితోడ
నామె కొసఁగితి నీగ్రంథ । మంకితముగ.

గ్రంథకర్త.

—: ఈనాటకమున వచ్చు ముఖ్యపాత్రలు :—

పురుషులు.

ఔరంగజేబ్—ఢిల్లీపాదుషా

దిలేర్ ఖాను
తహబర్ ఖాను } సేనాధిపతులు.

అజిమ్
మొఅజిమ్ } ఔరంగజేబ్ కుమారులు
అక్బర్

శ్యామసింహుఁడు—బికనీర్ రాజు

దుర్గాదాస్—రాజపుత్ర సేనానాయకుఁడు

సమరదాస్—దుర్గాదాసుని సోదరుఁడు

రాజసింహుఁడు—మహారాణా

మఱియు సందర్భానుసారముగ వచ్చు నితర పురుష పాత్రలుఁ గలవు- నటుర గమనింపవలెను.

స్త్రీలు.

గుల్నార్—బేగమ్-ఢిల్లీమహారాజ్ఞి

రజియా—అక్బరుకూతురు- సంగీతప్రియురాలు

జోధపురరాణి—

మఱియు సందర్భానుసారముగ నితర రాజపుత్ర స్త్రీలును వత్తురు.

☞ గమనింపవలెను:—ఈ నాటకముఁ బ్రదర్శింపఁ దలఁచినవారు, బ్ర॥ శ్రీ॥ భావతుల నృసింహశర్మగారి యనుమతిఁ బొందవలెను.

శ్రీ

# దుర్గాదాస్

## ప్రథమాంకము.

—: ప్రథమదృశ్యము. :—

స్థానము:—రాజప్రాసాదమున, ఔరంగజేబు దర్బార్.

[సింహాసనాసీనుఁడైయున్న చక్రవర్తి వామపార్శ్వమున, బికనీర్ మహారాజగు శ్యామసింహుఁడు కూర్చుండియుండును. దక్షిణభాగమున సేనానాయకుఁడగు తహబరుఖాన్ నిల్చియుండును. ఎదుట రాథోర్ సేనాపతి, దుర్గాదాసుఁడు, నతని తమ్ముఁడగు సమర్ దాసుఁడు నిలువఁబడియుండును.]

ఔరంగ—(దుర్గాదాసుఁజూచి) మొగల్ సామ్రాజ్యలక్ష్మికి నమూల్య భూషణప్రాయుఁడైన యశ్వంతసింహుఁడు మరణించుటఁబట్టి మాకుఁ దీఱరాని లోటును వచ్చినది.

దుర్గా—ప్రభూత్తమా! మీయాజ్ఞానుసారము దేశసంరక్షణార్థమై యుద్ధమునకు వెడలినవాని కిట్టిదురవస్థ సంప్రాప్తించెఁగదా యని విచారించిన వింతేమి?

ఔరంగ — దేశద్రోహులును, దుష్టులు నగు ముష్కరు లగు కాబూలుమూర్ఖుల నతఁడు శిక్షించి జయింపకున్న, నాగతి యేమైయుండును. ఆతనిఋణము నే నెన్నటికిఁ దీర్పఁజాలను. మొగల్ సామ్రాజ్యమున కతఁ డొక్కఁడే వీరశిఖామణి. నాకు దక్షిణబాహువై వర్తించిన యాతఁడు మరణించినప్పుడు నే నెంత దురపిల్లినను నంతమనునది యుండునా? అతనిపుత్త్రుని నే నేవిధముగ నాదరించితినో (శ్యామసింహునిఁజూచి) మా శ్యామసింహమహారాజే సాక్షి.

గీ. సద్యశోవంతుఁ డైన య । శ్వంతసింహు
మరణవార్తను వినినంత । పరితపించి
ఎంతదుఃఖించితినొ దైవ । మేయెఱుంగు;
నాదు సామ్రాజ్య మూలకం । దం బతండు.

సమర్ — యశ్వంతసింహుని సుపుత్త్రుఁ డగుపృథ్వీసింహుని మరణింపఁ జేసి, సవతితల్లిప్రాపకమన్నట్లు, మీ రీవిధముగ దుఃఖించుట కేవలము సాహసమేయగునని సాహసించి పలుకుచున్నాను.

ఔరం — ఏమీ! ఇంచుకంతయు నాలోచింపకుండఁ బలుకుచుంటివి. నీ వెచటనుంటివో, యెవనియెదుట నిల్చియుంటివో, యెట్లు మాట్లాడుచుంటివో, నీ వెవఁడవో, నే నెవడనో, యించుక విచారింపకుండ, నొకబాలుని ప్రాణముల నపహరించితినని వచించుట సాహసమేయగును- ఏమి!! ఆపసివానిఁ జంపితినా!! అసత్యదోషారోపణమున నీ కేమైన లాభముండునా? ఎంతమాటంటివి? నాపుత్త్రుఁడని భావించి, స్వహస్తములతో, ముద్దార గౌరవించి, సన్మానపత్రములఁ దొడఁగితినే?

సమర్ — విషపూరితవస్త్రము లని యెఱుంగక ప్రాణములఁ గోల్పడిన



యమాయికబాలకునిఁ గూర్చి చింతింపని వా రెవరుందురు. పాపము — ఘోరము..... ...

శ్యామ - సమర్దాస్! నీ వెవనితో మాటాడుచుంటివో, యిపుడు నీయవస్థయెట్టిదో యెఱుఁగక, స్వప్నములోఁ బలువరించుచున్నావు.

సమర్ — బికానీర్‌మహారాజా! యెఱుఁగనివాఁడనుగాను- మీచక్రవర్తితో సంభాషించుచుంటిని.

ఔరంగ — (కోపోద్దీపితుఁడై) ఆవస్త్రములు విషపూరితము లని నీ వెట్లు నిశ్చయింపఁగలవు?

దుర్గా — ప్రభూ! ఆత్మ కాత్మయే ప్రమాణము. కోడివలెఁ గూయుచున్న లోకమే ప్రమాణము. లోకముమూయఁగ మూకుడున్నదేయన్నట్లు ప్రజల యనుమానముఁ బాప బ్రహ్మ శక్యమా?

సమర్దా — అనుమానమా? ఆవస్త్రముల ధరించిన వెంటనే, గిజగిజ కొట్టుకొని ప్రాణములఁ బాయుట యనుమానమా! కనులార నేనుజూచినపిమ్మటఁ బలికినది యనుమానమా! అట్లయిన లోకమంతయు ననుమానము. యశ్వంతసింహుని "అఫగనిస్థానమునకుఁ బంపి, యతనిఁ జంపించుటయు ననుమానము — అనంతర మతనిదారాపుత్త్రుల, నేడు ఢిల్లీయందు బంధించుటయు ననుమానము — చక్రవర్తియు, నీవు, నేను, సమస్తవిశ్వము ననుమానమే "మృగము మిథ్య — పలాయనము మిథ్య" యను వేదాంతమున కనుకూలమైన యీ యనుమాన మేరీతివచ్చినది? అనుమాన మనునది లేదు- సర్వము సత్యము- ప్రత్యక్షము.

కం. అనుమానమొ యవమానమొ?
జనుమా నిను నమ్ముకొన్న । బిడ్డను దండ్రీ

వెనుభూతమనై చంపితి
వను మాటలలో నొకింత । యనృతముగలదే?

దుర్గా—సహోదరా! శాంతింపవలెను. నీ విచ్చటికి వచ్చుటకు ము న్నెట్టిప్రతిజ్ఞఁ బల్కితివో జ్ఞప్తికిఁ దెచ్చుకొనుము.

సమర్దా—అన్నయ్యా! సమయానుకూలముగ నన్ను మేల్కొల్పితివి- క్షమింపుము- (అని ఔరంగజేబుఁజూచి) మే మమాయికుల మనియు, లోక మెఱుఁగని శిసువుల మనియు, బాదుషావారు తలంపవలదని ప్రార్థించుచున్నాను.

దుర్గా—ప్రభూత్తంసమా! అజ్ఞానియగు మత్సహోదరుని క్షమింప వలెను. మామనవి నొకించుక యాలింపవలెను.

ఔరం—మంచిది. సంసిద్ధుఁడను. నిన్నెన్నఁడైన నిరాకరించువాఁడను గానని విశ్వసింపుము.

దుర్గా—మార్వాడపురాధీశుండును—మృతుఁడు నగుయశ్వంతసింహుని దారాపుత్త్రుల వారిదేశమునకుఁ గొంపోవ ననుమతింప వలెను.

ఔరం—ఔను! నా యనుమతితోఁ బనియేమి?

దుర్గా—చిత్తము. శ్రీవా రనుమతింపవలెనని సేనాధ్యక్షుఁడు తహ బర్ఖాను పల్కుచున్నాఁడు.

ఔరం—(సేనాపతిఁజూచి) ఖాఁ! అట్లేలపల్కితివి?

తహబ—తమ రట్లాజ్ఞాపింతురేమోయని, యూహించి యట్లంటిని. ఇంతకు సేవకుఁడు స్వతంత్రింపవచ్చునా?

ఔరం—ఓహో! మఱచితిని. నావిశ్వాసమునకు, గౌరవమునకుఁ బాత్రుఁడై ప్రవర్తించిన యశ్వంతసింహుని ఋణముఁదీర్చు టకవకాశము లేకపోయెఁగదా యని చింతించి, యతనిరాణిని



ఢిల్లీనగరమున సత్కరించి, యీరూపమున సంతృప్తిఁ బొంద వలెనని తలంచి యట్లంటిని. మహారాజా! మీ రేమందురు?

శ్యామ—శ్రీవారికి యశ్వంతసింహునిపైఁ గల యనురాగము వెల్లడి యగుచున్నది.

సమర్—ఓహోహో! ప్రభూత్తంసమా! మీరుఁ దగిన సాక్షి యుండు. మీయిరువురకు దైవమేసాక్షి. చాలు నింతటితో విడిచిపెట్టుఁడు.

[illegible]

తుదకు [illegible] । మనుమకుం[illegible]
బ్రదుకనిచ్చినఁజాలు [illegible]

జగద్రక్షకా! రాజాధిరాజా! తమ భ్రూభంగమున [illegible] ము భీతిల్లను. శ్రీవారిచిఱునవ్వులకు మాత్రము జంకెదను. మీ కో వైరముకంటె బాంధవ్య మపాయకరము పృథ్వీసింహుని వధించి నట్లు వానిసంతానసహితముగ రాణిని జంపఁదలంచినట్లు స్పష్ట మగుచున్నది. మీసత్కారమునకుఁ బదివేలనమస్కారములు. దయయుంచి విడిచిపెట్టుఁడు. రాజాధిరాజా!

గీ. కుటిలభావయుక్తచిత్తుఁ డౌ । కుతలవిభుఁడు
బంధుభావంబుఁజూపుట । భద్రమగునె?
ఘోరవిషవహ్నిఁబూను కాకోదరంబు
సూనహారాకృతింగొన్న । శుభకరంబె?

దుర్గా—సమరదాస్! నీ విచటినుండి తొలఁగిన మేలగును. నాకార్య మునకు భంగముగాఁ బ్రవర్తించెదవు.

సమర్—మంచిది. ఇపుడే పోవుచున్నాను. చక్రవర్తిగారికిఁ జిన్న మనవి. మీ పూర్వులవలె కామవికారమునకు లోఁబడి వివాహాదిదుష్కృత్యముల నొనరింపక, నిజధర్మానురక్తిఁ బ్రవర్తించి, మాకు సంతోషదాయకుఁడైన ప్రస్తుతచక్రవర్తిని మేము గౌరవింపకపోము. మీరు మాయందు దయయుంచి పృథ్వీసింహున కొనరించిన సత్కారముతో సంతృప్తిఁ బొంది, సంతానయుతముగ రాణినివిడిచిన మీకుఁ గృతజ్ఞులమై యుందుము. "ఔరంగజీబు నిజమగు మహమ్మదీయుఁ" డను ప్రఖ్యాతియు దిగంతముల వ్యాపించును.

(అని నిష్క్రమించును.)

ఔరం—(దర్బారునుండి నిష్క్రమించుచున్న సమర్దాసు నెదుర్కొనఁబోయిన సేనాధిపతిని వలదని వారించి, దుర్గాదాసునిఁ బరికించి) దుర్గాదాస్! నిన్నుఁబట్టి సమర్దాసుని విడిచిపెట్టవలసి వచ్చినది. అతఁడాడినమాటలలో నేను నిజమగు మహమ్మదీయుఁడ ననునంశముమాత్రము సత్యము. నాధర్మమును, నామతమును నభివృద్ధిఁ జేయఁదలంచియే రాజ్యభారమును భరించితిని. నిరపరాధుల శిక్షించువాఁడఁ గాను.

దుర్గా—సత్యము. మీరు చెప్పినది బాగుగనున్నది. ఆమాటకేమి గాని మీ కిసుమంతయుఁ గలలోనైన హానిచేయని యశ్వంతసింహునిదారాపుత్రాదుల హింసింపఁదలంచిరేల? మీగూఢభావ మెఱుంగుటకు మానవమాత్రులు చాలరనియు నెఱుంగుదును.

ఔరం—నేను వారిని హింసింపవలె నను కోరికతో నెట్టికార్యముఁ జేయను- (అని శ్యామసింహునిఁ జూచి పొమ్మనిసంజ్ఞఁ జేయును. అతఁడు మెలమెల్లఁగ వెడలిపోవును)..........దుర్గా



దాస్! రాజనీతివిశారదుఁడ వగు నీయెడ నా చాతురీగరిమకు విలువయుండదు. సత్యముఁ బలుకుచున్నాను. నీతో మఱి చెప్పనేమి? ససంతానముగ రాణినిఁ గోరుచున్నాను.

దుర్గా—మీ కిట్టికోరిక గలదని యెఱుంగుదును గాని యిట్టి కోరికకు దగినంతకారణ ముండవలదా? మహారాణి—స్త్రీ—ఆమెపుత్త్రుఁడు—సద్యోజాతుఁడు. వీరితో మీ కేమి ప్రయోజనము.

ఔర—ప్రభుత్వమువారు కారణకార్యములు భృత్యుల కెఱింగింపరు.

దుర్గా—అట్లయిన నాప్రార్థనము వ్యర్థమైనది.

ఔరం—అట్లే భావింపవచ్చును. రాణి నా కర్పించుటకు నీవు సమ్మతింపవలెను.

దుర్గా—నేను బ్రదికియుండఁగ నట్లెన్నటికి జరుగదు.

ఔరం—నిన్ననేకవిధముల బహూకరింతును.

దుర్గా—మీచే బహూకరింపఁబడినవారికంటె నే నతీతుఁడనని యెఱుఁగుఁడు. నాచేత ఖడ్గముండఁగ, నాముక్కుకొన నూపిరియుండఁగా, రాణి కెట్టియపాయము వాటిల్లదు. మీ రేమియుఁ జేయఁజాలరు. చిత్తగింపుఁడు. పోయివచ్చెదను. (అని నిర్గమించుచుండ)

ఔరం—నిలువుము. అట్లయిన నీవు బ్రదికియుండరాదు. (సేనాధిపతిఁజూచి) తహబర్! నాటకముఁ జూచుచుంటివా? దుర్గాదాసుని బధింపుము.

(సేనాధిపతి దుర్గాదాసుని సమీపించును. దుర్గాదాసు డాగ్రహించి ఖడ్గముఁజూపి) అప్రమత్తుఁడవై మెలంగుము. నేను రణమునకు మరణమునకు సంసిద్ధుఁడనై యున్నాను. (అని

పలికి కటిలంబితమైన బిగులూదును. వెంటనే ఐదుగురు యోధవరులు దర్బారుఁ బ్రవేశింతురు.)

దుర్గా—చూచితివా చక్రవర్తీ! ఇట్టే అవసరమైన అయిదువందల మంది రాఁగలరు. మేము రాజపుత్రులము.

సీ. అరిరాజలోకసం । హారఖేలనలీల
నల్లేరుపైబండి । నడక మాకు
మ్లేచ్ఛశరీరమాం । సచ్ఛేదనక్రియ
షడ్రసోపేతభో । జనము మాకు
విపులసేనావ్యూహ । భేదనోద్యోగంబు
కరతలామలకంబు । కరణి మాకు
ప్రళయాగ్ని కణతుల్య । గుళికారణప్రౌఢి
మృదుపుష్ప కందుక । క్రీడ మాకు
గీ. మానమే రాజపుత్త్రాభి । మానధనము
కదనరంగంబె విను మాకు । సదనసీమ
తగని యధికారగర్వంబుఁ । దక్కనీము
శుష్కయత్నంబు లేల తు । రుష్కరాజ.

ఔరం—మంచిది. దుర్గాదాస్! వెంటనే యీస్థలము విడువవలెను. నీధైర్యసాహసంబులకుఁ జాల సంతోషించితిమి. (సహచరులతో దుర్గాదాసుఁడు వెడలినపిమ్మట, సేనానాయకునిఁ జూచి) తహబర్! కొంతసైన్యముతో వెంటనే యశ్వంతసింహుని గృహము ముట్టడింపుము. తత్ప్రయత్నమున నుండుము.

(నిష్క్రమించును.)

తహ—చిత్తము. (అని అనుసరించును.)



## ద్వితీయదృశ్యము.

రాజాంతఃపురమందలి సామ్రాజ్ఞియగు గుల్‌నార్ విశ్రామమందిరము.

గుల్నార్—(సుఖాసీనయై తనలో) యోధపురరాణీ! నీ వొకనాఁడు గర్వముచే కన్నుగానక నన్నౌరంగజేబుచేఁ గొనితేఁబడిన దాసి నని యెకసక్కెములాడితివి. ఆ నీగర్వమణంచుటకు నేఁడు నాకు దగిన యవకాశము చిక్కినది. నీభర్తను కాబూల్ దేశమునకుఁ బంపి చంపించినదానను నేనే! విషప్రయోగముచే నీజ్యేష్ఠపుత్రుని మరణింపఁజేసినదానను నేనే! ఇపుడు నీసమక్షమున నీచిన్నతనయునిఁ జంపింప సమకట్టి నిన్నిచటికి రావించినదియు నేనే! ఈగుల్నారే నీచేఁ దన పాదోదకములఁ బానము చేయించును. అనంతర మీసమస్త మొగల్ సామ్రాజ్యమును శాసించుచున్న నేనే నీ ప్రాణములఁదీసి నీ రక్తమును గ్రోలి, నాక్రోధపిపాసను శాంతిపరచుకొందును. ఔరంగజేబు కేవలము నాచేతి కీలుబొమ్మ వంటివాఁడు; కాని లోకమన్యథా తలంచుచున్నది. అది వారి మౌర్ఖ్యము-వారి యజ్ఞానము- వారి యమాయకత్వము-లేకున్నచో ! నౌరంగజేబునకు యశ్వంతసింహుని భార్యాపుత్రులతో నేమిప్రయోజనము గలదో వారు యోచించియే యుందురు.

[అయ్యవసరమున నౌరంగజేబు ప్రవేశించును.]

గుల్—ఎవరువారు? చక్రవర్తులా? బందగీ, జహాఁపనా!

ఔరం—గుల్‌నార్! నీ వేకాకినివై యేమిచింతించుచున్నావు? నడవనికి నూరేండ్లు నిండినవి. నీకన్ను లరుణితములైనవే.

గుల్ — జోధపురపట్టమహిషికొఱకై నిరీక్షించుచున్నాను. ఆమె యెచ్చటనున్నది?

ఔరం — ఆమె యింతవేగముగఁ బట్టువడదు.

గుల్ — ఏమీ! పట్టువడదా?

ఔరం — దుర్గాదాసామెను నాకర్పించుటకు సమ్మతింపక దర్బారునుండి వెడలిపోయెను. ఇంతవఱకు నతఁడు ప్రభుభక్తిపరాయణుండని విశ్వసించి మోసపోతిని. కాని యత డిట్లు తిరుగుబాటొనరించునని స్వప్నమందైనను తలంచకుంటిని.

గుల్ — ప్రాణములతో దర్బారునుండి పోఁగలిగెనా?

ఔరం — ఔను. అతఁడు ససైన్యముగ వచ్చియుండెను.

గుల్ — (కపటపునవ్వును వెలిబుచ్చి) అహ్హాహ్హా! పరాక్రమశాలియు, నరినిషూదనుండును, జయశీలుఁడు నగు మొగల్ సామ్రాట్టునకు సైన్యము లేక దైన్యము వచ్చెఁగాఁబోలు! ఛీ! ఛీ!

ఔరం — ప్రేయసీ!........

గుల్ — పెక్కుపలుకు లాలించుటకు నాకు సమయము చాలదు. నేటిసాయంకాలమునకుఁ బూర్వమే నాసమక్షమున జోధపురమహారాజ్ఞిని దెచ్చి నిలుపవలెను

ఔరం — గుల్నార్! యశ్వంతసింహునిగృహమును ముట్టడింప సైన్యములఁ బంపితిని.

గుల్ — మంచిది.......... (నిష్క్రమించును.)

ఔరం — (ఆమె ననుసరించుచుఁ దనలో) ఆహా! ఏమి యీదుర్గాదాసుని సాహసము! నిండుదర్బారులో — నాకట్టెదుట — కరవాలమును దూసి — నన్నుఁదర్జించుచు వెడలెనే! వీరశిఖా



మణియుఁ దనకు ప్రభువు నగు యశ్వంతసింహునకు నిట్టిసాహసము లేదు. మంచిది. పరికించెదఁగాక.

(అనుచు నిష్క్రమించును.)

## తృతీయ దృశ్యము.

మొగల్ సేనాపతియగు దిలేర్ ఖాన్ మందిరము.

[ప్రధానసేనాపతి తహాబర్ ఖాన్, దిలేర్‌తో సంభాషించుచుండును.]

దిలేర్ — ఖాన్ సాహేబ్! మీరు బలే గొప్పవస్తాదులవారని యందురే. మీమాటవిన్న నాగుండె ఝువ్‌మనుచున్నది. రాఠోర్ సేనాపతి మీముక్కునకు సూటిగఁ గత్తివిసరినాఁడా? అబ్బ — అబ్బ — వాఁడు బలేధీరుడన్న తప్పులేదు.

తహాబర్ — ఏమని చెప్పుకొందును. చెప్పిన వినువా రెవరు? పరిహాసములాడువారేకాని, నాదుఃఖము నణఁచువా రెవరు — ఆనాఁడు దర్బారులోనే వాని పరాక్రమ మెంతో నాకు బోధపడినది. కోపము వచ్చినప్పుడు వాని ముఖముఁ జూడలేము. పెద్దపులిముఖమైనను జూడవచ్చును — కాదు — కాదు — మృత్యుముఖమైనను జూడవచ్చును — ఎంతకోపము — కోపమునుమించిన పరాక్రమ మెంతని చెప్పుదును — పరాక్రమమునుమించిన నైపుణ్య మిట్టిదని కొనియాడఁగలనా? అహాహా! అతినైపుణ్యమున విసరినకత్తిఁజూచి తత్తఱిల్లితిని. నీతోఁ జెప్పకేమి?

దిలేర్ — మీరు తటకాపడి చూచుచు, నిలువబడిరన్నమాట! ముక్కునకు తిన్నగా విసరియుండెనా?

తహాబర్ — ఔ నల్లే, ఆశ్చర్యమున నేను కఱ్ఱబొమ్మవలె నిల్చి దిగ్భ్రమఁ బొందితిని.

దిలేర్—మీ యొఱలోని కత్తి యేమైనది?

తహబ—సమయము చిక్కకుండెను. అంతలో కత్తి నూడబెఱికి, ఇంతలో మాయమయ్యెను.

దిలేర్—ఆఁ! తెలిసినది. కనుకట్టు కట్టినాడు. అతఁడు వెడలినపిమ్మటఁ గత్తిబట్టినారా?

తహబ—లేదు. తరువాత నేను నాముక్కున్నదో లేదో చూచుటకై, ముక్కుపై వ్రేలిడికొంటిని. సందేహము నివర్తించెను. యశ్వంతసింహుని గృహము కుప్పగ మనము ముట్టడింపవలయును. త్వరగ రండు!

దిలేర్—ఈసమయమున నొకక్షణమైనను విరామము లేకుండ నన్నీడ్చుకొనిపోవ వచ్చినారా? ఈసామాన్యకార్యమును తమరేల చేయరాదు?

తహబర్—దిలేర్ ఖాఁ! యుద్ధనైపుణ్య మెఱుంగని రాజపుత్రులతోనా, నన్ను పోరాడమనుచున్నావు? ఆపని నావలనఁగా నేరదు. నీవే రావలయును.

దిలేర్—రజపుత్రుల సైన్యసంఖ్య యెంత?

తహబర్—రెండువందలు మాత్రమే.

దిలేర్—ఖాఁసాహెబ్! మీరుపోయి అయిదువేల సైనికులతో సిద్ధముగనుండుడు. నేను మీవెనువెంటనే బయలుదేఱి వచ్చెదను.

(తహబర్ నిష్క్రమించును.)

దిలేర్—(ఆత్మగతమున) అసామాన్యసాహసికాగ్రమణులకు రాజపుత్రస్థానము గనివంటిది. వీరనుపమానపరాక్రమవంతులకు గురువులు. అట్టి ధైర్యశాలురతో పోరాడుట కష్టసాధ్యమే



యైనను, పాదుషావారియాజ్ఞ యనుల్లంఘనీయము గదా? (అవనతశిరస్కుఁడై) యశ్వంతసింహుడు మరణించినపిదప, నిర్భయుఁడైయున్న పాదుషాకు, నిపు డతనిపరివారముతోఁ బ్రయోజన మేమున్నదో తెలిసికొనవలయును.

(అనుచు నిష్క్రమించును.)

## చతుర్థదృశ్యము.

మీవారురాజ్యరాజప్రాసాదమున—రాణారాజసింహుని ద్వితీయపుత్రుఁడగు జయసింహుని మందిరము.

[జయసింహుని ద్వితీయభార్య కమల సుఖాసీనయై యుండును.]

కమల—హా! స్వామి! ఇంత స్వల్పకాలమున మిమ్ముల మాయావాగురలోఁ ద్రోసివైచినదే! ఎంతటిసాహసికురాలు! కానిమ్ము. పెద్దరాణి! నీయెత్తునకు పైయెత్తును వేయుచున్నాను. నిన్నిఁక నా పదతలమునఁ బడవేసి నలిపివేసెదను. భీమసింహా! నీవు రాజువయ్యెదవా? కావచ్చును. మఱి నీభార్య మహారాజ్ఞి కావచ్చును. కాని యట్లు కాఁజాలరు. నాభర్త రాణావారి కత్యంతప్రియపాత్రుఁడు. విశేషించి యతనికి స్వహస్తములతో రాజబంధనమును కట్టియున్నాఁడు. (పండ్లు కొఱుకుచు) ఇఁక భీమసింహుఁ డెట్లు రాజగునో, యతని స్త్రీ రాణి యెట్లుఁ గాఁగలదో చూచెదఁగాక! అన్నదమ్ము లిరువురకును గలహము గూర్చితినిగదా! దాని పరిణామ మెట్లుండునో పరికింపవలెను.

[రోదనసేయుచు దాది పరుగెత్తివచ్చును.]

దాది—ఓలమ్మో! ఓలమ్మో!! అబ్బ!!

కమల—ఏమయ్యెనే?

దాది —మరేముందోలమ్మో! పాంకుయుద్ధమోలమ్మా!

కమల —ఏమైనదే? త్వరగ చెప్పకున్నావేమి?

దాది —ఏటా? ఏటనమగుతా?. దక్షయజ్ఞమోలమ్మ!

కమల—వేగముగ చెప్పెదవా, శిక్షకు పాత్రురాల వగుదువా ?

దాది —చిన్నరాజు పెద్దరాజుకాలిని కత్తితో నరికినాడమ్మా! ఓహో అదేమి రక్తమోలమ్మ! అంతలో తండ్రొచ్చి, పెద్దోడ్కి చీవాట్లు పెట్టినాడమ్మా!

కమల —మంచిపనియైనది.

దాది—అనగ నొద్దుసుమీ! లోకమంతా పెద్దోడే మంచోడంటారు. సిన్నోడు సెడ్డమనిషికాదు కానమ్మా, నువ్వే జగడాలపెద్దమ్మవు తల్లీ! నీనుంచమ్మా, పెద్దోడికి మాటొచ్చింది. ఏడుకాండల రామాయణం తండ్రిచేత యినుకున్నాడు.

(భయమును నటించుచు నిష్క్రమించును.)

[ఆసమయమున జయసింహునిప్రథమభార్య సరస్వతి ప్రవేశించును.]

సరస్వతి—కమలా! కమలా! ఇట్టి దుష్కార్యములచేయుట నీ కుచితమని తోచినదా యేమి? అన్నదమ్ములిరువురకుఁ గలహములఁ గల్పింతువా?

కమల—అది కేవల మసత్యము. ఇందు నేనేమియును జోక్యమును కలిగించుకొనుట లేదు. సింహాసనముకొఱకు సహోదరులు పోట్లాడుట సహజమేకదా! న్యాయముగ నాభర్తయే సింహాసనారోహణార్హుడు. భీమసింహుడే తొలుత జగడమాడెను. అది యతనిదోషము.

సరస్వ—భీమసింహుని కీరాజ్యవాంఛ లేదని రూఢిగఁజెప్పగలను. ఉన్నను అతడు జ్యేష్ఠు డగుట నతనికే రాజ్యము చెందును.



కమల—జ్యేష్ఠత్వ మటులుండగా నాభర్తృజన్మదినమున రాణావారతనికి స్వహస్తముల రాజబంధనమును (పసుపుదారము) కట్టినారు; కావున నాభర్తకే సింహాసనము చెందును.

సరస్వ —అట్లయినచో నీవు ప్రయత్నించుట శ్రేయస్కరము. కాని, జగడములఁ గల్పింపవచ్చునా?

కమల —నాభర్తవిషయమై నీవు చింతింప నవసరము లెదు.

సరస్వ అతఁడు నాభర్త కాడుకాబోలు.

కమల—అట్లయిన నతనిని సమాధానపఱచుము.

(అని దృతగామిని యైపోవును.)

(అంతట జయసింహుడు ప్రవేశించును.)

జయ—ఎవరువారు? సరస్వతీ! నీవా? కమల యనుకొంటిని.

సరస్వ—కమల యనుకొంటిరా నాథా! ఎంతపొరపా టొనరించితిరి? ఆపొరపా టంతలో మాయమయ్యెను! పొరపాటున నన్ను కమలగా భావించుటకు పూర్వ మొక్కసారి "ప్రాణేశ్వరీ" యని యేల పిలువకుంటిరి? నే నాపలుకుల విని స్వర్గసౌఖ్యమును పొందెడుదాననే!

జయ —సరస్వతీ! నా కిచ్చోట నుండుటకు సమయము చాలదు. అత్యావశ్యకకార్య మొకటికలదు. పోవలయును.

సరస్వ—నిలువుడు! నిలువుడు! నాహృదయవేదనము గూర్చి తమతో విన్నవించుకొనుటకై నే వచ్చుటలేదు. ఒక ప్రశ్నము నడుగ వచ్చినాను. నేఁ డన్నగారితో జగడమాడిరా?

జయ— అది నాదోషముకాదు. నేను క్రోధావేశమున అన్నగారి పాదమును గాయపఱుప నతడు నామెడను గట్టిగఁ బట్టుకొనెను.

సరస్వ—ప్రభూ! కమల మిమ్ముల నీవిధముగ నాడించుచున్న దని యెక్కనాడైన తలఁపకున్నారు. భీమసింహునకు రాజ్యాపేక్ష సుమ్మాటికిని లేదు. అన్నదమ్ము లిట్లు కలహించుట పాడి గాదు ప్రభూ! ఇఁకనైన మేలుకొండు! కమల మీహితచింతకురాలు కాదని విశ్వసింపుడు. అదిగో! మీ అన్నగారు వచ్చుచున్నారు. నేను బోయెదను.

[భీమసింహుఁడు ప్రవేశించును]

భీమ—(మృదుస్వరమున) సోదరా! జయసింహా!

జయ—(పలుకక మౌనము నూనును.)

భీమ—(మరల) జయసింహా! అది నాదోషము. కోపము నణంచుకొనలేక యట్లు పొరపాటొనరించితిని. నన్ను క్షమించుము!

జయ—(మాటలాడలేదు.)

[ఆయవసరమున రాణా ప్రవేశించును]

రాణా—(భీమసింహు నుద్దేశించి) నాయనా! జయసింహుని కరవాలమున నీపాదమును గాయపఱచెనా?

భీమ—అది యంతప్రమాదకరము గాదు.

రాణా—ఏదీ పాదమును జూపుము.

(భీమసింహు డట్లు చేయును.)

రాణా—హా! నేను బాగుగ నాలోచింపక విచారణ జేసితిని. భీమసింహా! ఇదిగో నాకత్తి నందుకొని నీసహోదరుని శిక్షింపుము!

భీమ—అట్లు చేయఁజాలను. తండ్రీ! జయసింహు డజ్ఞాని.

రాణా—అట్లు కాదు. నేను జయసింహుని పక్షపాతినని లోకము నన్ను నిందింపకపూర్వము నీ వీకత్తిని గైకొని వానిని శిక్షింపవలయును. కతిపయదినములనుండి మీయిరువురును రాజ్యమ్మునకై జగడమాడుచున్నా రని వినుచున్నాను. నా మరణానంతరము నిట్లు కలహమాడెదరని భయపడుచున్నాను. కాన నేడే యుద్ధమొనరించి గెలుపొందినవారు సింహాసనము నధిరోహింపవచ్చును.



భీమ—నాకు రాజ్యకాంక్ష లేదు నేను జగడ మాడఁదలచుకొనలేదు.

రాణా—దీనికి ప్రమాణము?

భీమ—(మందహాసమున) ప్రమాణమా? ఈక్షణమునుండి నేను స్వరాజ్య పరిత్యాగ మొనరించుచున్నాను. ఈరాజ్యమున జలపానముఁగూడ చేయనని ప్రతిజ్ఞ చేయుచున్నాను.

రాణా—(కొంతదనుక మౌనము వహించి, కన్నీరు గార్చుచు) భీమా! నిర్దోషివగు నీవు తమ్మునికై కఠినప్రతిజ్ఞను బూనితివి. కాని యాప్రతిజ్ఞ మీవారురాజ్యమంగళము కొఱకు సుమా! విదేశములకు పోయినను దేశక్షేమము నారయుచుండుము. భగవంతుడు నీకుఁ దోడ్పడుఁగాక.

భీమ—నా దేశక్షేమమునకై ప్రాణములనైనఁ ద్యజింతును. నమస్కారములు.

(అందఱు నిష్క్రమింతురు.)

## పంచమదృశ్యము.

### యశ్వంతసింహుని గృహము.

[సమర్దాస్ జోధపురసామంతగణము- సంభాషించుచుందురు.]

భగవాన్ సింహు—సమర్దాస్! అట్లయిన నీ వచట దుర్గాదాసుని తలంపునకు విరుద్ధముగఁ బ్రవర్తించి వచ్చితివా యేమి? నిన్నుఁ జూడ సంశయముగనున్నది.

సమర్దాస్—నేను క్రోధము నణంచుకొనలేక పోతిని.

భగవాన్—అట్టివాఁడ వచటికిఁ బోనేల?

సమర్దాస్ — ఏలపోవలయునని యడుగుచున్నావా? ఆపాపాత్ముని జూడఁదలంచి వెడలితిని. వాని నెదిరించి ప్రసంగింప నిచ్చగించి పోయియుంటిని. వానిని బ్రతిమాలుటకు పోలేదు. ఆపని దుర్గాదాసే చేయవలయును.

ముకుందదాస్ — చక్రవర్తి దుర్గాదాసును బంధింప లేదుకదా?

సమర్దాస్ — (ఉత్తేజితుఁడై) వానితరమా?

సుబలసింహుడు — దుర్గాదాసుఁ డతనికి సులభముగఁ బట్టుపడఁడు.

ముకుంద — అదిగో! సేనాపతి తురగారూఢుఁడై శరవేగమున వచ్చుచున్నాఁడు! క్రిందికిఁబోయి సమాచార మరయుదము రండు.

(అందఱును దుర్గాదాసు నెదుర్కొనఁబోదురు)

[దుర్గాదాసు ప్రవేశించి]

దుర్గా — సిద్ధముకండు! సావధానులరై యుండుడు!

సమర్ — ఎందులకు?

దుర్గా — ఆత్మరక్షణార్థము.

సమర్ — సమాచార మేమి?

దుర్గా — విస్తరించి పలుకుట కవకాశము లేదు. పాదుషా యశ్వంతసింహుని భార్యాపుత్రుల విడువ సమ్మతింపక, యీభవనము ముట్టడించుట కైమవేలమంది సైనికులఁ బంపుచున్నాఁడు. ఆరాణి ప్రాణములను కాపాడు భారము మనది.

ముకుంద — రక్షణోపాయ మేమి?

దుర్గా — ప్రాణదానమే రక్షణోపాయము. సామంతులారా! మహారాణిని, ఆమెచిన్నతనయుని భద్రముగఁ గాపాడుటకై ప్రాణత్యాగము చేయ మీరందఱును సంసిద్ధులైయున్నారా?

అందఱు — తప్పకుండ సత్తే యొనరించెదము.



[అంతలో మహారాణి ప్రవేశించును.]

మహారాణి — యోధపురమహిషి కెంతమాత్రము జంకు లేదు. ఆమెకై మీరు చింతింపవలదు; కాని, యోధపురవంశప్రదీపకుని — యశ్వంతసింహునిచిన్నబాలుని రక్షింప నుపాయ మరయుఁడు.

దుర్గా — తల్లీ! భయమువలదు. కుమారునిఁ గొనితెండు.

(రాణి లోనికేగును)

దుర్గా — సమర్దాస్! కాసిమ్‌ను పిలువుము! (ముకుందు నుద్దేశించి) దాదా! ఆవల నొక పెద్దగంపగల దద్దానిఁదెమ్ము!

[కాసింతో సమర్దాసు ప్రవేశము]

కాసిం — (దుర్గాదాసునకు నమస్కరించి) హుజూర్! క్యా హుకుమ్?

దుర్గా — నీవు రాజకుమారుని, మొగల్ సైన్యముల కంటఁబడనీయకుండ భద్రముగఁ గొనిపోయి రక్షించవలెను.

కాసిం — అచ్ఛా! హుజూర్!

(ముకుందుడు గంపను తీసుకొనివచ్చును.)

దుర్గా — కాసిం! నీవు ముసల్మానుడవగుటచే మొగలు లెవరు నిన్నుపోల్చుకొనలేరు. ఈమిఠాయిగంపలో రాకుమారునుంచి, నేను నీకిదివఱకు చూపిన దేవాలయమునకు గొనిపోయి, శిశువు నామందిరపురోహితుని కప్పగించుము. ఆపైకర్తవ్యము నతడే యాలోచించును.

కాసిం — జో హుకుం.

[కుమారునితో రాణి ప్రవేశము]

దుర్గా — మహారాణి! నాకంఠమున ప్రాణమున్నంతదనుక రాకుమారున కెట్టియపాయమును రానీయను. ఈకాసిం ముసల్మా

నుడే మైనను, నాకత్యంతాప్తుడు. భయపడక శిశువు నాతని కొస్తు లందుంచుము !

రాణి — నీ వభయమిడిన పిమ్మట నాకేమియు భయము లేదు.

(అనుచు కుమారు నతనిచేతుల నిడెను.)

(తిరిగి బిడ్డనొకసారి కౌగలించి, ముద్దాడుచుండెను)

దుర్గా — సమయము లేదు. తల్లీ ! విళంబనము సేయవద్దు !

రాణి — (మరల మరల బిడ్డను ముద్దాడుచు) కాసిం ! ధర్మమే నీకును నాకును సాక్షి. (అని కుమారుంజూచి)

చం. పుడమిని పేదసాయిననుఁ । బుత్త్రుఁడవై జనియించియున్న నీ
యిడుములు లేక వర్ణివయి । యెచ్చటనైన మెలంగి కాలమున్
గడపఁగ నోపియుందువు సు । ఖంబులఁ జెందుచు నాదు పాపపుం
గడుపున నేలపుట్టితివి । తుర్మాపతు లెల్లరు గొడ్డువోయిరే.

(అని కుమారుని కాసిమ్‌నకు నందిచ్చెను-కాసిమ్ శిశువును గంపలోఁ బెట్టి కొంపోవుచుండ)

సమర్దాస్ — ఒకవేళ, కాసిం ! శత్రుహస్తగతుండైన నేమిచేయవలెను.

మహారాణి — అట్లు శత్రువులకు జిక్కినచో, యీనాకత్తితో శిశువును పొడిచి చంపుము, కాసిం ! (అని కత్తి నతనికిచ్చును)

(కాసిం నిష్క్రమించును)

దుర్గా — అదిగో ! మొగల్ సైన్యముల కగ్రవర్తియై దిలేర్ ఖానుడు వచ్చుచున్నాడు.

సమర్ — అదిగో ! శత్రువులు తుపాకులఁ బేల్చుచున్నారు.

ముకుంద — స్త్రీజనరక్షణోపాయమును వెదుకవలయును.

సుబల్ — అదిగో కవాటములన్నియు బద్దలు చేయుచున్నారు ! స్త్రీజన మిచటకు వచ్చుచున్నవి !



దుర్గా — (ఆవచ్చిన నారీబృదము నవలోకించి) సహోదరీమణులారా! అధికముగ మాట్లాడుటకు అవకాశము లేదు. ఈదృశాపాయకరవేళల క్షత్రియస్త్రీ లేమిచేయవలయునో మీకే తెలియును. అదిగో మీకొరకు గాగది యేర్పఱచి యుంచితిని. దానంజొచ్చి స్వహస్తముల నగ్గానికి నిప్పంటించుకొనుడు. అదిగో! మీ రాపని చేయకముందే శత్రువుల తుపాకు లాగది కవాటముల కాల్చుచున్నవి. త్వరపడుడు !

(స్త్రీజన మేకగ్రీవముగ) మహారాణీకి జయ్ !

రాణి — జయమా ! నాకు మృత్యువే జయము ! సోదరీమణులారా! (చేతులజోడించి) పరమేశ్వరుడు మిమ్ముల రక్షించుగాక! ఘోరాతమరణము నొంది స్వర్గమున కేగుడు. నా కింక నీలోకముతో కొంతసంబంధము గలదు. నేను మీతో రాజాలను. పొండు !

(స్త్రీలందరును మంటలో దుముకుదురు.)

రాణి — దుర్గాదాస్ ! నేను పోయివచ్చెదను. (నిష్క్రమించును)

దుర్గా — సమర్దాస్ ! ఒక్కసారి కౌగలించుకొనుము. (సహోదరులిరువురును గాఢాలింగన మొనరించుకొనిన పిదప శత్రువుల నెదుర్కొన బోదురు)

## షష్ఠదృశ్యము.

### ఔరంగజేబు భవనము.

ఔరం — (అటునిటు దిరుగుచుఁ దనలో) ఏమిది! నేను విన్నది సత్యమే యగునా? కాదు. ఇది కేవల మసత్యము. నేను స్వప్నమును గాంచుచున్నానా యేమి? అట్లైన జాగ్రదవస్థయుందుఁడ నేల? మేలుకొనుమా రాలోచనాంబుధి నోలలాడుచేల.

స్వప్నములఁ గాంచినట్లుండుట ప్రకృతిసిద్ధమే. యశ్వంతసింహునిరాణి యత్యంత స్వల్ప సైన్యముతో దుస్తరమగు మొగల్ సేనాసముద్రమును దాటి యదృశ్య మయ్యెనట!! ఇది సంభవమగునా? ఇందేదియో రహస్య మున్నట్లు నాకుఁ దోచుచున్నది. ఎవరక్కడ?

సేవకుడు —(వంగివంగి సమీపించుచు) ఖుదాబంద్!!

ఔరం—అనన్యసాధారణప్రజ్ఞావంతుఁడగు మన దిలేర్ ఖానుఁ డతిస్వల్పసంఖ్యఁగల రాజపుత్రవీరుల ధాటికోర్వఁజాలక, పరాజితుఁ డయ్యెనని వింటిని. ఈవార్త సత్యము కావచ్చునా?

సేవకుఁడు—ఔను. సత్యమే. ప్రభూ! నేను యుద్ధమును ప్రత్యక్షముగఁ జూచియుంటిని. ఓహో! ఏమియుద్ధము!! ఆశ్చర్యము! భయము! యశ్వంతసింహుని భవనమునంగల నాల్గుద్వారములకడ నాయుధపాణులై పోరాడిన యోధవరులఁ గాంచుటకల దేవేంద్రుడే కావలయును. మహాప్రభూ! ఒకవంక భవనాంతర్భాగమును జొచ్చిన మొగలుల హస్తగతము కాకుండుటకు, తామున్నగదికి స్వహస్తముల నిప్పంటించి, యందు ప్రాణత్యాగ మొనరించుచున్న నారీజనముమాట నటుండనిచ్చి లోపలఁ జొచ్చి కవాటముల వ్రక్కలు సేయుచుఁ దుపాకిగుండ్లతో కుడ్యములఁ బడద్రోయుచున్న మనవీరులఁ దునుమాడుచున్న చండీస్వరూపిణియగు జోదపూర్ మహారాణియు—మందిరబహిర్ద్వారము చెంతనుండి, శత్రువులు లోపలకురాకుండఁ గాపాడుచున్న రాథోరు సేనాపతియగు దుర్గాదాసుఁడును- అతనితమ్ముఁడును. ఓహోహో! ఏమి యాసహోదరులసాహసము! రెండువేలసంఖ్యకు మించిన సైన్యమును గని, యణుమాత్రమైన జంకకుండ, ప్రళయకాల



మేఘముల నడుమనుండి బయలువెడలు తటిల్లతలవలె విరాజిల్లు కత్తుల నూడఁబెఱికి యాసేనాసమూహము నవలీల భూదేవికి బలిదాన మొసంగినంత మహారాణిఁగాంచి దిగ్భ్రమఁబొంది యేమియుఁ జేయలేక త్రోవనొసంగిరి.

[అంతలో గుల్ నార్ ప్రవేశించును.]

గుల్—ప్రాణేశ్వరా! నేను వినినది సత్యమేయగునా?

ఔరం—(అవనతశిరస్కుండై) ఔను.

గుల్—(రోషకషాయితలోచనయై) ఓహో! ఈవిధమగు ధైర్యవిహీనమై పరాక్రమలేశమును లేని సైన్యముతో మీరు సమస్త హిందూస్థానమును పాలింప సాహసించినారా? కార్యము లేదు. చక్రవర్తులయ్యు, నాయొక్క సాధారణమగు కోర్కెను చెల్లింపఁజాలకపోతిరే!!

ఔరం—నాయథాశక్తిని ప్రయత్నించి విఫలుఁడనైతిని.

గుల్—ఇదియా, మీయథాశక్తి? సామాన్యస్త్రీయొకర్తె పెక్కుమందిపురుషుల కనులఁగప్పి మాయమయ్యెనే! ఛీ! ఏల మీ పరాక్రమములు? చక్రవర్తిబిరుదములకు మీరు రనర్హులని చెప్పక తప్పదు.

ఔరం—మాట్లాడకుండును.

గుల్—ఇపుడు మహారాణి యెచటనున్నది?

ఔరం—రాణారాజసింహుని చెంత నున్నది.

గుల్—వెంటనే సైన్యములఁ బంపి మీవారును ముట్టడింపుఁడు. సంతానయుతముగ నామె నాకుఁ జిక్కవలెను. ఎసఁ జెడిద్సిన సరే.

ఔరం—ఆవిషయమునుగూర్చి యోచింపవలెను.

గుల్.—గుల్నార్ పలికినమీద నాలోచనముకూడనా? తత్క్షణము మీవారును ముట్టడింపుడు.

(నిష్క్రమించును.)

ఔరం.—(ఆత్మగతమున) ఈమాటను నేను విశ్వసింపజాలకున్నాను. రెండు వందలసైనికులతో రాజపుత్రులు మొగల్ సైన్యము నోడించుటయా? యశ్వంతసింహుని రాణి, యీ సేనావ్యూహములను భేదించుకొనిపోవుటయా? మఱియు నాసేనల కధ్యక్షుడనన్యసామాన్యబలపరాక్రమవంతుడగు దిలేర్ ఖానుఁడా? ఇందేదియో విశ్వాసఘాతుకత్వ ముండితీరవలయును. ఆఁ! ఏమనుచుంటిని? నాకు బాల్యమిత్రుండును, నాయౌవనమందు సహాయభూతుడును, వార్ధక్యమున మంత్రియు నగు దిలేరుఖాన్ నన్ను మోసపుచ్చుననియా తలంచుచుంటిని? అది యసంభవము- దోషము-పాతకము!!

[దిలేర్ ఖాన్ ప్రవేశించి]

దిలేర్.—బందగీ, జహాఁపనా!

ఔరం.—సేనానాయక! మన కపజయము సంభవించిన దని నే వినిన వార్త నిజమగునా?

దిలేర్.—ఔను. సత్యమే!

ఔరం.—యుద్ధముచేసి యోడిపోతిరా? భయపడి పలాయితులైతిరా?

దిలేర్.—శ్రీవారు సెలవిచ్చినట్లు రెండుకారణములవలనను, మన కపజయము వాటిల్లెను. ఓహో! ఆరాజపుత్రుల పరాక్రమము! ఏమి, వారియుద్ధనైపుణ్యము! మనసైన్యము లుద్రేకముతో శత్రువుల చెదరగొట్టి గృహాభ్యంతరమును జొచ్చిరి. ఘోరాఘోరిగ పోరాడిరి. కాని లాభము లేకపోయెను.



లోనున్న మనవారు నలుగురు ద్వారపాలకులచే హతులైరి. మందిరబహిర్ద్వారముకడ మేము దుర్గాదాసాదులతో యుద్ధ మొనరించుచుండ, కాలజలధరమధ్యమునుండి విద్యుల్లత వెలయు చందాన రాణి ముక్తకేశయై, ఆయుధపాణియై, మానడుమను దుమికెను. చండీస్వరూపిణి యగు నామెను, ఆమె వక్షస్థలమున నొకవస్త్రముతో బంధింపబడియున్న యాఁడుబిడ్డను గాంచినంతనే నేను భయపడి "కొట్టుము- కొట్టు"మని పురికొల్పఁ బ్రయత్నించితిని; కాని కంఠము రుద్ధమయ్యెను. కరవాలము నెత్తబోవ నది క్రింద జాఱిపడియెను. ఆమోహన మూర్తిని గాంచుచు నే నట్లె నిలువఁబడిపోయితిని. నావెఱ్ఱిచేష్టల నవలోకించి మనసైన్యము చెదరిపోయెను. ఇంకేమున్నది?

ఔరం.—ఛీ! దురాత్ముఁడా! సాధారణస్త్రీకంటె నధముఁడగు నీతో మాట్లాడరాదు. (నిష్క్రమించును.)

(దిలేర్ ఖాన్ వేరొకవైపునఁ బడిపోవును.)

## సప్తమదృశ్యము.

రాణా రాజసింహునియాలోచనామందిరము.

[సింహాసనస్థుడగు రాణాయెదుట శిశుహస్తయగు యశ్వంతుని రాణి కూర్చుండును. దక్షిణభాగమున కాసిం దుర్గాదాసు లుపవిష్టులై యుందురు.]

మహారాణి.—రాణా! నాయీపుత్రిని సంరక్షణభారమును కతిపయదివసముల పర్యంతము మీరు వహింపవలెనని ప్రార్థింప వచ్చియున్నాను.

శా. లేరా ధర్మపరాయణుల్, జనమనః । క్లేశాగ్నిఁ జల్లార్చి త
న్నారీరత్నములన్ తదీయసుతులన్ । రక్షించు వీరాగ్రణుల్
లేరా ? దేశముగొడ్డువోయె నకటా ! । మ్లేచ్ఛుల్ దురాచారులై
కారింపంగని మిన్నకుండి రితర । క్ష్మానాయకుల్ పందలై.

రాజసింహుఁడు — రాణీ! నీపుత్రుఁడు నాకుఁ బైవాఁడు కాఁడు. వానిని రక్షించుభారము నాయది. (దుర్గాదాసు నుద్దేశించి) దుర్గాదాస్ ! ఈబాలునికూడ చంపనుద్దేశించియున్నాఁడా ?

దుర్గాదాస్ — కాకున్నచో చక్రవర్తి కాశిశువుతో నేమిప్రయోజనమున్నది ?

మహారాణి — రాణా ! ఒకపుత్రుఁడు- ఒకకన్య. ఇదియే నాసంపత్తి. ఈసంపత్తియె పరమార్థమని ఢిల్లీనుండి బయలుదేఱి వచ్చుచుండఁ దోవలో నాడుబిడ్డ మరణించినది. నా కులదీపకుండును- సద్యోజాతుండు నగు వీనినిమాత్రము మీరు కాపాడినఁ జాలును.

రాజసింహుఁడు — రాణి ! పుత్రుని, నాప్రాణమునైన సమర్పించి కాపాడెదను. ఔరంగజేబుని యత్యాచారము క్రమక్రమాభివృద్ధిఁ బొందుచున్నది.

ఉ. కారణమేమొ దైవమెఱుఁ । గందగు మ్లేచ్ఛుఁడు తుచ్ఛుఁడై దురా
చారపరాయణుండయి, ప్ర । జల్ తపియింపఁగ నేచుచుండె, నే
ధీరుఁడు సాహసింపక, ప్ర । తిక్రియ కోపక మిన్నకుండె, హా!!
భారతమాత కిట్టి దుర । వస్థ ఘటిల్లెను నేఁటి కక్కటా.

అతఁడు తిరుగ హిందువులపై 'జిజయా'పన్నును విధించుచున్నాఁడు. మార్వాడదేశాధీశుఁ డగు యశ్వంతసింహునికుటుంబముపై కార్పణ్యము వహించియున్నాడు. ఇఁక నేను తూష్ణీంశీలుఁడనై మెలంగుట యపాయకరము; కావున నొకజాబును వ్రాసి



చూచెదను. అప్పటికిని వాఁడు దుండగముల నాచరించెనేని, శిక్షింపఁ బ్రయత్నము కావించెదను.

రాణి — జాబును లిఖించుటయా ? అనునయవినయములతో నా దుష్టునిచెంతకు కమ్మనంపుటయా ? వలదు. వలదు. రాణా ! ఈపర్యాయము మొగల్ సామ్రాజ్యమును సమూలముగ విచ్ఛేదనను కావింపవలెను.

రాజసింహ — (ఆలోచించి) ఔ నది సత్యమే.

ఉ. వృద్ధుఁడనయ్యు నాదు నవి । వేకము వడ్డికిఁ బాఱియుండె నా
క్రుద్ధుఁడు సామవాక్యముల । కున్ జెవియొగ్గునె, సమ్మతించునే?
యుద్ధమొనర్చి, నిష్ఠురత । కోరిచి దర్పము సంహరించి ది
గ్బద్ధయశోధ్వజుండనయి । కాలముఁ బుచ్చెద మానినీమణీ.

(అని కాసిమ్‌వంకఁ దిరిగి) ఇతఁ డెవరు ?

దుర్గా — ఇతఁడు నాబాల్యమిత్రుఁడు. ప్రాణభీతిని విడనాడి మాచిన్నిప్రభువును మొగలులబారినుండి కాపాడెను.

కాసిం — రాణా ! నాపేరు కాసిండుల్లా. దుర్గాదాసు నన్నొకయాపదనుండి రక్షించెను. ఆనాఁటినుండియు నే నితని భృత్యుండనై యున్నాను.

రాజసింహ — ఔరంగజేబ్ ! ఉన్నతపదవి నలంకరించియు, నీ వొకశిశువును హత్యకావింప నుంకించియున్నావు. చూడుము ! ఈ కాసిమ్‌ను జూచి సిగ్గుఁ దెచ్చుకొనుము.

రాణి — రాణా నే నాదుష్టాత్మునిపై పగదీర్చుకొనునిమిత్తము నాగీజనముతో నగ్నిప్రవేశ మొనరింపక బ్రతికియున్నాను.

రాజ — అట్లే కానిమ్ము. మీయిరువురు నాయింట నిర్భయముగ నివసింపవచ్చును.

రాణి—నేనా! ఇచట నివసించుటయా! ఎన్నడు నట్లు చేయఁజాలను. నా రాజ్యమున నివసింతును. ఆపదసంపదలయందును - సుఖదుఃఖములందును నాభర్తయే నాదైవము. అతని యాలయముననే నాకు మనశ్శాంతి చేకూరును.

రా—అమ్మా! ప్రస్తుత మా స్థలమున నీవు క్షేమముగ నుండజాలవు.

రాణి—అట్లు కాదు. నేను ఆపదనే కోరుచున్నాను. ఆపదయన్న నాకు భయము లేదు. భూకంపమునందు జన్మించితిని. ప్రళయమేఘశయ్యపైఁ బెరిగితిని తుపానుచే లాలింపఁబడితిని. ఇక నాకాపదయన్న భయము లేదు. ఆపదల నన్నింటిని గడచితిని. మిగిలినయాపద నాశిశుహత్య - దాని నాపదనుండి రక్షించినఁ జాలును. ఇంతకు నాకర్మము నన్ను వెన్నంటియే యుండును.

చ. వనమున నున్న ఘోర రిపువహ్నుల మధ్యమునందు నున్న దు
ర్జనులకుఁ జిక్కియున్న, జలరాశి మునింగిన, నదీమస్తకం
బున నివసించినన్, నిమురంబోవుచు నుండిన, నెట్టివేళ నే
గనుఁగొన పూర్వజన్మకృత కర్మము ప్రోచుచునుండు జీవులన్.

(అవనిక జారును.)

శ్రీ

# దుర్గాదాస్

## ద్వితీయాంకము.

### ప్రథమదృశ్యము.

స్థానము:—ఢిల్లీ రాజప్రాసాదము - గుల్నార్ మందిరము.

[అక్బరుకూతురగు రజియా, గుల్నార్ చెంతఁ గూర్చుండి పాడుచుండును.]

గుల్నార్—రజియా! సంగీతము నీవెట్లభ్యసించితివి?

రజియా—నాతండ్రివలన నభ్యసించితిని.

గుల్నార్—పాటయనిన నా కసహ్యమే!

రజియా—నీకును, తాతగారికిని గాడిదకున్నంత స్వరజ్ఞానమైనను లేదు. నేను పాడినంతనే తాత నన్నుఁగొట్టవచ్చును. మీరాలు మనుష్యులై పుట్టుట మాకును, మావంటి పసివారికిని చేటు కలిగించుటకే.

గుల్నార్—(ఇంచుక కోపము నభినయించి) అధికప్రసంగము చేయక, చక్కనిపాటను పాడుము.

రజియా—(గొంతుక సవరించుకొని)

కాంభోజి—ఆటతాళము.

ప॥ సుందర రారా నిన్ను నమ్మితి నన్నేలురా-
మేలాచలమేలా యిది సమయమురా।
అ॥ సతతము నీప్రేమపాశము నను బంధించఁగ-
గరుణను నీదు కౌఁగిటికిఁ గైకోరా॥
చ॥ సుగుణధామ సరసలోకాభిరామ॥

(అని పాడును.)

[ఔరంగజబుఁ అక్బర్ ప్రవేశింతురు.]

ఔరం—(రజియాను చూచి అక్బరుతో) అక్బర్! పరిపాలనాక్రమము నేర్చుకొనునిమిత్తము నిన్ను వంగదేశమునకుఁ బంపియుంటిని. అట్లు చేయక, నాయాజ్ఞ నుల్లంఘించి నీవు నృత్యగీతాదులఁ గాలక్షేపము చేయుటయే గాక, నీబిడ్డను సైతము పాట నేర్పి పాడుచేసినావు. నీ వింతపనికిమాలినవాఁడ వగుదువని యెన్నఁడును దలచలేదు.

అక్బర్ (మౌనము వహించియుండును.)

ఔరం—ఇఁకనైన బుద్ధిఁదెచ్చుకొని మీవారుయుద్ధమున నీనైపుణ్యమును జూపి పేరుపొందుము. నీవెంట నేబదివేలసైన్యమును బంపెదను.

అక్బర్—(అంగీకార సూచకముగ తలనూపును.)

ఔరం—నీవు కేవలము విషయలోలుండవై యుంటఁజూచి సహింపజాలక, నిన్ను సన్మార్గమునఁ బెట్టఁదలంచి యిచటకు రావించితిని. నీసహాయమునకై దిలేర్ ఖానును బంపితిని. నేనును-ఆజిమును, దోబారినుండి వచ్చి మిమ్ములఁ గలసికొందుము. పొమ్ము.



ఔరం—(గుల్నార్‌ను జూచి) గుల్‌నార్! నీ నిమిత్తము నేఁ డొక ఘోరయుద్ధము జరుగనున్నది.

గుల్—ఘోరయుద్ధమా! సామాన్యజనపద మగు మీవారును ముట్టడించు టొక ఘోరయుద్ధమా? చక్రవర్తివంటి వారి కిది యొక తుచ్ఛకార్యము.

ఔరం—ఏనాఁడు స్వల్పసంఖ్యాతసైనికులతో రాజపుత్రులు గణనాతీతమగు మొగల్‌సైన్యముల నోడించిరని వింటినో, అప్పటినుండి రాజపుత్రులతో యుద్ధము నాగుపాముతో చెలగాటమని యనుకొంటిని. కావుననే కాబూల్‌దేశమునుండి "ఆజిం"ను బంగాళాదేశమునుండి అక్బరును రావించి, లెక్కకు మించిన సేనలతో వారిని యుద్ధమునకు బంపితిని. మీవారుముట్టడి స్వల్పకార్యమని తలంపరాదు.

గుల్—మీవారును మీరు జయించినను, మానినను రాణిని, నా మెపుత్రిసిమాతను నాపాదముల కర్పింపవలెను.

ఔరం—అందులకే యీ ప్రయత్నము.

ద్వితీయదృశ్యము.

ఆబూపర్వతమందలి యొకానొకదుర్గము.

[దుర్గాదాసు, ముకుందుడు, శివసింహుడు సంభాషించుచుందురు.]

దుర్గా—ముకుందసింహా! శివసింహా! మన చిన్నప్రభువుని మీ యిరువురియధీనమందుంచి పోవుచున్నాను. ఈస్థల మతి రహస్యము. ఎరికిని దెలియనీయరాదుసుమీ!

ఉభయులు—మాకంఠమున ప్రాణ మున్నంతదనుక నట్లు కానేరదు.

దుర్గా—చక్రవర్తిసైన్యములు మీవారును ముట్టడింపవచ్చుచున్నవి. కుమారు నుదయపురమం దుంచుట శ్రేయస్కరము కాదని

మొఱంగి, రాణావారియాదేశానుసారమితని నిచ్చుటకై గొని తెచ్చితిని.

గీ. తురకపన్నిన కపటవా । గురకుఁజిక్కి
ప్రాణములఁబాసి గతియించెఁ । బ్రభువరుండు
అతనిపుత్త్రుని నితనిఁ । గాపాడవలయుఁ
గంటికిఁ జెప్పచందానఁ । గరుణతోడ.

ముకుంద—మీవారుముట్టడికి దగిన కారణములేవి?

దుర్గా—యశ్వంతసింహుని రాణికిని, నా మెతనయునకు నాశ్రయ మిచ్చుటొకటి. హిందువులపై నత్యాచారములు చేయకూడదని కఠినముగ వ్రాసినజాబు రెండవది. రెండవ కారణము ఔరంగజేబుని యుద్ధమునకు ప్రేరేపించుటలేదని రూఢిగా చెప్పఁగలుగుదును.

ఉభయులు—సేనాపతీ! మనప్రభుని ప్రాణరక్షణార్థ మీ యుద్ధ మారంభమైనది. ఈవిషయమున మే మప్రమత్తులమై మెలంగెదము. ఈస్థలము మిక్కిలి రహస్యమైనది. మా సాహాయ్యమునకు మీరు కొందుకొందల యోధులనుంచి పోండు. ఇంచుకైన విపత్తు సంభవించినయెడల మీకు వర్తమాన మంపెదము.

శివసింహు — చక్రవర్తియు నీరణరంగమునకు వచ్చుచున్నాఁడా?

దుర్గా—ఔను. చిత్తూరు, మంగళగఢాదిదుర్గములు చక్రవర్తి వశము లయ్యెను. రాణావారు తమసేనలను పర్వతప్రదేశముల నడపించుకొని వచ్చుచున్నారు.

ముకుంద—మహారాణి యెచ్చట?

దుర్గా—ఆయమ మార్వాడ దేశమునుండి నైన్య సైన్యములతో మీవారునకు వచ్చుచున్నది. ఇఁక మీరు భోజనాదికము ల



నొనర్చి నిజకార్యములందు మెలఁకువఁగల్గి మెలంగుఁడు. పొండు!

(శివముకుందులు నిష్క్రమింతురు.)

దుర్గా—(స్వగతమున) ఆహా! పరమేశ్వరా! ఏమి, నీసృష్టివైచిత్ర్యము! బహుకాలమునకుఁ దిరుగ మీవార్ మార్వాడదేశము లేకీభవించినవి. ఈసంఘభావము శుభసూచకముగ నున్నది. గణనాతీతములగు మొగల్ సైన్యముల నతిస్వల్పసంఖ్యగల నాసైన్యములతో గెలువలేనేమో యను నిరాశతో నుంటిని; కాని, యానిరాశాంధకారమును భేదించుటకు, మీవార్ మార్వాడదేశముల యైకమత్యమను, నాశాదీపశిఖ రేఖ కానవచ్చుచున్నది. కానిమ్ము. ప్రయత్నించి, దీని ఫలితము లెట్లుండునో చూచెదఁగాక! ఉభయదేశసైన్యములను నాశక్తికొలంది ప్రేరేపించెదఁగాక.

మ. సమరోత్సేక విజృంభణంబున నిరా । శాదోర్బలోద్రేక వి
క్రమముల్ వెల్లడిఁజేసి మ్లేచ్ఛకదళీ । కాంతారవిచ్ఛేదన
క్రమధాటిన్ బ్రకటించి, హైందవ జ । నప్రఖ్యాతి స్థాపింపఁ బూ
ర్వము పోరాడిన వీరులం దలఁచి మా । త్రాప్రాగల్భ్యమున్ జూపెదన్

జయ్. జన్మభూమికిజయ్. (ప్రస్థానము.)

## తృతీయదృశ్యము.

రాణారాజసింహుని యాలోచనామందిరము.

[జోధపురపట్టమహిషియు, దుర్గాదాసాదిరాజపుత్ర సామంతగణము నుచితాసనాసీనులైయుందురు.]

విక్రమ—సమ్ముఖయుద్ధమున మొగల్ సైన్యము నెదుర్కొనిన బాగుగనుండునని తలంచుచున్నాను.

రాణా—అసంఖ్యాతములగు మొగల్‌సైన్యములను సమ్ముఖయుద్ధమున నెదుర్కొనుట సాహస మనిచెప్పఁగలను.

గోపీ—మన స్వల్పసైన్యముల ననేకవిభాగములుగచేసి శత్రువుల మార్గముల నరికట్టుట యుక్తిసంగతమని నాతలంపు.

రాణా—గరీబ్ దాస్! పర్వతప్రదేశములంగల ప్రతిగృహమును, ప్రతిమార్గమును నీవు బాగుగ నెఱుంగుదువు. నీయభిప్రాయమేమియో తెలుపఁగోరెదను.

గరీబ్—రాణా! శత్రుసైన్యములను పర్వతప్రదేశములఁ జొరనిండు. ఆసేనలన్నియు నాపథములనుండి బయటికివచ్చుట కవకాశముండదు. అపుడు మనము వారి నాక్రమింపవచ్చును.

రాణా—(అందఱనుద్దేశించి) ఈపద్ధతికి మీరు సమ్మతింతురా?

అందఱు—ఆహా! తప్పక సమ్మతింతుము.

రాణా—రాణి! నీయభిప్రాయమేమి?

రాణి—అందఱియభిప్రాయమే నాయభిప్రాయము. మీరీయుద్ధమునఁ బాల్గొనరా యేమి?

రాణా—మహారాణి! శత్రుసైన్యములు మూఁడు విభాగములై మూఁడుమార్గముల మనల నెదుర్కొనుచున్నవి. మొదటిది అక్బర్ యధీనమున ఉదయపురమార్గమున నున్నది. రెండవవిభాగమునకు దిలేర్ ఖాను డధినాయకుండై దోసురీపథమున వేచియున్నాఁడు. దోబారీపథమున స్వయముగఁ జక్రవర్తియే సేనాసమేతుఁడై యున్నాఁడు; కావున నేను మీతో నేకీభవించుట కవకాశము లేదు.

రాణి—అయినచో నేను నాసేనలతోఁ జక్రవర్తి నెదుర్కొనఁబోవుదును. మీ రేమందురు?



రాణా—గణనాతీత మగుసైన్యముతో వచ్చుచున్న పాదుషాను నెదుర్కొనుట యపాయకరము. ఏమి దుర్గాదాస్!

దుర్గా—చిత్తము ప్రభువులు సెలవిచ్చినది నిక్కువమే?

రాణా—అయినచో నీయుభయసైన్యముల కధినాయకునిగా నెవరిని నియమింపవలయును?

అందఱు—(ఏకగ్రీవముగ) ఏమీ! ఏమహాత్ముని నామశ్రవణమాత్రాన శత్రువులగుండియలు ఝల్లుమనునో, ఏపరమపురుషునియాజ్ఞ నుల్లంఘింప, నోరులేని జంతుజాలముసహిత మొల్లకుండునో, యట్టి యనుపమానబలపరాక్రముం డగు దుర్గాదాసుఁడుండ, నన్యు డెవ్వఁ డీయుభయదేశసైన్యముల కధ్యక్షుండు కాసమర్థుఁడు?

రాణా—దుర్గాదాసవీరాగ్రణీ!

మ॥ పరభూమీధవరాజహంసలకు శంపామాలికాతుల్యమై
గరళగ్రీవ విలోచనానలశిఖాకారంబునం గ్రాలి, నీ
కరముంబట్టి, సమస్తవైరి కదళీ కాంతారసంహార భీ
కరకార్యాచరణంబునన్ మెలఁగు నీఖడ్గంబు జృంభించుతన్

[అంత రాణాప్రథమపుత్రుఁడు భీమసింహుని ప్రవేశము.]

భీమ—(తండ్రి కభివందనము లాచరించినపిదప మిగిలినవారికి నమస్కారము చేయును.)

రాణా—(కన్నీరుకార్చుచు) నాయనా! రమ్ము! నిన్నుఁ జేరఁబిలుచుటకు నైన నాకధికారము లేదా. ఔను. నారాజ్యమునండి నిన్ను పాఱఁద్రోలినపిమ్మట, నిన్నుఁ బిలుచుటకైన నాకధికారమెక్కడిది?

భీమ—తండ్రీ! అధికారము లేదనియా పలుకుచున్నారు? పరదేశములందు నివసించుచుంటి ననుమాట యే కాని, రాజిల్లింబవల్లు

సుషుప్త్యవస్థయందేమి, జాగ్రదవస్థయందేమి, భోజనసమయమునందేమి, సంతతము నాదేశము - ఆ మేవారుభూమియందలి ఘనశైలమాలలు - యాటవికప్రదేశములు - సమస్తమును నాకండ్లయెదుటనే తాండవమాడుచుండెడివి. అట్టి నా జన్మభూమికి ముప్పువాటిల్లినపు డామె నాపదలనుండి విముక్తిఁబొందఁజేయుట నావిధికావున, మీరు వర్తమానముఁ బంపిన వెంటనే బయలుదేఱి వచ్చినాడను. భవదభీష్టములను తీర్ప ప్రాణత్యాగము నైనచేయుట నావిధి. ఇట్టి సందర్భమున నన్నుఁ జేరెడి పిలచుటకు మీకధికారము లేదని పలుకుట న్యాయము కాదు.

[ఆసనమునుండి లేచి రాజసింహుడు పుత్రుని కౌగలించుకొనును.
ఆసమయమున నతని ద్వితీయపుత్రు డగు జయసింహుడు
ప్రవేశించును.]

రాణా—(ఆశ్చర్యమున) జయసింహుడా!

జయ—(కోపోద్దీపితుడై) తండ్రీ! నీ వింతపక్షపాతముగలవాఁడవని నే నెరుంగకపోతిని. నీ ద్వితీయపుత్రుడు సజీవుడైయుండగ, వాని దేహమున ప్రతినాళమునందును, క్షత్రియరక్తము ప్రవహించుచుండ, మాతృదేశరక్షణార్థము, దూరముననున్న తనయునికి వర్తమాన మంపి, నా కావార్త లేశమైనను తెలియఁ బఱుపకుండుట పక్షపాతము కాదా—యన్యాయము కాదా?

(అని నిష్క్రమించును.)

రాణా—(సామంతులతో) చూచితిరా, సామంతులారా! విషయలోలుండై రాజకార్యములవంక కన్నఁడును తిరిగిచూడని జయసింహు డీయుద్ధమున పాల్గొనఁడని యూహించి, భీమునకు



వర్తమానముఁబంప, నాపై నెట్టియపవాదమును మోపెనో చూడుడు! భీమా! తత్క్షణము రాజ్యమును వీడిపొమ్ము!

భీమ - మాతృభూమికి జయ్! (అనుచు నిష్క్రమించును.)

రాణా—(అందరకును బోవ ననుజ్ఞ యొసంగి, స్వగతమున) సరస్వతీ! నీనైపుణ్యముచే జయసింహు నుత్తేజితుని గావింపఁజాలితివి. నిన్నెంతయు మెచ్చుకొంటిని. నివురుగప్పిన నిప్పువలె వానిలో నణఁగియుండిన యుద్రేకానలమును ప్రజ్వలింపఁజేసిన నీచాతుర్యమునకే నెంతయు సంతోషించితిని. కాని వాఁడు అరిగి కనుల మాయలలో బడకుండఁ గాచుకొనుము.

(నిష్క్రమించును.)

## చతుర్థదృశ్యము.

చిత్తూరు సమీప కాననప్రదేశము.

[ఔరంగజేబు—దిలేర్ఖానుడు—చక్రవర్తికుమారు డగు అజిమ్-
శ్యామసింహుడు నిల్చియుందురు.]

ఔరం—దిలేర్ఖాన్! ఈ యుద్ధమున నీవుసైతము నోడిపోతివా?

దిలేర్—నే నోడుటయ కాక సమస్తమును గోల్పోతిని.

ఔరం—అక్బరుసమాచార మేమైన తెలిసికొంటివా?

దిలేర్—అతనింగూర్చి నేను మిక్కిలి యశుభమును వింటిని. ఆరావళీపర్వతప్రాంతమున నతఁడు, రాణావారి రెండవకుమారుఁ డగు జయసింహుని హస్తగతుడై బందీగా గొనిపోఁబడినాడట!

ఔరం—బందీగా గొనిపోఁబడెనా! హిందూస్థానమునకుఁ గాబోవు సామ్రాట్టగు అక్బర్ రాజపుత్రుల హస్తగతుఁడయ్యెనా?

ఆజిం — (స్వగతము) ఏమీ! హిందూస్థానమునకు గాబోవు చక్రవర్తి అక్బరా? నేఁ డొక నూతనాంశము వెల్లడియైనది.

దిలేర్ — శ్రీవారుకూడ పరాజితులై 'దోబారీ'ని విడచి చిత్తూరుమార్గము నాశ్రయించిన ట్లున్నది.

ఔరం — దిలేర్! రాఠార్ సేనాపతియగు దుర్గాదాసు నన్నోడించి, నాసర్వమును గైకొని, తుదకు నాకుఁ బ్రాణాధిక యగు బేగమును కూడ నెత్తుకొనిపోయెను.

చం॥ హయగతినేగుదెంచి మన॥యాశ్వికులన్ దునుమాడి యుగ్రుఁడై
జయ మనియార్చి పేర్చి యెక॥సక్కెములాడి "మదీయరాజ్ఞికిన్
బ్రియమిది"యంచు నన్ గవిసి॥బేగము వేగమునన్ హరించి ని
ర్భయముగ స్వేచ్ఛఁగన్ వెడలె। వానిపరాక్రమ మింత యొప్పునే॥

దిలేర్ — జహాఁపనా! దానికై నగవనేటికి? బహుప్రతగ్గుటచే నీ పర్యాయము మనము సులభముగ ఢిల్లీని చేరఁగలుగుదుము.

ఔరం — ఈయవమానముతో ఢిల్లీకిఁ బోవుటయా? అసంభవము! ఈదుఃఖసమయమున నీవు పరిహాసము లాడకుము. మొగలుల కెన్నఁడు నిట్టియవమానము...

దిలేర్ — మీవలనఁ దప్ప మఱియెవ్వరివలనను సంభవించుట లేదు.

ఔరం — నావలనఁ గాదు. ఇందుకు నీవే కారణము. దౌర్భాగ్యవశమున నేఁడు మాసేనలకు నీ వధిపతివగుటవలన నవమానము సంభవించినది. యశ్వంతసింహుఁడే బ్రతికియున్నచో......

దిలేర్ — శ్రీవారు భవిష్యత్తు నించుక యాలోచించియున్నచో, యశ్వంతసింహుఁడు జీవించియుండెడివాఁడు.

ఔరం — దిలేర్ ఖాన్! ఏమనుచుంటివి?

దిలేర్ — జనాబ్! నిర్భయముగ పలుకుచున్నాను. వినుడు. వీరమల్ - టాడర్మల్ - భగవాన్ దాసాది మహావీరుల భుజశక్తిచే



నార్జింపబడిన యీమొగల్ సామ్రాజ్యమును, ఆత్మాభిమానమును త్యజించి, దేశద్రోహు లయినట్టి శ్యామసింహునివంటి కుటిలాత్ములను స్నేహితులుగఁ జేసికొని, కునీతిని రాజ్యపరిపాలన మొనరించుచున్న తమరు ధ్వంస మొనరించుచున్నారు. జనాబ్! ఇఁకనైన మేల్కాంచి, యజ్ఞానతిమిరమును జ్ఞానదీపికచే నశింపఁజేసి, హిందూమహమ్మదీయులను సమభావము నఁబాలింపుడు. మీ కేమియు భయముండదు. అట్లుకాక, మీదుశ్చేష్టల నింకను మానకేని, పేరుప్రఖ్యాతులు లేక నశింతురు. మీశ్రేయోభిలాషినై నిర్భయముగఁ జెప్పవలసి వచ్చిన నాపలుకు లాలించిన మేలగును.

ఔరం — దిలేర్ ఖాన్! ఆవిషయమును గూర్చి బాగుగ నాలోచించెదము. ప్రస్తుతము నే నస్వస్థచిత్తుఁడనై యున్నాను. పోయి విశ్రమించెదను.

(నిష్క్రమించును.)

ఆజిం — (అస్పష్టముగ) అక్బరు భావిచక్రవర్తియగునా? ఎన్నటికినిఁ గానీయను. (అని కన్నెఱ్ఱ జేయును.)

దిలేర్ — షాజాదా! ఏమియోచించుచున్నారు?

ఆజిం — ఆసంగతిని మీతో జెప్పకూడదు.

(అనుచు త్వరితగతిని నిర్గమించెను.)

[అక్బర్ ప్రవేశించును.]

శ్యామ — బందగీ, షాజాదా!

దిలేర్ — షాజాదా! మీరు శత్రువులచే ఖైదీగా గైకొనఁబడినారని వింటినే. అది యసత్యమా, యేమి?

అక్బర్ — (నతమస్తకుండై) అసత్యమెట్లగును?

దిలేర్—నైపుణ్యమున తప్పించుకొనివచ్చితిరా?

అక్బర్—లేదు, ఆహా! రాజపుత్రజాతీ! ఏమి నీ దయాశీలత! ఏమి నీ శాంతస్వభావము! (దిలేరువంకతిరిగి) సేనానాయక! పంజరములోని చిలుకవలె నే నాపర్వతమార్గములఁ జిక్కి, ససైన్యముగ నిరాహారుడనై చావనున్నసమయమున, జయసింహుడు తండ్రిపంపున నాకొఱకు భోజనాదులఁ దెచ్చి, నన్ను క్షమించి విడచినాఁడు. అంతకంటె నేమికావలయును?

దిలేర్—ప్రాణములతో స్వగృహమును చేరితి నని యానందమొందుచుంటిరా? ఛీ! ఛీ! లోనికిబొండు.

(అందఱు నిష్క్రమింతురు.)

పంచమదృశ్యము.

రాజపుత్రశిబిరము.

[జోధపురరాణి—రాణాయు నుపవిష్టులై యుందురు—సామంతగణము తన్నుపరివేష్టించియుండ, మొగల్ సామ్రాజ్యపతాకమును ధరించి దుర్గాదాసు నిలువఁబడియుండును.]

రాణా—మొగలులను మీవారునుండి పారద్రోలి రాజపుత్రుల నుద్ధరించినందులకు, దుర్గాదాసునకు నాధన్యవాదములు.

రాణి—మదభిప్రాయానుసారము, నా వైరియగు గుల్నారును బంధించి తీసికొనివచ్చిన దుర్గాదాసుఋణమును నేను తీర్చుకొనఁజాలను.

రాణా—ఏమీ! దుర్గాదాస్! గుల్నారును తక్షణమును విడువక ఖైదీగ కొనివచ్చితివా?

దుర్గా—రాణా! నేను సేనానాయకుడను మాత్రమే. యుద్ధభూ



మిని శత్రువులఁ గెల్చుటయు, వారినిపట్టి రాజుల కప్పగించుటయు నావిధి. వారిని విడిచిపెట్టుభారము మీయది.

రాణా—తక్షణము పోయి, గుల్నారును సగౌరవముగ పాదుషాచెంతకుఁ బంపివేయుము.

రాణి—అట్లేలచేయవలయును?

రాణా—అంతఃపురనారీజనముతో మనకేమి ప్రయోజనము? అదియుంగాక యబలలను నేను శిక్షింపను.

రాణి—రాణా! ఈఘోరయుద్ధ మెందులకు సంభవించెనో, నేను మిమ్ముల నేల శరణుజొచ్చితినో, ఈయుద్ధమున నేనే గుల్నార్ హస్తగతనై యుండినచో నామె నన్నేమిచేసియుండునో, బాగుగ నాలోచించి యామెను విడువుడు. నే నామెను శిక్షింపక విడువను.

రాణా—శిక్షించుటయా!!

రాణి—ఔను. ఏ పాపాత్మురాలు నన్ను గుట్టలనక, పుట్టలనక, రాత్రింబవళ్ళనక, యెండవానలనక, యొకచోటునుండి మఱియొకస్థలమునకు భిక్షుకురాలివలె త్రిప్పించెనో, రాక్షసరూపిణియగు నేస్త్రీ నాపతి పుత్రులఁ బ్రమింగెనో, యట్టి గుల్నార్ బీగమును శిక్షించెదను.

రాణా—ఎట్టిశిక్షను విధింప సమకట్టితివి? ధర్మాధర్మముల విచారించి పాపులకు శిక్షనొసంగువాఁ డొకఁడున్నాఁడుకదా! వానికోపవలన నధర్మమెన్నటికైన నాశమొందును. వేగిరపడక శాంతి వహించుము.

రాణి—రాణా! ఎట్టిశిక్షను విధించవలయునో నే నాలోచించి పలికెదను. ఆమె ప్రతియంగమునందు సూదులఁ గ్రుచ్చినను,

నాకు తృప్తిలేదు. ధగధగమని మండు దావానలమున జీవములతో నామెను త్రోసినను నాకు సంతృప్తికలుగదు. ఆలోచించి, యెట్టిశిక్షనొసంగవలెనో తెలిపెదను.

పాపులకు శిక్ష నొసగువాఁడొకఁడున్నాఁడు. నిజమే. అతఁడెక్కడున్నాఁడు. వజ్రాఘాత మొక్క నిరుపేదపైనే కాక, ధనవంతునిపైనికూడ పడుచున్నది. దావానల మొక్క పేదవాని కుటీరమునే గాక ధనికులసౌధములను ధ్వంసముచేయుచున్నది. మహానిల మొక్క మొలకనే గాదు, ఘనమహీరుహములను పెల్లగించుచున్నది. ధర్మాధర్మవిచక్షణ యెక్కడ? అతఁడెక్కడ? అతడు మొట్టమొదట దుర్బలుల- న్యాయపక్షుల- కుత్తుకలనే పిసుకును.

రాణా! ఎన్నటికైన నధర్మము నాశమొందును. ఎప్పుడు నాశమొందును? ఎంతదనుక వేచియుండఁగలము? సరళస్వభావులు శత్రుల నాశ్రయించుచున్నారు. శత్రులు వారివంక చూడనైన జూడరు. సత్య మనృతముయొక్క దాసియైయున్నది; కాని యనృతమునకు దయరాదు. న్యాయ మన్యాయముతో చిరకాలమునుండియుఁ బోరాడుచుండియు- నోడుచున్నది. పురాతనమగు- భగ్నమగు ధర్మమందిరమున- నధర్మమనెడు జయభేరి మ్రోగుచున్నది. ఇఁక నెప్పుడు ధర్మస్థాపనమగును? ఎంతవఱకు వేచియుండఁగలము?

రాణా—ఏమైనను సరే, స్త్రీని శిక్షించుటకు నేను సమ్మతింపను.
దుర్గాదాస్! తక్షణము బేగమును ఢిల్లీకి బంపివేయుము!

రాణి—దుర్గాదాస్! నీవు నాభృత్యుడవు కాని, రాణావారి భృత్యుఁడవు కావుసుమీ!

దుర్గా—అట్లుకాదు. ఈయుద్ధమున మే మందఱము రాణావారిసేవకులమే. వారు చెప్పినట్లు నడచుకొనక తీరదు.



రాణి—(కొంతదనుక మౌనము వహించి పిదప) రాణా! నాతప్పు క్షమించుడు! ఉద్రేకపూరితహృదయనై యట్లంటిని. క్షమించుడు! కాని, యీనాతీవ్రమనోవేదనను- గాఢమగు నా యంతర్దాహమును బాగుగ తెలిసికొని, బేగమును నాసమక్షమున నిలువనిత్తురేని, యామెను విచారించి విడచిపుచ్చెదను.

రాణా—అట్లేకానిమ్ము. (సేవకుని, బేగమును తెమ్మని యాజ్ఞాపించును. వాడు రయమునపోయి బేగముతో ప్రవేశించును.)

రాణి—(గుల్నార్‌తో) బేగంగుల్నారునకు సలాం!

గుల్నా—జోధపురరాణియా?

రాణి—ఔను. ఇంతలోనే మరచితివా? నాపతి పుత్రులనుమ్రింగి, దాహముతీరకుంటచే, నన్నును, నాపసిపాపను చంపుటకై పాదుషాచేత నీమహానాటకమును నాడించిన నీవు, నన్ను, ఇంతలో మఱచితివా? పాపము!! ముద్దరాలవే?

గుల్నా—(దుర్గాదాసు నవలోకించి) ఇతడేనా, దుర్గాదాస్! నన్నిచ్చటికేల తీసికొనివచ్చినారు?

దుర్గా—నేనే దుర్గాదాసును. విచారణ మొనరించుటకు తీసికొని వచ్చితిమి.

గుల్నా—ఎవరియెదుట?

రాణి—నాసమక్షమున "చింతచచ్చినను పుల్లచావలె" దన్నట్లు పలుకులింకను గాంభీర్యముగ నున్నవే! దుర్గాదాసువంక తీవ్రదృష్టుల నిగుడించుచున్నావేమి? "ఈతుచ్ఛుఁడు నన్ను బంధించునంతటివాఁడా" యని యోచించుచున్నావా యేమి?

గుల్నా—నేను మీఖైదీని. ఏమిచేయ నుద్దేశించియున్నారో చేయవచ్చును.

రాణి - ఈయుద్ధమున నేనే నీచేతఁ జిక్కియుండిన, నీవు నాకెట్టి శిక్షను విధించియుందువు ?

గుల్నా—నాపాదోదకమును నీచేఁ ద్రావించియుందును.

రాణి నీవు నాఖైదీవి. నిన్ను నాయిష్టమువచ్చిన శిక్షకుఁ బాత్రురాలినిజేయ సమర్థురాలనేయైనను, నిన్ను క్షమించి విడిచిపుచ్చుచున్నాను. ఇది మాధర్మము. పొమ్ము !!

(ఒకసేవకుడు గుల్నారును శృంఖలావిముక్తనొనరించి, యావలకుఁ గొంపోవును.)



శ్రీ

# దుర్గాదాస్

## తృతీయాంకము.

### ప్రథమదృశ్యము.

స్థలి - రాజప్రాసాద పశ్చాద్భాగముననున్న ప్రమదావనము.
[సేనానాయకుఁడు, తహబరును, యువరాజగు
నక్బరును మాట్లాడుచుందురు ]

తహబర్—తుదకు మీ రాభూధరమధ్యప్రదేశమున, బోనులోఁ బడిన యెలుకవలె నటునిటుఁ దిరుగుచుండగ, బర్వతాగ్రముల నున్న రాజపుత్రులు మిమ్ములంగని పరిహాసమాడిరి కాఁబోలు !

అక్బర్—నేను తండ్రియాజ్ఞానుసార మాపర్వతములనుండి నా సైన్యములను తీసికొనిపోవుచుండ, నాకొకసందు కానవయ్యెను. ఆ మార్గమునఁబడి కొంతదూర మేగుసరి కావలకుఁ బోవుటకు మార్గము లేకుండెను. అందిరువురుమానవులు వరుసను నిలువబడుటకైన వీలు లేకుండెను. మరల వచ్చినదారినే పోవుద మని యత్నింపగా నాత్రోవయు నరికట్టఁబడెను.

[ఆజిమ్ ప్రవేశించును]

ఆజిమ్—అక్బర్! నీ వీవార్తను వింటివా?

అక్బర్—ఏమది?

ఆజిం—మీవారయుద్ధమందు నీ వోడిపోతివని, తండ్రిగారు నీపై మిగుల కోపించుచున్నారు.

అక్బర్—అయిన నన్నేమందువు? నేనొక్కడనే యోడిపోతినా? సేనానాయకుండగు దిలేర్ ఖాను......

ఆజిం—అతనిపై సైతము తండ్రిగా రమితక్రోధమును వహించి యున్నారు.

అక్బర్—మరి తండ్రిగారో? నీవో? మీరందఱును విజయము గాంచినారు కాబోలు?

ఆజిం—నేను యుద్ధముచేసి పరాజితుండనైతిని.

అక్బర్—నేనో?

ఆజిం—నీవు సదావిషయలంపటుండవై రణవిద్యానభిజ్ఞుండవైతివని నాన్నగా రనుచున్నారు.

అక్బర్—అయిన నన్నేమిచేయమందువు? నేను విషయలంపటుడను—భీరువును—అయిన నేమాయె?

ఆజిం—ఏమియును లేదు; కాని భ్రాతృభావమున నీకు బోధచేయుచున్నాను వినుము. నీపై నత్యంతకృద్ధుండైయున్న తండ్రికంటఁబడకుండుట నీకు శ్రేయస్కరము.

(అని నిర్గమించును.)

తహాబర్—కుమారా! పరిస్థితులేమియు బాగుగాలేవు. యుద్ధమున నీ యపజయ మనర్థమునకుఁ గారణభూతమగునని తోఁచుచున్నది.



అక్బర్—అదెట్లు?

తహాబర్—నీకుఁ జక్రవర్తిత్వము సంప్రాప్తించునను మహదాశయుండెడిదికదా! ఇపు డది భగ్నముకానున్నది.

అక్బర్—అయినచో నన్యుఁడెవడు చక్రవర్తి కాఁగలవాఁడు?

తహా—ఆజిం సంభాషణమును బట్టి యోచింపగా నతడే భావిచక్రవర్తియని తెల్లమగుచున్నది.

అక్బ—ఔను. తండ్రిగారును, ఆజిమును, గుల్నారునుసహిత మోడిపోయిన మహావీరులు. రాజపుత్రులు పరమకారుణికులు కావున నామెను విడిచిపెట్టిరి. కాని........

తహా—ఆజిమ్ పరాజితుడగుట నిజమేయైనను, ఆపరాజయము తండ్రిగారిది కారణము. అతడు తండ్రిగారియధీనమున బోరాడెను. కావున కుమారు నేమియు ననఁజాలఁడు. మీరు స్వయముగ సేనాధిపత్యమును వహించి, యపజయము నొందితిరి కావున, తండ్రికి, మిమ్ముల నిందించుట కవకాశము చిక్కెను.

అక్బ—మఱియొక కారణము గలదు. నావలె మద్యపానరతుఁడుకాక, ఆజిము దినమున పదిపర్యాయములు నమాజు చేయుచుఁ దండ్రిగారిని సంప్రీతులఁ జేసికొనినాఁడు. నన్నుఁబోలె కృత్యాకృత్యములం దభిరక్తి లేనివాఁడు కావున తండ్రికిఁ బ్రేమపాత్రుఁడైనాఁడు.

తహా—ఆజిమువలెఁ బ్రవర్తించుటకు మీ రేల ప్రయత్నింపఁ గూడదు?

అక్బ—రాజ్యపరిత్యాగమున కొడంబడుదును కాని, యానీచునివలె సురను- వేశ్యను- గానమును విడిచిపెట్టను.

తహా—మాటలాడకుండు. పాదుషావా రిచ్చటికే తెంచుచున్నారు.

(తండ్రినిగాంచియు, నక్బ రలక్ష్యభావమున నిష్క్రమించును.)

[దిలేల్‌ఖానుతోఁ జక్రవర్తి ప్రవేశించును.]

ఔరం—ఆహా! సమస్తమును గోల్పోవుచున్నానే! మీవారుయుద్ధమున నపజయమే కాక, మరల దుర్గాదాసు ఝాలాంవారిని గెలుచుకొనెనా? పురమండలమున, సుజల్‌దాస్ రోంహాలుల నోడించెనా?

దిలే—జహాఁపనా! మనవారి నోడించుటయే కాదు. ఖురానాది పురాణగ్రంథములను కాల్చివేయుచున్నారు. మసీదులను భగ్నము గావించుచున్నారు. శ్రీవారు నిజమతప్రచారమునకై హిందువుల నెన్నికష్టముల పాలొనరించిరో, యంతకు పెక్కురెట్లు మహమ్మదీయు లిపు డనుభవించుచున్నారు.

ఔరం—ఏమీ! మతధర్మములపై సైతము నత్యాచార మొనరించుచున్నారా?

దిలే—ఈవిషయమున శ్రీవారే వారికిఁ బ్రథమోపదేశికులు. ప్రభువువారు జిజియాపన్నును విధించక, వారిని సమభావమున నేలినచో, రెండుజాతులును భద్రముగ నుండవచ్చును.

ఔరం—(పండ్లు కొఱుకుచు) నాకంఠమున ప్రాణము లున్నంత వఱకు ముసల్మానులు ముసల్మానులే! హిందువులు హిందువులే. తహబర్! వెంటనే నీవు కొంతసేనను తీసికొని మార్వాడదేశముపై దండెత్తవలెను. అక్బరును కూడ నాకార్యమందు నియమించితిని. ఈయుద్ధమున నీవు విజయము పొందవేని నీకుత్తుక నుత్తరించి, కాకులకు గ్రద్దలకు నీమాంసఖండముల వెదఁజల్లుదును. ఇది నాచరమప్రయత్నము.

(నిష్క్రమించును.)

తహ—దిలెర్! దినికి మీ రేమందురు?



దిలే—మీవారుయుద్ధమున నాకుఁ బ్రాయశ్చిత్తమైనది. మీ రొకసారి మార్వాడయుద్ధమును పరీక్షించి చూడుడు- రండు. రండు. సావధానముగఁ బ్రసంగించుకొనవచ్చును.

(అని యిరువురు నిష్క్రమింతురు.)

## ద్వితీయదృశ్యము.

ఢిల్లీరాజప్రాసాదాంతఃపురమందు. గుల్నార్ నివసించుగది.

[ఏకాకినియై, గుల్నారు కూర్చుండును.]

గుల్నార్—

శా. నీమోముంగని చంద్రబింబ మని వర్ణింపఁగ గళంకంబులే
దేమాత్రంబును, దివ్యమూర్తివగు ని । న్నేరీతి వర్ణింతు? నన్
వ్యామోహాంబుధినుండి ప్రోవఁదగదే । ప్రాణేశ! ప్రేమించి, యీ
రామారత్నముఁ గౌఁగిలించి రతిసా।మ్రాజ్యంబుఁ బాలింపవే.

ఆహా! ఆవిశాలవక్షస్థలము- ఆయున్నతప్రశస్త లలాటఫలకము- ఆజానులంబితబాహుద్వయము- ఆశరీరసౌందర్యమును సంతతము నాకండ్లయెదుట నాదివ్యమూర్తి తాండవమాడుచునే యున్నది. దుర్గాదాస్! ఒకటిరెండు తక్కువగ, నీయందు ద్వాత్రింశల్లక్షణములును పొడసూపుచున్నవి. దివ్యమంగళమూర్తీ! ఈమొగల్‌సామ్రాజ్యమంతయు నెవరియేలుబడిలోనున్నదో తెలిసికొంటివా? ఏస్త్రీముఖావలోకనమున నట్టి జితేంద్రియుండైనను చలించిపోవునో, ఏయబలాకరస్పర్శముచే నెంతటి విరాగియైనను సరాగియగునో, ఏలలనాసందర్శనాలాభమునకై చక్రవర్తులవంటివారు భగీరథప్రయత్నముల చేయుచున్నారో, యేనారీమణి సౌందర్యావలోకనమున, వాయుపుత్రునిఁబోలు బ్రహ్మచారులు ముగ్ధులై కృపాకటాక్ష

భిక్షుకై యుత్కంఠితులగుదురో, ఏభామారత్న శరీరవిద్యుల్ల తాకాంతి ప్రసరణమునకుఁ గాముకపురుషులు కనుల మోడ్చెదరో, యట్టి గుల్నారు నేఁ డీసమస్తసామ్రాజ్యమును నిజేచ్ఛానుసారము పాలింపుచున్నది. అట్టి నేను నీలావణ్యవాగురను తగుల్కొని, బయటకు రాఁజాలకున్నాను. మిగుల వ్యథఁజెందుచున్నాను. నన్నుద్ధరింపరమ్ము! ఒక్కసారి నాకు దర్శన మిడుము. ఆనాడు మావారునుండి నన్ను భద్రముగ ఢిల్లీని జేర్చితివి. నీ వతికారుణికుడవు. నీపొందుఁగోరి, నిద్రాహారముల మాని, మదనశరదళితహృదయనై యున్న నన్నొక్కసారి చూడుము. ఏమీ! సౌందర్యమున రతీసమానురాలవగు నేను దైన్యమున నిన్నింత వేడుకొన్నను జాలికలుగకున్నదా? నీహృదయము పాషాణముకంటె ఘనమై పోయెనే! ఛీ ఛీ! ఇక దైన్యమును వహించుటవలన లాభములేదు. అనతికాలమున నీదర్పము నణంచి, నిన్ను స్వాధీనపఱచుకొందును; చూడుము.

[రజియా పాడుచుఁ బ్రవేశించును.]

రజి — ఓహో! అమ్మీజాన్! ఎన్నఁడు నొంటిరిగ నుండుట కలవాటుపడనిదానవు, నేఁ డేకాకినివై, దీర్ఘాలోచనము చేయుచున్నా వేమి?

గుల్నా — కొన్నిదినములవఱకును నే నిట్లుండఁగోరెదను. ఆప్రసంగముతో నీకు పనిలేదు; కాని, రజియా! ఆనాఁడుపాడినపాటను మఱొక్కసారి వినుపింపుము—.

రజి — ఓహో! సంగీతముపై నెంతశ్రద్ధ జనించెను? ఒక్కక్షణము తాళుము. లోనికిపోయి వీణను తెచ్చెదను.

(లోనికిఁ బోవును.)



గుల్ — ఔరంగజేబ్! తక్షణము మార్వాడదేశమునకు నీసమస్తసైన్యములను బంపుము. ఈయుద్ధమున నాపాషాణహృదయుని జయించి, నాయెదుటకుఁ దీసికొనిరమ్ము.

(పటపరివర్తనము.)

## తృతీయదృశ్యము.

[మార్వాడదేశసమీపపర్వతప్రదేశమున దుర్గాదాసుఁడును రాణా పెద్దకుమారుఁడగు భీమసింహుఁడు నిలుచుండి—దూరమున నున్న గ్రామమున జరుగుచున్న కోలాహలమును గాంచుచున్నారు.]

దుర్గా — భీమసింహా! చక్రవర్తి తనసమస్తసైన్యములతోడను మార్వాడు నాక్రమించుచున్నాడు. ఈయుద్ధమున రాజపుత్రజాతి క్షీణించుటయో, యభ్యుదయమునొందుటయో తెలియఁగలదు. ఇది మనకు జీవన్మరణసమస్య. వీరులందరు నీమహాసమరమునఁ బ్రాణముల నర్పింప నిశ్చయించుకొనవలెను.

భీమ — నే నందులకే వచ్చియున్నాను.

దుర్గా — శిశోదీయవీరాగ్రణీ! నీ బలపరాక్రమములును, నీ శౌర్యమును, స్వార్థత్యాగమును, చక్రవర్తికీయుద్ధమున సంపూర్ణముగఁ దెలియజేయవలెను.

భీమ — సేనాపతీ! మీరు నిశ్చింతతో నుండుఁడు. నాకొఱకు నా తండ్రికొఱకు నారాజ్యముకొఱకును మదీయప్రాణముల నర్పింప సంసిద్ధుడనై యున్నాను. నన్ను విశ్వసింపుడు. మహారాణి యెచట?

దుర్గా — యశ్వంతసింహుని మరణానంతరము విచ్ఛిన్నములై—భిన్నములై చెదరిపోయి, రణవిద్యను విస్మరించి [illegible]

యున్న సైన్యములను కూర్చుటకై, మార్వాడమందలి, ప్రతి
నగరమున—ప్రత్యేక పట్టణమున—పల్లెల—నరణ్యములం
బరిభ్రమించుచున్నది.

భీమ—నే నొకసారి యామెను చూడవలెను.

దుర్గా—నేఁడే యామెను చూడఁగలుగుదువు.

[సమర్దాస్ ప్రవేశించును.]

దుర్గా—నూతనవిషయములను సంగ్రహించితివా? దాదా!

సమర్—ఔను. తహబ్బర్ ఖాన్ పదివేలసైన్యములతో మార్వాడ
మున కభిముఖముగ వచ్చుచున్నాడు. పిదప నక్బరు కొన్ని
సైన్యములతో రానున్నాడు.

దుర్గా—చక్రవర్తి యెచ్చట?

సమర్—అతడు లక్షకుమించిన సేనలతో నజ్మీరునం దున్నాడు.

భీమ—సేనాపతీ! మనరాథోర్ సైన్యసంఖ్య యెంత?

దుర్గా—మార్వాడదేశాధినాథుడు మరణించినపిదప, యోధవరుల
లోఁ జాలమంది వ్యవసాయాదికర్మలచే జీవనమును గడపుచు
రణవిద్యను మఱచిపోయిరి. మఱికొంతమంది ప్రవాసముఁ
జేయుచున్నారు. ఇపుడు మనసైన్యము ముప్పదివేలకు మించి
యుండదు.

భీమ—అదిగో! మహారాణిగారు వచ్చుచున్నారు.

దుర్గా—ఔను. పోయి నమస్కరించుము.

భీమ—ఆహా! ఆదివ్యసుందరవిగ్రహమును—ఆనితంబలంబితకృష్ణకేశ
జాలమును—గాంభీర్యమును సూచించు వదనమండలము
ను—విద్యుద్దీపము లట్లు విశాజిల్లుకాంతియుత మగుచక్షు
ర్ద్వయమును కాంచిన ప్రతిమానవుడు నామెను మూర్తీభ
వించిన భరతమాత యని భావింపకుందురా?



[భీమసింహునకును దుర్గాదాసునకును మధ్యను, రాణివచ్చి నిల
చును. ఆమెవెనువెంట కొంతమందిమనుష్యు లుందురు.]

మను—మహారాణికి జయ్!

(రాణి యొక్కయున్నతాసనమున నిల్చి వీరుల నుద్దేశించి)

రాణి—మార్వాడదేశవాసులారా! నేను యశ్వంతసింహుని రాణిని.
హిందూకుశపర్వతప్రాంతమున నౌరంగజేబు నైపుణ్యమున
నాస్వామియు, మీపాలకుండు నగు యశ్వంతసింహరాజు మ
రణ మొందెను. చక్రవర్తియే నాజ్యేష్ఠపుత్రుఁడగు పృథ్వీసిం
హునకు విషవస్త్రములఁ దొడగించి, వానిప్రాణములను
దీసినవాఁడు. నేనును నాకనిష్ఠపుత్రుఁడు నగు అజితసింహుడు
ను, మార్వాడమును కాపాడుటకు మిగిలియున్నాము. నే నీవి
షయమున మీ సాహాయ్యముఁ గోరి వచ్చితి. మీరు రాజపు
త్రులు—వీరులు—ఈదేశము మీయది. మీజన్మభూమి పర
పదదళితమగుచుండుటను జూచి నిర్వీర్యులట్లు మిన్నకుందు
రా? లేక తద్రక్షణార్థము మహావీరులవలె రణరంగమున
మీప్రాణముల నర్పింతురా? మార్వాడము నాక్రమించు
కొనుటకు పాదుషా లక్షకుమించిన సేనలతో వచ్చుచు
న్నాఁడు.

మను—లక్షకధికమగు సైన్యములతో పోరాడుటయే? అసంభవము!
అసంభవము!

రాణి—అసంభవమా! వైదేశికులు మీపై నధికారముచేయుట కొ
ప్పుకొనెదరా? పరదేశరాజులు మీస్వాతంత్ర్యమును చూఱ
కొనుట కిష్టపడెదరా? ఛీ! ఛీ! రసపుత్రజాతి కిది తగనిమాట.
నాప్రభువు సజీవుఁడైయుండినచో మీ రట్లుపలుక సాహింప
రు. ఆతనిమాటపై ననంఖ్యాకములగు కరవాలము విజృం

భించి యుండును. దూరమున నాతని యశ్వము కనఁబడినతో
డనే జయజయధ్వానము లాకసమున ప్రతిధ్వనించియుండును.
ఆతని మిత్రుఁడు, స్త్రీనామధారులగు నామాటను మీ రేల
పాలకించెదరు! మీకు సాహస మెక్కడిది.

సీ. రిపుబాణములకు దు । ర్భేద్య మహా కవచంబు
జయలక్ష్మి నివసించు । సారసంబు
తులలేని సుఖసంప । దల కాలవాలంబు
సకలకార్యంబుల । సాధనంబు
సంకల్పసిద్ధులొ । సంగు నాకకుజంబు
పిఱికిపందలకుఁ బ్రి । త్స్వేదనంబు
సజ్జనుల్ నుతియించు । సత్కీర్తి సదనంబు
అఖిలగుణంబుల । కాకరంబు

గీ. హానిజలదంబుఁ ద్రోలు ఝం । ఝానిలంబు,
అమలరణమార్గ శిక్షకా । చార్యకంబు
వీరవరులకు గౌరవ । కారణంబు
సకలరిపుచక్రవిలయంబు । సాహసంబు.

మను — మహారాణి మమ్ము క్షమించునుగాక! మే మామె యాజ్ఞ
నుల్లంఘింపము.

రాణి — అట్లయిన, మేల్కొనుడు! లెండు. కరవాలము నెత్తుఁడు! భ
యంకరసింహద్రవణమున సర్పము పడగ నెత్తినట్లు లెండు!
ఘోర మేఘగర్జనముచే, పర్వతకుహరముల లీనమైయున్న ప్ర
తిధ్వని మేల్కొనినట్లు లెండు! ఝంఝామారుతము వీచుట
చే సముద్రమునందలి యలలు లుప్పొంగినట్లు మేల్కొనుడు!
మీలోఁ గాంతివిహీనమై యణఁగియున్న శౌర్యానలమును
దేశాభిమాన వాతూలమున ప్రజ్వలింపఁ జేయుఁడు!



మను — మహారాణి! అట్లే చేయ సంసిద్ధులము. ఈ యుద్ధమందు జయ
ముపొందెదము నాఁ తను త్యజించి, మరణమునకు సిద్ధముగ
నుండవలెను.

రాణి — ఔను. స్వేచ్ఛకొఱకు — స్వదేశము నిమిత్తము — పరులకై —
కర్తవ్యముకొఱకు మరణించువారు వీరస్వర్గమును పొందెదరు.
మాతృభూమిపట్ల నభిమాన మున్నవారిని — స్వధర్మము నుద్ధ
రించు సంకల్పముఁ గలవారిని — స్వాతంత్ర్యముకొఱకు ప్రాణ
ములఁ ద్యజించువారినే నేను 'రం' డని యాహ్వానించెదను.
అట్టి యుదారపురుషు లెవ్వరైన గలరేని, కంఠము నెత్తి "మా
తృభూమికిజయ్!" అని యొక్కసారి జయశబ్దమును మ్రోగిం
పుఁడు.

సీ. ప్రళయసంధ్యాకాల । భయదతాండవలోల
కాలకంధరపాద । ఘట్టనములు
కబళితాఖిలజీవ । కల్పాంతకోద్దండ
బాహుదండద్వయా । స్ఫాలనములు
బ్రహ్మాండభాండోద్ధ । రణకాలసంరంభ
దంభవరాహవి । జృంభణములు
నిర్ఘాతసంఘాత । నిర్భిన్నభూగర్భ
పర్జన్యభీషణ । గర్జనములు

గీ. ఆగ్రహోదగ్రభైరవ । విగ్రహోగ్ర
వదన గహ్వరజనిత భం । భం స్వనములు
ప్రణుత రసపుత్రవీర ని । ర్వక్రవిక్ర
మాహవక్రమంబునకుఁ దో । డౌనుగాక.

మ. దళితానంతదిగంతమై ధణాధణం । ధాణం ధణాధ్వానమై
ప్రళయాభీలపయోద నిష్ఠురరవ । ప్రారంభ సారంభమై

నిలయంబై, రిపురాజకర్ణయుగళి నిర్ఘోష నిర్ఘాతమై
చలితారాతివితానమైన రణని స్స్వానంబు మ్రోగింపుఁడీ.

[తెరలో రణభేరి]

అందఱు — మాతృభూమికి జయ్!

(నిష్క్రమింతురు.)

## చతుర్థదృశ్యము.

[మీవారున నొకగిరిదుర్గముచెంత, శిలానిర్మితమగు నొకవిస్తీర్ణ వేదికపై నుపవసించి, వినిర్మల, శీతల చంద్రికల ననుభవించుచుఁ గమలాజయసింహు లుపవిష్టులై యుందురు. కమల గానముచేయును.]

కమ — నాథా! నాసంగీతము భవదీయకర్ణముల కింపుగ నున్నదను కొనియెదను.

జయ — లేకేమి! నీమృదుమధురగానమను మోహనమంత్రము చేతనే గదా, స్వభుజాశక్తియందు, దిగంతవిశ్రాంతయశోవంతుడగు, రాజసింహునిపుత్రుడ నగు నేను, నిజమానుషమును గోల్పోయి, స్త్రీలోలుండ నను నిందకుఁ బాత్రుడనైతిని!

కమ — (ఇంచుక కోపము నటించుచు) అంతటి దుర్మార్గురాల నగు నేను మీచెంత నుండుటకుఁ దగను. (లేచి పోవుచుండ జయసింహుఁ డామె చీరకొంగును పట్టుకొనును.)

జయ — కమలా! నేను సత్యమును పలుకుచున్నాను. ఆగ్రహింపకుము. మార్వాడదేశమాతకు సంకటము చేకురెనని, తద్రక్షణమునకై తండ్రిగారు నన్ను రణరంగమునకుఁ బోవ నన్నుజ్ఞ యొసంగినను, నతని యాజ్ఞ నుల్లంఘించి, [illegible]



మావంశమునకును మచ్చఁదెచ్చితిని. ఆహా! ఏమి నీమోహన మంత్రప్రభావము!

[సరస్వతి ప్రవేశించును. కమ లామెనుచూచి యచటినుండి నిష్క్రమించును.]

సర — నాథా!

జయ — ఏమి, సరస్వతీ!

సర — మార్వాడయుద్ధపరిణామమును వింటిరా?

జయ — లేదు. తెలియఁజెప్పుము.

సర — (వదనమున ఖేదచిహ్నములు పొడసూప హీనస్వరమున) మార్వాడదేశము విజయము గాంచెను; కాని, మీసహోదరుఁడు భీమసింహుఁడు మృతిఁజెందెను.

జయ — (కన్నీరు గార్చుచు) హా! మహోదారవీరసింహా! భీమసింహా! స్వర్గధామమును చేరి సౌఖ్యముందుము!

సర — మఱి మీరో?

జయ — సఖి! నాకు నరకప్రాప్తియని వేరుగఁ జెప్పవలెనా! అదిగో సమరదాసాదు లిచ్చోట కేతెంచుచున్నారు. వారిని చూచుటకు నాకు కరము లజ్జ పొడముచున్నది. పోయెదను.

(సరస్వతీజయసింహులు నిష్క్రమింతురు.)

[రాజసింహుడు, జోధపురరాణి, సమరదాసుడును ప్రవేశింతురు.]

రాజ — రాణీ! ఈస్థానము నలంకరింపుము. మాభీముఁడు సర్వదా యీవేదికపైనే కూర్చుండెడివాఁడు.

రాణి — రాణా! భీమసింహుని పవిత్రచరిత్రము హిందూదేశవీరాగ్రేసరులచరిత్రములవలె స్వర్ణాక్షరముల లిఖింపఁదగినది,

రాజ—మ రెక్కడి భీమసింహుఁడు? ఇఁక నే నామరణము వానికొఱకు వగచుచుఁ గాలము వెచ్చింపవలసినదే.

రాణి—క్షత్రియులకు రణక్షేత్రమునఁ జచ్చుటకంటె గౌరవనీయమగు విషయ మింకొకటిలేదు. భీమసింహుఁడు మత్పుత్రుఁడై, వేరొకమరణమును పొందియున్నచో, నేను దుఃఖించెడుదాననే, కాని యుద్ధమున ప్రాణములఁ గోల్పోయిన సంతానమునకై యంతగా దుఃఖింపవలసిన పనిలేదు.

రాజ—సమర్దాస్! మాభీముఁ డెట్లు యుద్ధ మొనరించెనో వర్ణింపుము! విని యానందించెదను.

సమ—రాణా! అట్టియుద్ధమును నే నెన్నఁడును చూచియుండలేదు. అది రాత్రిసమయము. ఆకసము నల్లనిమేఘములచే నావరింపఁబడియుండెను. ఎడతెగని వర్షము కురియుచుండెను. విశ్వమంతయు నంధకారమున లీనమైపోయెను. అట్టి ఘోరాంధకారబంధురసమయమున భవత్పుత్రుఁడు, మే మెన్నిసారులు నిరోధించినను, లక్ష్యపెట్టక, పదివేలసైన్యములతో మొగలు శిబిరము నాక్రమించెను. శత్రుసైన్య మొకలక్షకంటె నధికము!

రాజ—తదుపరి ?

రాణి—మాతృభూమికి జయ్! అటుతరువాత ?

సమ—తదుపరి మాకు కరవాలముల ఝుంకారధ్వని వినవయ్యెను. ఆవెనుక తత్కరవాలసంఘర్షణజనితస్ఫులింగముల కాంతులు కానవయ్యెను. ఆకాంతిలేశముచే రుధిరప్లావితమగు రణరంగము మాకుఁ గన్పట్టెను. క్రమక్రమముగ శత్రువుల యార్తనాదములు మాకర్ణపుటముల సోకెను. అంతలో నానినదములు వర్షధారాధ్వనులలో లీనములయ్యెను.



రాజ—అలనాఁడు మాభీముఁడు "ప్రవాసముచేయుచున్నను, నా దేశమునకై ప్రాణదానముచేయ సంసిద్ధుఁడ" నని పలికెను. అటుపిమ్మట?

సమ—కొంతసేపటికి, తటిల్లతాకాంతుల సాహాయ్యమున, మాకు రుద్రాకారుఁడై, తనపదివేలసైన్యములను, పదిలక్షలుగా తోప శత్రువుల నదేపనిగ విచ్ఛేదముగావించుచున్న భీమసింహుఁడు కనఁబడెను. తోడనే నేను కొంతసైన్యముతో వానిసహాయ్యమునకై పోయి, శిబిరమును జేరి చూచుసరికి, మొగల్ సైన్యములు చెదరిపోవుచుండెను. శిబిరమున నెవ్వరును లేరు. రణక్షేత్రమును వెదుకగా భీమసింహుని మృతదేహము కాన్పించెను.

రాణా—హా! పుత్ర! హాపుత్ర! (మూర్ఛిల్లును.)

(అవనికాపతనము.)

పంచమదృశ్యము.

స్థానము:—మొగల్ శిబిరము.

[ఇరువురుబ్రాహ్మణులు సంభాషించుకొనుచుందురు.]

మొదటిబ్రాహ్మణుఁడు—ఇదిగో! సూర్యనారాయణశాస్త్రుల్లు! బహుకాలదర్శన మిప్పించేరు. తెల్లవారిలేవగానే మాకు మొదట మీముఖసందర్శనం ఔతుండేది. అలాంటి దిన్నాళ్ళు పశ్చిమసముద్రంలోనే ఉండిపోవడంచూస్తే ఏదో విశేషం ఉన్నట్లు తోచుతుంది.

సూర్య—అన్నగారూ! మీరు పండితులుకాబట్టి కల్పనాచాతుర్యం చూపిస్తున్నారు కాని, విశేషా లేవున్నాయండి? కొంచెం

లౌఖ్యంపనిమీద గన్నవరం వెళ్ళవలసివుండెను. అందుచేత ఆలస్యంఅయిపోయింది.

మొదటి — మీరన్నిసంగతులలోనూ జోక్యం కలిగించుకొంటారు. అదేవిటి, తలకాయ తడువుకుంటున్నారేమిటి? అవురంగజేబు మన్నందరినీ తురకాళ్ళను చేసేడు; అందుకు విచారిస్తే లాభంలేదు. ఆమాటకేంగాని, దావామాటెత్తేరు. ఆదావా ఎవరెవరికి? రాజ్యంకోసం ఆజమున్నూ అక్బరున్నూ తగవులాడుకోలేదుకదా?

సూ — ఆఁ! బాగా జ్ఞప్తికి తెచ్చేరు. మార్వాడయుద్ధంలోకూడా, ఓడిపోయినందులకు, అక్బరుకున్నూ, తహబరుఖానుకున్నూ కొంచెంరోజుల్లో కట్నాలు దొరుకుతాయని విన్నాను.

మొ — మీరన్నమాట నాకు బోధపడలేదు.

సూ — ఔరంగజేబు అక్బరుని సింహాసనంమీద కూర్చుండబెట్టాలని అనుకున్నాడు; కాని ఇపుడు ఆజముకే రాజ్యం ఇస్తాడట! తహబరుఖాన్కు దెబ్బలపెళ్ళి చేస్తాడట!

మొ — అయితే భయంలేదు లెండి. ఈసమయంలో వీళ్ళిద్దఱూ దుర్గాదాసుని బతిమాలుకుంటే మనబ్రాహ్మళ్ళని పీక్కుతింటూన్న చక్రవర్తివంటివాళ్లని పదిమందిని ఒక చూపు చూసేస్తాడు. రాజపుత్రులతో ఈతురకముండాకొడుకులు యుద్ధం చేయగలరటండీ!

మార్వా — వాళ్ళకి మనం చెప్పాలి. దుర్గాదాసుదగ్గఱికప్పుడే అక్బరు ప్రయాణమైనాడట! మీరన్నమాటకి మాత్రం నే నొప్పుకోనండీ! రాజపుత్రులు తురకలతో రారు. వాళ్ళదంతా దొంగయుద్ధం.



మొ — అది దొంగయుద్ధం కాదండీ; అవన్నీ వాళ్లయుక్తులు. తురకల్ని పొగడ్డానికి మీరు నిజంగా భట్రాజులే సుమండీ!

సూ — ఏవిరో! పండితుడవని వూరుకుంటూంటే నీకు నోటిదురుసు మహాలావుగావుంది. నాతడాఖా చూపట్తాను కాసుకో. తురకాళ్ల బలం నాకన్న నీకెక్కువ తెలుసునా యేమిటి?

మొ — నీకెంతబలంవుందో ఆవస్తూవున్న అక్బరుదగ్గిఱ చూపించు నీగర్వం అణగ్గొట్తాడు.

సూ — వాడికి నాకు చాలాస్నేహం. వాడురానీ నీపనిపట్టిస్తా.

[మొదటిబ్రాహ్మణుడు నిష్క్రమించును. కిరీటధారియై, సురాపానమత్తతచేఁ దూలుచు, అక్బరు ప్రవేశించును.]

అక్బ — అరే బొమ్మన్! హంకీ పాదుషావాడూ అని పిల్వాల. నాది పాదుషానంబరు ఎట్కీ.

సూ — చిత్తము. పాదుషా అంటె తమరే పాదుషావారు.

అక్బ — ధత్, సువర్! రెండుపాదుషా ఎక్డాజే? ఒకటిమాట సెప్త్రె వ్రు లేదు. (కాలితో తన్నుచు) కౌన్ హైరే? (ఎవరక్కడ?)

[సేవకుఁడు ప్రవేశించి] జీ, హుజూర్!

అ — ఇస్కొదూర్ హటావో (వీని నావలకు గెంటివేయుము.)

(సేవకుడు సూర్యనారాయణావధాన్ల నావలకు గెంటును.)

అ — అరే! ఔర్ మదిరా లావో! (ఇంకా సారాయిని తెమ్ము)

[సేవకుడట్లు తెచ్చియిచ్చును. అక్బరు కల్లుఁ ద్రాగుచుండ తహబర్ ఖాన్ ప్రవేశించును.]

త — ఓహో! షాజాదావారా! సలాం!

అ — ఐ! తూ ఏక్ ఖూబ్సురత్, ప్యారీ కోలానా! (ఓయీ! నీవొకయందకత్తెయగు వేశ్యను తెమ్ము.)

తహ—(క్రోధమున) ఛీ! మూర్ఖ! నాచేత—నీమేలునుకోరి, నిన్ను చక్రవర్తినిచేయ నుద్దేశించియున్న నాచేతనే, నీచకృత్యములఁ జేయింపఁజూతువా?

అక్బ—అరే! నౌకర్! యే ఘమండ్ కర్తాహై. ఇస్కో—భీభీహాతాదో! (సేవకా! వీఁడు మిగుల గర్వించుచున్నాఁడు. వీనిగూడ గెంటివేయుము.)

తహ—నన్ను నీవు గెంటింతువా? విశేషసురాపానజనితమదోన్మత్తుండవై నన్ను గెంటింతువా? తులువా! మనమిట్టి నీచకార్యములను చేయుటచేత నేగదా, పవిత్రహిందూజాతి మనలనిట్లు నిరసించుచున్నది? కానిమ్ము, బికానీరురాజగు శ్యామసింహుని చేత నొకజాబు వ్రాయించి, రాజపుత్రులు నిన్ను గెంటివేయునట్లు జేసెదను. (అని త్వరితగతిని పోవుచుండును.)

అక్బ—అరే! అరే! అరే! ఖైరో! అరే! బాత్ నైమాన్తాహై? మైఁ పాదుషాహూఁ. నౌకర్! చలో! చలో! (ఆసనమునుండి దిగి నౌకరువెంటరా, తహాబరును వెంబడించును.)

## షష్ఠదృశ్యము.

ఆజ్మీరునందు, ఔరంగజేబు భవనము.

[శయనాగారమున నొకతల్పముపై మేనువాల్చి, దిలేర్ ఖానుతోఁ జక్రవర్తి మాట్లాడును.]

ఔరం—అహా! కన్నకుమారుడే నన్ను మోసపుచ్చి, శత్రుపక్షమున జేర, నన్ను లసంగతి చెప్పుట కేమున్నది? అక్బర్! రాజపుత్రుల సహాయమునను, నన్నోడించి, సింహాసనారూఢుడవయ్యెదవా? నేనేమి యపరాధము నొనరించితిని? మొగల్ సామ్రాజ్యమును నీయధీనమం దుంచుట కేనుపడిన కష్టములను,



పన్నిన పన్నాగములను, నీవు మఱచిపోతివా? తండ్రి! నీకెవరిట్టి కునీతుల బోధించిరోగదా! (దిలేరు నుద్దేశించి) సేనానాయకా! రాజపుత్రశిబిరమునుండి క్రొత్తసమాచారము లేమైన వచ్చినవా?

దిలేర్—లేదు.

ఔరం—అక్బర్! నీవింత ద్రోహము జేతువని నే నెన్నడు ననుకొనలేదు.

దిలే—జహాఁపనా? శ్రీవారు మొగల్ సామ్రాజ్యసింహాసనమును పొందుట కెన్నిమాయోపాయములఁ బన్నుటలేదు. సహోదరులనే హత్యకావించిరే! తమపుత్రుఁడగు అక్బరు నామార్గమునే యవలంబించెను.

ఔరం—దిలేర్! సావధానుఁడవై మాటలాడుము.

[శ్యామసింహుఁడు ప్రవేశించును.]

ఔరం—మహారాజా! ఏమైన వింతలా?

శ్యా—ప్రభూ! కార్యము సఫలమైనది. కలనైన నట్లగునని యూహించలేదు.

ఔరం—ఏమీ! రాజపుత్రు లక్బరును పరిత్యజించిరా? అదెట్లు?

శ్యా—జహాపనా! "మీయెడల స్నేహభావమునఁ బ్రవర్తించుచుఁ, జక్రవర్తిపై మీరెప్పుడైనను, దండెత్తవచ్చినపుడు, మిమ్ములమోసపుచ్చుటకై అక్బరు ప్రయత్నించుచున్నాఁడు. జాగ్రత." ఇట్లని నేనొక జాబును లిఖించి, రాజపుత్రశిబిరమున కేగి తల్లేఖను సమర్దాసున కొసంగితిని. అందలి విషయములను విశ్వసించి, యక్బరును వారికడకు పంపుట తమ పన్నుగడ యని యూహించి సమర్దాసాదులు యువరాజున కాశ్రయ మిడుటకు సమ్మతించుటను మానిరి.

ఔరం—ఆజాబును దుర్గాదాసుకూడ విశ్వసించెనా?

శ్యా—అతఁడాసమయమున నుదయపురమం దుండెను.

ఔ—తహబర్‌ఖాను డెచ్చటనున్నాడు. నాపుత్రుని కీకుమంత్రముల నతఁడే యుపదేశించెను.

శ్యా—"నీవు కొందఱు రాజద్రోహులతోఁ దిరుగుచున్నట్లు పాదుషా వారు తెలిసికొని, యీజాబు నందుకొనినవెంటనే యతని సాన్నిధ్యమున, క్షమాపణముఁ గోరుకొనవేని, నీకు గఠినశిక్ష విధింపనున్నా"రని తహబరుఖానునకు లేఖ నంపితిని. అద్దానిం గని యతఁడు శ్రీవారిదఱికి వచ్చుచుండ, మార్గమధ్యమున, నేనును, ఆజిమును, అతనిని బంధించి, కారాగృహమం దుంచితిమి.

ఔ—బికానీర్ మహారాజా! మీకు నే నెంతయుఁ గృతజ్ఞుండను. (ఆవల జనకోలాహలమును గాంచి) ఏమది? తుపాకిశబ్దము వినవచ్చుచున్న దేమి?

[రుధిరసిక్తశరీరుఁడై తహబరుఖాను ప్రవేశించును.]

ఔ—తహబర్!

త—(చేతనున్న తుపాకిని చక్రవర్తిశిరమున లక్ష్యముంచును.)

ఔ—ద్రోహీ!

త—(తుపాకిని పేల్చబోవుచుండ, దిలేరు లోనుండి కత్తిని దూసి, తహబరును కొట్టబోవును. తహబర్ త్వరితగతిని పాఱును.)

ఔ—అహా! ఏమి యీమూర్ఖుని సాహసము! నన్ను హత్యకావించి, అక్బరునకుఁ జక్రవర్తిత్వము నొసంగసమకట్టి, ద్వారపాలకులను హతమొనరించి, నిర్భయముగ లోనం బ్రవేశించెనే! దిలేర్! నేడు నీవు లేకున్నచో నేనొకతుచ్ఛుని హస్తమున



ప్రాణముల విడిచెడివాడనే, నీకేమి బహుమానము కావలయునో కోరుకొనుము.

ది—జహాఁపనా! భవత్ప్రాణసంరక్షణార్థమే నేను తమసేవనుంటిని; లేకున్నచో నిదివఱకే రాజపుత్రుల పక్షమునఁ జేరియుందును.

(నిష్క్రమించును.)

## సప్తమదృశ్యము

స్థానము:—రాజపుత్రశిబిరము.

[దుర్గాదాసు, సమర్దాసు, రాజపుత్రసరదారులును నిలుచుండియుందురు.]

దు—విజయసింహా! కుమారుఁడగు భీమసింహుని మరణవార్తను విని మూర్ఛితావస్థయందున్న రాజసింహుని పురమును ముట్టడింప సాహసించిన మొగలుల నేమిచేయవలెను?

స—సర్వమునైన విశ్వసింపవీలగును కాని మొగల్‌జాతిని నమ్మకూడదు. వారి నేమిచేసినను పాపములేదు. తాపము చల్లారదు. కోప ముపశమింపదు.

[ద్వారపాలకుఁడు ప్రవేశించును]

ద్వా—మహాప్రభూ! సపరివారముగ నక్బరు ద్వారముకడ వేచియున్నాడు.

స—వాని నచటనే యుండనిమ్ము. ఇందేదో మోస మున్నట్లున్నది.

దు—సహోదరా! ద్వారముచెంత వేచియున్నవాఁడు శత్రువైనను, స్నేహితుఁడైనను, గౌరవించి పంపుట మనధర్మము. (ద్వారపాలునితో) అతనిని లోనికిఁ దోడ్కొనిరమ్ము. సర్దారులారా! అతనితో సగౌరవముగ సంభాషింపుఁడు!

[పరివారయుతుఁడై అక్బరు ప్రవేశించును.]

అ—(దుర్గాదాసునకు నమస్కరించి) రాథోర్ సేనాపతీ! బంధుజన తిరస్కృతుండనై, తండ్రి కుపితుఁడనై, సహాయము నభిలషించి మీశరణుఁజొచ్చిన నన్నిట్లు నిరాకరించుట ధర్మమా?

దు—(శ్యామసింహ లిఖితమగుజాబును యువరాజునకుఁ జూపును.)

అ—(జాబును చదివికొని) ఇది కేవలము మిథ్య. నన్నుభయ భ్రష్టుని చేయఁబూని వ్రాసిన కపటలేఖ.

(అక్బరు కొమరితయగు రజియా కన్నీరు కార్చుచు)

రజి—రసపుత్రవీరాగ్రేసరా! తండ్రిగారి కభయ మిడుము. ఆజాబు నిజమగునది కాదు.

అ—దుర్గాదాస్! నన్ను నడిసముద్రమున ముంచివేయకుడు. ఆశ్రయదాన మొసఁగుడు.

దు—సామంతులారా! మీయభిప్రాయ మేమి?

సా—అక్బరు తండ్రిచెంతకుఁ బోయి క్షమార్పణము కోరుకొననిండు.

దు—సమర్దాస్! ఇందును నీవేమందువు?

స—అతని కాశ్రయమిడుట పామును పాలుపోసి పెంచుటయు నొకటే యని నాయభిప్రాయము.

దు—మీరు క్షత్రియులు కానేరరు. మిమ్ముల నిందించిన ఫలమేమియును లేదు. మనపాదముల వ్రాలి శరణువేడుచున్న శత్రువున కాశ్రయదానము చేయుటయె క్షత్రియధర్మము. ఇదిగో! నేను మిమ్ములనందఱను పరిత్యజించి, పోవుచున్నాను. (అక్బరు నుద్దేశించి) యువరాజా! ఈదుర్గాదాసు సజీవుఁడైయున్నవఱకును నీకెవ్విధమగు నపాయము చేకురదు. రమ్ము! పోదము.

(సపరివారముగ నక్బరు వెంటరా దుర్గాదాసు, శిబిరమునుండి నిష్క్రమించును.)

శ్రీ

# దుర్గాదాస్

## చతుర్థాంకము.

ప్రథమదృశ్యము.

స్థానము:—ఢిల్లీ—దర్బారుభవనము.

[చక్రవర్తి తనయుఁడగు ముఅజిము—సేనానాయకుఁడు దిలేరుఖానుఁడు సంభాషించుచుందురు.]

దిలే—అయిన, దుర్గాదాసుఁ డక్బరును వెంటనిడికొని దాక్షిణ్యము నకుఁ బోయెనా?

ముఅ—అక్బరున కాశ్రయదాన మొసంగుటకు రసపుత్రసామంతగణ మియ్యకొనుట లేదు. ఇఁక నతని పరీక్షించువాఁడు శంభాజీమహారాజు తప్ప వేరెవరును లేరు.

దిలే—దుర్గాదాస్! నీపరోపకారమునకు నేను మిగుల హర్షమొందుచున్నాను. నీజీవితము ధన్యమైనది—పవిత్రమగునది. ఆశ్రితుఁడగు శత్రువుని ప్రాణసంరక్షణార్థము, నిజసహోదరుని—సామంతగణమును—స్వదేశమును కూడ పరిత్యజించితివిగా? ఆహా! నీ నామోచ్చారణ మొనరించుటచే నాపాపము లన్నియు నశించిపోయినవి. భగవంతుఁడు నీకు మేలుసేయుఁగాక!

ముఅ — అతని కత్యంతాప్తులును, అతని నిమిత్తము ప్రాణత్యాగమునకుకూడ సంసిద్ధులైనవారును, ఐనువందల రసపుత్రులుండిరి. ఆస్వల్పసైనికభటసహాయ్యమున నతఁడు దాక్షిణాత్యమునకుఁ బోవుచుండ, ససైన్యముగ నే నాతని బంధించితిని. అయిన నెట్టెట్టులో, అతఁ డొకనాటిరాత్రిసమయమున నిజపరివారముతో, మాసైన్యముల భేదించుకొని పోయెను.

దిలే — దుర్గాదాస్! పవిత్రమగు "వీర" శబ్దమునకు నీవే తగుదువు.

ముఅ — తండ్రిగా రేబదివేలరూపాయలను రాఠారుసేనాపతికి బంపి, అక్బరును విడిచిపెట్టవలెనని బ్రతిమాలుకొన్నను, తద్ద్రవ్యము నతఁ డక్బరున కొసంగి, తండ్రిగారి ప్రార్థనమును నిరాకరించెను.

దిలే — దుర్గాదాస్! ఏమి నీయౌదార్యము! ఇదిగో, మరల నీకు ధన్యవాదము లొసంగుచున్నాను.

ముఅ — ఇపుడు మార్వాడదేశసైన్యాధ్యక్షత సమర్ధాసున కొసఁగఁబడెను. అక్బరు, భార్య మరణించుటచేఁ గుమార్తెను సమర్ధాసు నొద్ద విడచిపోయెను.

[ఆజిం ప్రవేశము]

ఆ — సేనాపతీ! రాజపుత్రికులతో మొగలులకు సంధి నేర్పఱుపుమని తండ్రిగారు మీతో చెప్పుమనిరి.

ది — పరమేశ్వరుఁ డాతనికి శుభ మొసంగుఁగాక; అయినచో, సంధికి తొలుత మనమే గడంగవలయును. విజయులగు రాజపుత్రులెన్నఁడును సంధిభిక్ష నడుగరారు

ఆ — అట్లుకాదు. రాజపుత్రులే మొదట సంధిషరతులను నిర్ణయింపవలెనని తండ్రిగారి యాజ్ఞ.

ది — అది యసంభవము, ఇది పూర్వమువలనే కపటప్రయత్నముగఁ



దోఁచుచున్నది. విజితులు తొలుత షరతుల నేర్పఱచి సంధికి గడఁగవలెను.

ఆ — మీ రధికప్రసంగమును చేయక, పాదుషాయాజ్ఞ నిర్వహణ మొనరింపవలెను.

ది — (చిఱునవ్వు మొగమునఁ దోప) పులిపిల్ల పులిగాక మఱేమగును. సాహజాదా! నిక్కముగ తండ్రిగారు రసపుత్రికులతో సంధికి సమ్మతింతురేని, నే నుభయజాతులమధ్యమున నెట్టికలహములును, భేదాభిప్రాయములును లేకుండ సంధిప్రయత్నముల సలుపుదుననియు, నిందేదైన మోసము కన్పడినచో, నీకార్యము నాచే కానేరదనియు, నామాటలుగ తండ్రిగారితో నుడువుము.

(నిష్క్రమించును.)

ముఅ — (ఆజిముతో) ఆజిం! తండ్రిగా రింతశీఘ్రముగ సంధిప్రయత్నములఁ జేయఁగోరుటకుఁ గారణ మేమైయుండును?

ఆ — ఆతఁడు దాక్షిణాత్యమున కత్యవసరముగఁ బోవలెను—

ముఅ — అక్బరును తిరిగి తీసికొనివచ్చుటకుఁ బోవుచున్నారా యేమి?

ఆ — ఔనట్లె. నీవక్బరును నిజేచ్ఛను విడచిపెట్టితివని, తండ్రిగా రభిప్రాయపడుచున్నారు.

ముఅ — అది సత్యమేయగును. రాజ్యతంత్రానభిజ్ఞుఁడును, అమాయికుఁడును- దుర్బలుఁడు నగు నాసహోదరుని, జీవములతోఁ దండ్రిగారి క్రోధాగ్నిజ్వాలలఁ బడవేయ నామనం బొప్పకుండెను. ఇప్పుడు వాఁడు మహోదారుఁడగు దుర్గాదాసుని భుజచ్ఛాయను నిర్భయముగ నున్నాఁడు.

ఆ — అయిన తండ్రిగారి యాజ్ఞ నుల్లంఘించుటకు నీవుభయంపడవా?

ముఅ—చక్రవర్తి నాకుఁ దండ్రి. అక్బరు నాకు సహోదరుఁడు. ఇంకఁ జెప్పుటకు నేమున్నది.

(ఇరువురు మౌనముతో వెడలుదురు.)

## ద్వితీయదృశ్యము.

స్థానము—జోధపురమందలి ప్రాసాదము

[రాణి పట్టువస్త్రముల ధరించి, ఏకాకినియై యుండును]

రా—(నతమస్తకయై చేతులజోడించి) ప్రభూ! ప్రాణవల్లభ! ఒకప్పుడు మీరు పరాజితులై రణక్షేత్రమునుండి మఱలిరాఁగా, నేను దుర్గద్వారమును బంధించి, "రసపుత్రికులు గెలువనిదే తమయిండ్లకు మఱలిరారు. మఱియొకసారి పోయి ప్రయత్నింపుఁ"డని మిమ్ములఁ బ్రేరేపించి, మృత్యుసమ్ముఖమునకుఁ బంపితిని. స్వామీ! ఆ నేను సంతోషాంతరంగమున, మంగళధ్వానములచే దిక్కులు పిక్కటిల్ల, నగ్నిజ్వాలలంబడి ప్రాణములఁ ద్యజించి మీపాదసన్నిధిఁ జేరవచ్చుచున్నాను. ఇహలోకమున నేఁ జేయవలసిన కార్యము లింకేమియు లేవు. శత్రుహస్తగతమై- శిథిలమైయుండిన మీమార్వాడరాజ్యమును పునరుద్ధరించితిని. అంతటితో నాపని పూర్తియైనది. నేఁడు సతీధర్మపాలనముఁ గావించెదను.

శా. పోరాడన్ బెరకేపి శత్రుబలమున్ శోకార్పఁబొండంచు నా
వీరస్వర్గము మీకుఁ జూపితిని; పృథ్వీన్ నేను జీవించి మీ
యూరుం బేరును నిల్పి యీక్షణము విధ్యుక్తంబుగా మిమ్ము నేన్
జేరన్ వచ్చెద నాదరింపఁదగు దాసిన్ నన్నుఁ బ్రాణేశ్వరా.

[పాడుచు రజియా ప్రవేశించును.]

ర—మహారాణీ! ఏమిచేయుచున్నారు?



రా—రజియా! నేను ప్రయాణసన్నాహమందున్నాను, (ఆకసమును వ్రేలితోఁ జూపి) ఆస్థలమున, నాప్రాణనాథుఁడు నాకై నిరీక్షించుచున్నాఁడు. నేనాతని సమీపింపఁ బోవుచున్నాను.

ర—(ఆశ్చర్యమున) ఆస్థలమున, మహారాజు మీకొఱకు వేచియున్నారా? నాకు కనబడుటలేదే! (అని తలపైకెత్తిచూచును.)

రా—అది నాకు తప్ప మఱియెవరికిని దృగ్గోచరముకాదు.

ర—కుమారు నెవరివద్ద విడచిపోయెదరు?

రా—నీచెంత విడిచెదను. మీరందరునుండ వానికి భయమేమమ్మా.

ర—ప్రపంచజ్ఞానములేని పసిబిడ్డకంటె మీభర్త యధికుఁడా?

రా—అది మాధర్మము. మాకుఁ బతితోడిదే లోకము. అతఁడు లేకుండిన మాకీజగ మంధకారమయముగఁ దోఁచును. అతని కార్యమును నిర్వహించుటకే యింతవఱకును దేహమునఁ బ్రాణముల నిల్పుకొంటిని.

ర—మీరు పోవుటకు నేను సమ్మతింపను.

[సమర్దాస్ ప్రవేశము.]

రా—సమర్దాస్! కుమారుఁ డెక్కడ?

స—లోననున్నారు. తల్లీ! విశ్వప్రయత్నములను కావించియు, నజితసింహు నూరడింపఁజాలకపోతిని. తల్లిని నేఁ బోవీయనని పలుకుచున్నారు.

రా—వాని నిచటికిఁ దీసికొనిరమ్ము!

(సమర్దాస్ నిష్క్రమించును.)

రా—(తనలో) పరమేశ్వరా! నిజధర్మపరిపాలనమునకై నాహృదయమును పురికొలుపుము. అజితసింహు నూరడిలఁ జేయుము. నాసతీత్వమునకు భంగము వాటిల్లకుండఁ గాపాడుము.

[అజితసింహుని లోడ్కొని సమర్దాసు ప్రవేశము.]

రా—(కుమారునితో) తండ్రీ! నన్నుఁ బోనీయవా?

అ—అమ్మా! నన్నువిడచి నీ వెచటికిఁ బోయెదవు?

రా—ఎంతకాలముజీవించినప్పటికిఁ దుదకు నందఱు నెచ్చోటుఁ జేరుచున్నారో, యచటికిఁ బోవుచున్నాను.

శా. ఈలోకంబున నేమియున్నదని ప్రా । ణేశుండు లేకున్నఁ బ్రా
ణాలన్ బట్టిచరింతు, భోగములపై । నాకాశయున్ జచ్చె, నిం
కేలా కామముఁ గ్రోధమున్ దనయ, నే । నీమేను పోషించి యే
లీలన్ లోకులు ఛీయనన్ విధవనై । క్లేశంబులం బొందెదన్?

అ—(కంపితస్వరమున) అమ్మా! నే నెట్లు సమ్మతింపఁగలను?

రా—లోకమునఁ దల్లులందఱును చిరకాలము జీవించియుండ లేదు. నాయనా! నన్నుఁ బోనిమ్ము.

అ—లోకమున తల్లులు, కోరి, బిడ్డలను త్యజించుట లేదమ్మా!

రా—పతిధర్మ మిదియే. తండ్రీ! నన్ను నిరోధింపఁదగదు.

అ—ఇది మాతృధర్మము కాఁజాలదు. తల్లీ! నీవట్లు నన్ను దిగనాడ నుద్దేశించుట న్యాయము కాదు. (ఏడ్చును.)

రా—(క్రోధముతో) సమర్దాస్! వీఁడు నాకొమారుఁడు కాఁడు. క్షత్రియుఁడు కాఁడు. నేను వీనికే తల్లినిగాను. సమస్తమార్వాడదేశీయులకును తల్లినే. వీని వయస్సున నెందఱెందరో రసపుత్రికులు రణభూమిని ప్రాణత్యాగమును చేసియున్నారు. వీఁడొక శిశువువలె, స్త్రీవలె, నేడ్చుచున్నాఁడు. (కుమారునితో) ఛీ! మూర్ఖా! నావంశమునకు మచ్చఁ దెచ్చితివిరా!

అ—(తలవంచి యూరకుండును.)

రా—సమర్దాస్! వీనిని లోనికిఁ దీసికొనిపొమ్ము!

(సమర్దాసుఁ డట్లు చేయును.)



రా—ఈశ్వరా! నారీహృదయములం దమితప్రేమ నుదయింపఁజేయుట నీకు ధర్మము కాదు. ఇట్టి ధర్మకార్యాచరణముల కయ్యది యాటంకముగ నుండును. ఇదే నేను పోవుచున్నాను. నాకొఱకును మార్వాడముకొఱకును—నాభర్తనిమిత్తము స్వార్థత్యాగ మొనరించిన దుర్గాదాసును భద్రముగఁ గాపాడుము

[దృశ్యాన్తరమున అగ్నికుండము నావరించి,
స్త్రీజనము నిల్చుండును.]

స్త్రీలు—సతీమణీ! నీపతికడకుఁ బొమ్ము. ఆనందకందళితహృదయమున నగ్నికుండమున దుముకుము. పతిలేనిసతికి గతియుండదు. ఈలోకమున నీకు సంభవించిన దుఃఖములు అన్నియు నీజ్వాలలలో నశించును. స్వర్గధామమును చేరఁగలవు.

రాణి—(ప్రజ్వలించుచున్న యగ్నిగుండమున కెదురునిల్చి)

మ. మునులున్ వేల్పులు బ్రాహ్మణోత్తములు నీ । మూలంబునన్ ముక్తుల
ల్గనుచున్నారని యెంచి శాశ్వతయశః । కాయంబు లోకంబునన్
దనరం జేసి, యశాశ్వతంబయిన యీ । నామేను నీకిచ్చి పా
వనమౌ నాత్మ నొసంగుదానఁ బతికి । న్స్వాహావధూవల్లభా
(అని యగ్నికుండమున దుముకును.)

అవనిక జాఱును.

తృతీయదృశ్యము.

స్థానము—అజ్మీరునందు రాజభవనము.

[ఔరంగజేబు సింహాసనస్థుండై యుండ-దిలేర్ చెంతనిల్చుండును.]

ది—శ్రీవారి యాదేశానుసారము రసపుత్రులతో సంధిఁ గావించుకొనివచ్చితిని. ఈసంధికై సమర్దాసు నతికష్టమున సమ్మతింపఁ జేసితిని.

ఔ—అదెట్లు?

ది—ఇది కపటము గాదనియును, చక్రవర్తిని, మీ రీపర్యాయము విశ్వసింపవచ్చుననియు నెన్నిప్రమాణములఁ జూపినను సమర్దాసు నమ్మకుండెను. అంత నతనివద్ద నాయిరుపురుకుమారులను విడచి, సంధిఁ జేసికొనఁగలిగితిని.

ఔ—సంధినియమము లెట్టివి?

ది—చిత్తూరును, తత్పరిసరప్రాంతములతో రాజపుత్రుల కొసంగవలయును. హిందువులదేవాలయము లికముందు భద్రముగ నుండవలయును. జోధపురరాజున కతనిరాజ్య మీయవలెను. రాణావారు యథాప్రకారము శ్రీవారి కవసరమువచ్చినపుడు సాహాయ్య మొనరించెదరు.

ఔ—రాణాజయసింహుఁ డందులకు సంపూర్ణముగ నంగీకరించెనా?

ది—అతఁ డీషరతున కియ్యకొనెనని సమర్దాసతనిని 'రాజపుత్రవంశము నీయీకార్యముచేఁ గళంకితమైనది. భీమా! నీముఖము నవలోకించుటకు నేను లజ్జించుచున్నా' నని పలికి సభాభవనము నుండి నిర్గమించెను.

ఔ—తరువాత?

ది—ఆతరువాత మఱియొకసభ జరిగెను. ఆసభయందు సమర్దాసుఁడు "మొగలుల నెట్లు విశ్వసింపనగు" నని గర్జించుచు నుపన్యసించెను. అందులకు నేను నాపుత్రద్వయము నాస్థలముననె యుండనిచ్చి, వారిని సమాధానపఱచి, మొగలుల కపఖ్యాతిరాకుండఁ గాపాడితిని.

ఔ—(కన్నీరు గార్చుచు) దిలేర్! నీవు మహాత్ముఁడవు. నీమొదల నేను కావించిన దోషములకు నన్ను క్షమింపవేడెదను. ఈ



సంధి కపటభూయిష్ఠము కాదని రాజపుత్రులను విశ్వసింపఁజేసినందులకు నీకు ధన్యవాదము లొసంగుచున్నాను.

[శ్యామసింహుఁడు ప్రవేశించును.]

శ్యా—రాజాధిరాజులగు నౌరంగజేబుపాదుషావారికి జయ మగుఁగాక!

ఔ—ఏమిసమాచారము, శ్యామసింహా?

శ్యా—సంధ్యనంతరము కొండొకకపటోపాయమున సమర్దాసు నంత మొందించి, మొగల్సామ్రాజ్యమును నిష్కంటకముగఁ జేసితిని.

ది—ఏమీ! శ్యామసింహా! సమర్దాసును హత్యకావించితివా?

శ్యా—ఔను.

ది—(శ్యామసింహుని కంఠమును గట్టిగఁ బట్టుకొని) పాపపంకిలహృదయుఁడవును- దేశద్రోహివగు నిన్ను నేను యమపురి కంపుచున్నాను. నీయిష్టదైవతమును ధ్యానించుకొమ్ము.

ఔ—దిలేర్! వాఁడు నీచుఁడు. వానిం జంపిన నీ కేమిలాభముండును! విడువుము. విడువుము. మసిబొగ్గును నలిపి చేతులను మలినములుగఁ జేసికొనకుము.

ది—ఔను. శ్రీవారు చెప్పినట్లు కళంకమసిలేపమున నాహస్తములు మలినభూయిష్ఠము లయ్యెను. వీనిని పవిత్రోదకమున శుభ్రపఱచి వచ్చెద. (నిష్క్రమించును.)

ఔ—దిలేర్! నాసమస్తసామ్రాజ్యమును వెదకిచూచినను నీవంటి యుత్కృష్టపురుషుఁడు లభింపఁజాలఁడు. (శ్యామసింహు నుద్దేశించి) బికానీర్‌మహారాజా! సమర్దాసును చంపుమని మీతో నేను పలికియుండలేదు. నే నెట్టిఘోరకృత్యముల నొనరిం

చుట మానితిని. ఇందు మీరు స్వతంత్రించినందులకు మీకు రేపు కఠినశిక్షను విధించెదను పొండు!

(శ్యామసింహుఁడు తలవంచికొని, మెలమెల్లగ నావలకుఁ బోవును.)

[మువజీం ప్రవేశించి]—తండ్రీ! నాకై వర్తమాన మంపియుంటిరా?

ఔ — ఔను. మనము దాక్షిణాత్యమునకుఁ బోవలయును. సమస్తసైన్యములను భద్రపఱచుము. నీవుకూడ సంసిద్ధుఁడవై యుండుము. పొమ్ము!

(ఆజి యొకవైపును చక్రవర్తి వేరొకవైపును పోవుదురు.)

---

## చతుర్థదృశ్యము.

స్థానము:—దాక్షిణాత్యమున పాలీగఢదుర్గము.

[దర్బారునందు మరాఠదేశాధిపతి సింహాసనాసీనుఁడై యుండును. ఎదుట దుర్గాదాసుఁడును, అక్బరును, ఆసనములయం దుందురు.]

శంభాజీ—దుర్గాదాస్! సపరివారముగ నక్బరును పాలీగఢమునకుఁ దీసికొనివచ్చుట మిగుల కష్టసాధ్యమగు కార్యము. మీసాహసమునకు నేను మిక్కిలి యాశ్చర్యము నొందితిని.

అక్బ - మేము వచ్చి చాలదినము లైనది.

శం—యువరాజా! రాజకార్యనిమగ్నుండనై స్వయముగ నేను మిమ్ముల సత్కరించలేనందుల కెంతయు దురపిల్లుచున్నాను. మిమ్ముల సత్కరించుటలో మాభృత్యు లెట్టులైన లోపముల నొనరించి యుండిన క్షమింపవేడెద.

అక్బ—రాజా! ఆతిథ్యమొసఁగుటలో మా కెట్టిలోపములును కలుగుట లేదు.

శం—మీపరివార మెచ్చట నున్నది?



దు—యువరాజుపరివారము మార్వాడరాజ్యమున సురక్షితముగ నున్నది. ఔరంగజేబువలన వారి కెట్టిభయమును లేదు. తమరు యువరాజునకుమాత్ర మాశ్రయము నిచ్చినఁ జాలును.

శం—ఈస్థల మొకలోహనిర్మితదుర్గమని భావించి, అక్బరు నిర్భయముగ మెలఁగవచ్చును. దుర్గాదాస్! మీ రితనిని చక్రవర్తులుగఁ జేసితిరని వినియున్నా నది నిజము కావచ్చునా?

దు — ఔను, మహారాజా!

శం—మంచిది. మేముకూడ నక్బరునకు 'చక్రవర్తి' నామధేయము నిడితిమి.

అ — నాసహోదరుఁడగు మువజీమ్ నన్నెదుర్కొనవచ్చుచున్నాఁడు!

దు—అక్బరుపాదుషా నన్వేషించుచు వచ్చి ఆజిముసైతము ససైన్యముగ నహమదునగరమున నున్నాఁడు.

శం — భయములేదు. నేను బ్రతికియుండఁగ నెవ్వరును మనచక్రవర్తి కాపదను ఘటింపఁజాలరు. అనతికాలములో నే నతనిని బహారంపూరునకుఁ గొనిపోయి యభిషిక్తు నొనరింతును.

[ఇరువురు మరాఠసైన్యాధ్యక్షుల ప్రవేశము.]

శాంతుజీ—మహారాజా! జింజిరాదుర్గపతనము సంపూర్ణమైనది.

శం —మంచిది.

కేశవుఁడు—ప్రభూ! కర్నల కేరీ, ఫెర్డినాండులు శ్రీవారి సందర్శనాభిలాషులై ద్వారముకడ నున్నారు.

శం—వెంటనే వారిఁ దోడ్కొనిరమ్ము.

(సైన్యాధ్యక్షుల ప్రస్థానము.)

శం—చూచితిరా, దుర్గాదాస్! ఒకక్షణమైనను విరామముండదు పగ లాహారము లేదు. రాత్రి నిదురరాదు. సంతతము కలహములు—యుద్ధములు—సంధులు—అను నిత్యమేదియో:

కకలహము. ఒకక్షణమైనను ఘాయిలేదు. దానిమాటకేమి. రసపుత్రకులు దేశమునకై ప్రాణత్యాగము నైన చేయువార ని తెలిసికొంటిని; గాని మాటిమాటికిని, వారు మొగలుల పదదళితులగుచుండుటకు కారణ మేమైయుండును?

దు — మహారాజా! ఆర్యావర్తమంతటిలో రాజస్థాన మొక రేణువు. అయిన నీమూడువందలసంవత్సరములవఱకు నది, క్షీణింపక నిలచియున్నది. రాను రాను, సైనికులసంఖ్య తగ్గిపోవుటచే నీపవిత్రభూమి కిట్టిదశ సంభవించినది.

శం — మరాఠదేశముమాత్రము మీదేశమునకుఁ దీసిపోవుననియా తలఁచుచున్నారు!

దు — నేనట్లు భావించుటలేను; కాని, రాజస్థాన మింతదనుక సస్యసంభరితమై, యోధవరుల కాకరమై, దిగంతవ్యాప్తకీర్తివంతమై యుండెనని పలుకుచున్నాను.

[కర్నల్ కేరీ, ఫెర్డినాండుల ప్రవేశము.]

శం — కేరీసాహెబ్! మీజంజిరాదుర్గ మెట్లున్నది?

కేరీ — (ఊరకుండును.)

శం — మాయనుజ్ఞ లేనిదే, పడవలకు మీరు హార్బరునం దాశ్రయ మొసంగితిరేని, మీ ఎలిఫెంటాలో మావారు దుర్గములను నిర్మింపప్రారంభించెదరు సుఁడీ!

కేరీ — రాజా!......

శం — ఆమాటలను మేము వినము. అవలకు పొండు! (ఫెర్డినాండు వంక తిరిగి) పోర్చుగీసుసర్దార్! మీ అంకిద్వీపము నొకపరి పరీక్షించుటకు నావలపై సైన్యముల నంపియున్నాను. మాకు



లోఁబడకున్నచో, మీ 'గోవా'వ్యాపారము సాగుట దుర్లభ మగును. ఇకనైన మెలకువగలిగి ప్రవర్తింపవలెను. పొండు!

(కేరీ, ఫెర్డినాండులు సలాములుచేసి పోవుదురు.)

శం — దుర్గాదాస్! నే నీయాంగ్లేయులఫిరంగిగుండ్లకుఁ జాల భయపడువాఁడను. (సేవకు నుద్దేశించి) కాబ్లసుఖాన్!

సేవ — జీ, హుజూర్!

శం — శరాబ్ ఔర్ ఔరత్........

(సేవకుఁడు సారాయిని తెచ్చి శంభూజీ కందిచ్చును.)

శం — (గ్లాసులో సారాయినిపోసి, దుర్గాదాసున కందిచ్చుచు) స్వీకరింపుడు!

దు — క్షమింపఁగోరెదను!

శం — ఏమీ! శరాబును పానముచేయరా? ఇది నీచపదార్థమా? (ఆగ్లాసు నక్బరున కందిచ్చును.) చక్రవర్తీ! స్వీకరింపుడు!

అక్బ — సందేహ మేమియును లేదు. ఇది ప్రశస్తమైనదివలె నున్నది.

(గ్లాసు నందుకొనును.)

శం — (తానొక గ్లాసుతో సారాయిని గొంతుకలో పోసికొని) అరే! ఔరత్,......

దుర్గా — మహారాజా! నేను పోయి విశ్రమించెదను. సెలవిండు.

శం — మంచిది. (దుర్గాదాసు నిష్క్రమించును.)

[వేశ్యస్త్రీలు ప్రవేశింతురు.]

శం — అనుభవము- భోగము- మొగలుజాతికే చెల్లును. ఔరత్! పాదుషావారు చూచి యానందింతురు. ఒకసారి నాట్యము చేయుఁడు!

అ — (సారాయిని ద్రావుచు) సురాపానము హిందువులకు నిషేధము. హా- హా-..........

శం—హహహ్హాహ్హా! అది వారికి నిషేధము- మనకు పరమౌషధము- రాజకార్యధూర్వహులు దీనిని పానముచేసినఁ గాని శాంతిని పొందఁజాలరు. వాడు వట్టిమూర్ఖుఁడు; కావున నీయానందము ననుభవింపఁజాలకున్నాఁడు. ఊఁ! నాట్యము చేయుడు.

అ—అరే! నాచో! నాచో! నా......అ- ఆచో! (తెలివితప్పి నేలఁగూలును.)

## పంచమ దృశ్యము.

స్థానము — పుణ్యమాలీదుర్గమున దుర్గాదాసుని శయనాగారము.

[పర్యంకముపైఁ గూర్చుండి దుర్గాదాసు జాబును పఠించుచుండును.]

..."ఈప్రకారము, సరళహృదయుఁడును, దేశమాతృశృంఖలా విమోచనార్థబద్ధకంకణుఁడునగు భవత్సహోదరుఁడు మరణించెను. ఇహలోకమునఁ దాను చేయవలసిన కార్యము లేమియు లేకుండుటచే, మనమహారాణి, సహగమనముఁ జేసి, భర్తృసాన్నిధ్యమున కేగెను. కాపురుషుఁడును, స్త్రీసమానుఁడు నగు రాణాజయసింహుఁడు మొగలులతో నొకయవమానకరమగు సంధినొనరించి, ద్వితీయభార్యాసమేతుఁడై జయసముద్రతీరమున వసించుచున్నాఁడు. అతని యధర్మాచరణమువలనను, మహారాణి స్వర్గారోహణ మొనరించుటచేతను, సమర్దాసుని ఘోరమరణమువలనను, రాజస్థాన మరాజకముగనున్నది. మీరు మాదోషములను క్షమించి, మ మ్ముద్ధరింపవలెను!"

[దుర్గాదాసు జాబును చదువుచుండఁగనే, శంతూజీ ప్రవేశించును.]

శం—దుర్గాదాస్! ఈసమాచారమును వింటిరా?

దు—ఏమది?

శం—నాప్రభావము నెఱుఁగఁగోరి, నాతోఁ బోరాడవచ్చిన, యౌరంగజేబును సంపూర్ణముగ నోడించితిని.



దు—నాకు సెలవొసఁగినచో, రసపుత్రసైన్యములనుసైతము వారిసైన్యముతో నేకీభవింపఁజేసి, మొగల్ సామ్రాజ్యమును, సమూలముగ విధ్వంసము కావించెదను.

శం—దుర్గాదాస్! మరాఠమే యొకదినమున రాజస్థానమును, మొగల్ సామ్రాజ్యమును కూడ గెలువఁగలదని నాయభిప్రాయము.

దు—మహారాజ్! మరాఠులును, రాజపుత్రులును హిందువు లగుటచే రసపుత్రులను గెల్చుటలో తమకు గౌరవముండదు.

శం—అది నిక్కువమేయగును. (సేవకు నుద్దేశించి) కౌన్ హైరే!

సేవ—జీ, హుజూర్!

శం—అంతయు సిద్ధముగనున్నదా?

సేవ—చిత్తము.

శం—దుర్గాదాస్! మీరు విశ్రమింపుఁడు. నేను పోయివచ్చెదను. (నిష్క్రమించును.)

దు—(తనలో) మరాఠులు నిక్కముగ బలపరాక్రమము గలవారేయైనను, వారికి స్వాభిమానము మెండు. ఏమి వారియుద్ధనైపుణ్యము! ఏమి వారియశ్వారోహణవిద్యాకౌశల్యము! ఏమి వారి సహిష్ణుత! దీనికిఁదోడు, మాజాతికుండు స్వార్థత్యాగాది సద్గుణము లుండినయెడల, వీ రింద్రునైన గెలువఁజాలుదురు. కాని, లాభములేదు. హిందూజాతి కిఁక నౌన్నత్యము సంభవింపదు. (దూరమునుండి యార్తనాదము విననయ్యెను.)

దు—(వినుట నభినయించి) ఆయార్తనినద మెవరిదైయుండును? ఓహో! మేఘగర్జనమువలె నున్నదే! నాద్వారముచెంతనే వినఁబడుచున్నది. ఏమి హృదయవిదారకమగు ధ్వానము! ఇది నిజముగ స్త్రీకంఠస్వరము. (ముక్తకేశయై, నిజశరీరలతిక

భయముచేఁ గంపించుచుండ, నొకయబల దుర్గాదాసుని చెంతకు వచ్చిచేరును.)

స్త్రీ—రక్షింపుఁడు! రక్షింపుఁడు !!

దు—భయపడకుము. అమ్మా! నీ వెవరవు?

[ఆయుధపాణియై, శంభూజీయును, అతనివెనుక కాబ్లసుఖానుఁడు ప్రవేశింతురు.]

శం—పాపీ! పిశాచీ! దానిని నీ వెందులకు పోనిచ్చితివి?

స్త్రీ—ఆమె గొప్పయింటిబిడ్డ.

శం—అయిన, దానితో నీకేమి సంబంధము కలదు?

(భయముచే నాస్త్రీ మూర్ఛిల్ల, శంభూజీ యామెను చంపఁబోయెను. దుర్గాదాసుఁ డతని నాటంకపఱచును)

దు—మహారాజా! ఒకానొక యబలపై నిట్లత్యాచార మొనరింపఁబోవుట తమకు న్యాయమా?

శం—నోరు మూయుము. దూరముగఁ దొలఁగిపొమ్ము!

దు—నేటిదనుక దుర్గాదాసుసమక్షమున నబలల కత్యాచారము జరిగియుండలేదు. కత్తిని యథాస్థానమం దుంచుఁడు.

శం—ఆవలకుఁ బోయెదవా, లేదా?

దు—ఎన్నటికి నట్లు చేయఁజాలను.

శం—అట్లయిన నీకరవాలమును తీసి, యుద్ధమునకు రమ్ము

దు—సురాపానజనితమదమున మీ రట్లనుచున్నారు; కాని మిమ్ముల నోడించుటకు తరవారు కావలయునా? (అని శంభూజీచేతి నున్న యాయుధము నూడఁబెఱికి, నిజోత్తరీయమున నతని కాలుసేతుల బంధించివైచి, స్త్రీని పరీక్షింప నామె మరణించియుండెను.)



దు—(క్రోధకషాయితలోచనుఁడై) శంభూజీ! తులువా! పిచ్చుకపై బ్రహ్మాస్త్రము నేయ నీచేతు లెట్లాడెను? ఆహా! బాలిక నిష్కారణముగ మరణించినది. నీవా, శివాజీమహారాజుకుమారుఁడవు? ఛీ! నీముఖమునైన పరికింపరాదు.

(నిష్క్రమించును.)

శం—అరే! ఉస్కో పక్డో! పక్డో!

(మఱికొంతసేపటికి రక్తసిక్తశరీరుఁడగు దుర్గాదాసు గదిని జొచ్చును. అతనివెంట కాబ్లసుఖానుఁ డుండును. కాబ్లసుఖాన్ శంభూజీ బంధనముల విప్పును.)

దు—అందఱును సావధానులరై యుండుఁడు. ఈయేబదిమందిని మదీయకరవాలమున ఖండించి, చెండాడి, నాప్రాణముల రక్షించుకొన శక్తుఁడనైనను, నానిమిత్తము స్వజాతీయులగు హిందువులను బాధించుటకు నామనం బొప్పకుండెను. ఆస్త్రీని రక్షించుటకు నేను కావించిన ప్రయత్నము వితథమయ్యెను. ఇదిగో! నన్ను బంధించుఁడు! (చేతులఁ జాచును. భయపడుచు, కాబ్లస్ దుర్గాదాసును బంధించెను.)

శం—దుర్గాదాస్! ఇపుడు నేను నిన్నేమిచేయ జాలను? జీవములతో నిన్నుఁ గాల్చివేయుదునా?

కా—మహారాజా! అతిథిని మీస్వహస్తములఁ జంపు టుచితము కానేరదు. ఇతనికి పరమశత్రువుఁడగు నౌరంగజేబున కితని నప్పగించిన బాగుగనుండును.

దు—సరే! అట్లే చేయవచ్చును; కాని, మరాఠదేశాధీశుఁడుకూడ, యీకాబ్లస్ఖానునిచేతనే మరణమొందుననిరూఢిగఁ జెప్పఁగలను. అతఁ డీదినమునుండి ఖాను నొకకంటఁ జూడకున్న నష్టమువాటిల్లును. ఇది నాతుదియుపదేశము.

## షష్ఠదృశ్యము.

స్థానము:—అహమదునగరమున రాజప్రాసాదాంతఃపురము.

[గుల్నారుసుఖాసీనయై యుండును.]

గుల్—(స్వగతమున) నే నీదాక్షిణాత్యమునకు వచ్చుటకు కారణ మెద్దియో ప్రజ లూహింపఁజాలకున్నారు. ఔరంగజేబు, మరాఠదేశాధినాథునితోఁ గయ్యమాడి, తనపుత్రుని తీసికొని పో నుద్దేశముతో నున్నాఁడనియు, బిజాపురము, గోల్కొండల నాక్రమింప వచ్చియున్నాఁడనియు, మరాఠులను మొగల్సైనికుల పదఘట్టనములచే రూపుమాప నున్నాఁడనియు లోకము భావించుచున్నది. అహ్హాహ్హా! లోకులు కాకులుగాక మఱేమగుదురు? కాని వీరిలో నెవ్వరును, మొగల్సామ్రాజ్యచక్రమును త్రిప్పు వ్యక్తి గుల్నారని గుర్తెఱుంగరైరి. నే నీరథాంగము నీమరాఠదేశమువంకఁ ద్రిప్పకుండినచో, హరిహరులు సైతము పాదుషాను ససైన్యముగ నిచ్చటికిఁ గొనిరా నశక్తులై యుందురు. దుర్గాదాస్! తనకుఁ గలిగినదానితో సంతృప్తి నొందుచున్న పాదుషాను- మరాఠులను గెలువ నభిలాషలేని చక్రవర్తిని- గతఘోరసంగ్రామద్వయజనితావమానానలదగ్ధశరీరుఁడగు నౌరంగజేబును, నీకొఱకే యిచటికిఁ దీసికొని వచ్చితిని. ఆనాఁడు రాణారాజసింహునిసమక్షమున నన్ను శృంఖలాబద్ధను గావించినందులకు కోపగించి, తీవ్రదృష్టుల నీపైఁ బ్రసరింపఁజేసినందులకు నన్ను క్షమించుము! నీసౌందర్యఝంఝామారుతము మన్మనోసాగరము నల్లకల్లోల మొనరించుచున్నది. ఒక్కసారి నీముఖసందర్శన మొనరించినఁగాని మదీయహృదయవేదన ముపశమింపదు.



[ఔరంగజేబు ప్రవేశము.]

ఔరం—గుల్నార్!

గుల్నా—జహాఁపనా! బందగీ!

ఔరం—(చిఱునగవుతో) దుర్గాదాసు పట్టుబడినాడుసుమీ.

గుల్నా—ఇది పరిహాసములకు సమయముకాదు. ఉన్న దున్నట్లు వచింపుఁడు.

ఔరం—ప్రేయసీ! పరిహాసముకాదు. కాబ్లసుఖానుఁ డతనిని పట్టుకొనెను. వానికి నే నేఁబదివేలరూప్యములు బహుమానముగ నిచ్చితిని. మరాఠరాజునుకూడ నిట్లె బంధించినచో దానికి పదిరెట్లు పారితోషిక మిచ్చెదనని పలికితిని.

గుల్నా—ఇపుడు దుర్గాదాసు నేమిచేయఁదలఁచినారు? అతఁ డెక్కడ నున్నాడు?

ఔరం—దిలేర్ఖాను రక్షణమున నున్నాడు. అతనికిఁ దగిన దండనమును విధింప నుద్దేశించియున్నాను.

గుల్నా—వలదు. మీస్వహస్తముల నతని బంధనములను విడఁదీయుడు.

ఔరం—ఏమీ! గుల్నార్! నీవస్వస్థమనస్కవైయున్నావు. ఈసమయమున నీతో సంభాషింపఁదగదు.

(ఆవలకుఁ బోవును.)

గుల్నా—మంచిది. దుర్గాదాస్! నాస్వహస్తముల నిన్ను బాధవిముక్తుని గావించెదను. నిన్ను మొగల్సామ్రాజ్యసింహాసనముపై నధివసింపఁజేతును. నేను నీసామ్రాజ్ఞి నయ్యెదను. అదియ నాలక్ష్యము. తత్కార్యనిర్వహణమునకే నేను జీవించియున్నాను. నాజీవితచరిత్రమున నిదియొక్కటే నాకు శుభదినము.

## దృశ్యాంతరము.

[మొగల్ శిబిరమందలి కారాగారము- శృంఖలాబద్ధుఁడగు దుర్గాదాసటునిటు భ్రమించుచుండును. సమయము నిశీథము.]

దుర్గా—(ఆత్మగతమున) భళిరా! విపరీతకాలము సమీపించినది.

గీ. చండబాహుదండాఖండ । మండలాగ్ర
ఖండితారాతివీరప్ర । కాండ కాండ
మాంసఖండసంప్రీత గో । మాయుచయుఁడు
పురుషసింహుండు కపటవా । గురకుఁ జిక్కె-
నధమవిధికి నసాధ్యకా । ర్యంబు గలదె.

మరాఠదేశపాలకా! కుటిలనీతిని రాజ్యపరిపాలన మొనరించు వైదేశిక రాజన్య మృగములఁ జెండాడిన యీదుర్గాదాసనెడు వీరసింహుండు, నేఁడు, స్వజాతీయుఁడవగు నీచే బోనులో బంధింపఁబడెఁగదా! మీకు, మొగల్ రసపుత్రజాతులపై విజయమొందు సమయము వచ్చునని స్వప్నమందైన భావింపకుము. ఒకప్పు డీరసపుత్ర- మరాఠ- మొగల్ జాతులను మూడింటిని వేఱొకజాతి విధ్వంసము కావించుట కవకాశము కలదు. అప్పుడుగాని విశ్వాసఘాతుకత్వమునకు వినాశకాలము చేకురదు. (తొంగిచూచి) ఎవరాకవాటమును తెఱచుచున్నారు? ఎవరది?

[స్వాలంకృతయై గుల్నారు ప్రవేశించును.]

దు—ఓహో! ఓహో! ఎవరీసౌందర్యరాశి! తమరెవరమ్మా?

గు—(నవ్వుచు) బేగము గుల్నారును.

దు—బేగం గుల్నారా?

గు—ఔను. ఒకప్పుడు మీరు నన్నుఁ గారాగారమందు బంధించియుంటిరి. ఇపుడు మీరు నాఖైదీలుగా నున్నారు.

దు—తమరు నన్ను శిక్షించుటకు వచ్చినారా?

గు—మిమ్ముల విముక్తులఁ జేయుటకు వచ్చితిని.

దు—అట్లైన నాకుఁ బ్రత్యుపకార మొనరింప నేతెంచితిరి కాఁబోలు.

గు—కాదు.

దు—చక్రవర్తి యాదేశముపై వచ్చితిరా?

గు—నేటివఱ కతఁడే నాయాజ్ఞానుసారియై ప్రవర్తించుచుండ, నీ గుల్నారతనికి లోఁబడియున్నదనుట మీ అమాయికత్వము.

దు అయిన తమ రిచ్చోటికీభయంకర గాఢ నిశీథ సమయమున నేతెంచుటకు గారణ ముండవలెఁగదా.

గు—నాప్రాణేశ్వరులగు మీబంధనముల విమోచనము కావింప వచ్చినాను.

దు—(ఆశ్చర్యమున) ఇది యేమిపరిహాసము?

గు—మొగల్ సామ్రాజ్ఞియగు గుల్నారొకసాధారణసేనానాయకుని "ప్రాణేశ్వరుఁడా" యని సంబోధించుటఁ జూడ, మీకాశ్చర్యము జనింపవచ్చును; కాని, నేఁ డీరాజ్ఞి సాధారణస్త్రీవలెఁ బ్రవర్తించుట కొక కారణ మున్నది. ఈమె మిమ్ముల "ప్రాణేశ్వరా!" యనిపిలచుటలో నత్యంతానందమును బొందుచున్నది.

దు—కాని, సామ్రాజ్ఞి! ... ... ...

గు—(వినినట్లు నటించి) దుర్గాదాస్! నేఁటిదనుక గుల్నారు మానవమాత్రునివలలోఁ దగుల్కొనియుండలేదు. ఈసామ్రాజ్య వ్యవహారములందు పాదుషాహస్తాక్షరములు తప్ప మరేమియును మీకుఁ గానరావు; కాని, పరిపాలనాభారమంతయు గుల్నారుపైనున్నది. సమస్తచరాచరజంతుజాలము గుల్నారు నామమును స్మరింపని దినము లేదు. గుల్నారు హర్షచిత్తయై, యున్నపుడు లెక్కకులేని నూతనరాజ్యములు స్థాపింపఁబడు

చున్నవి. ఆమె భ్రూభంగ మొనరించినచో రాజాధిరాజులు నశించుచున్నారు. ఏతాదృశప్రభావముంగలిగిన యీ బేగం గుల్నారు నేడు మిమ్ములను బ్రేమించి, మీ ప్రేమపాశముచే బంధితురాలై, మీ ప్రేమయనెడు శీతలవర్షబిందువుల స్నానమాడి, మీవక్షస్థలమున నిద్రాసౌఖ్యమును పొందఁగోరి వచ్చియున్నది.

దు — (ద్విగుణీకృతాశ్చర్యమున) గుల్నార్! మీమాటల కర్థము నా కవగాహ మగుటలేదు.

గుల్నా — మీరు చక్రవర్తికి భయపడవలసిన పనిలేదు. అతఁడు నా దాసుఁడు. రండు! సింహాసనమున మిమ్ములఁ గూర్చుండఁ బెట్టెదను. రండు.

దు — సామ్రాజ్ఞీ! భుజపరాక్రమమున గెలువని సింహాసనము నా కవసరములేదు.

గు — మీకు సామ్రాజ్యాభిలాష లేదా?

దు — లేదు. తమ రీస్థలమునుండి మరలిపొండు!

గు — ఏమీ? మీరు నన్నుసైతము పొమ్మనుచున్నారా? నన్నుఁ బ్రేమించుటకు మీ కిష్టములేదా?

దు — పరదారాపరిగ్రహణము మారాజపుత్రులకుఁ దగనిపని. ఆ యధర్మమునకు నే నిదివఱకు నొడిగట్టుకొనలేదు.

గు — ఔరంగజేబువంటి చక్రవర్తులు, ఏయబలవాగనుశాసనమున నధీనులై యున్నారో, యట్టినాప్రేమను నిరాకరించుచున్నారా?

దు — సామ్రాజ్ఞీ! లోకమున నౌరంగజేబులును, దుర్గాదాసులును గలరు. కేవల మౌరంగజేబులతో ప్రపంచము నిండియుండ లేదు.



గు — మీ కాఠిన్యమువలన మీ కెట్టియాపద సంభవించునో, తెలిసి కొంటిరా?

దు — ఆహా! తెలిసికొంటిని. మృత్యువునకు నేను భయపడను. మృత్యువుకంటె భయదాయకమగు నాపద లేనేలేదు. ఈతకు మించిన లోతును, చావునకుమించిన హానియు లేదుగదా.

గు — దుర్గాదాస్! మీరు నాతోఁ బరిహాసము లాడుచున్నారు.

దు — అట్లుకాదు. నేటివఱకు నే నీవిధములగు పరుషవాక్యముల-గంభీరశబ్దములఁ బలికియుండలేదు.

గు — (రోషకషాయితలోచనయై) నన్నుఁ బ్రేమింతువా, లేక మృత్యుదేవతాసాన్నిధ్యమును గోరుదువా?

దు — మృత్యువునకు సిద్ధపడియే వచ్చితిని.

గు — (కుమారు నుద్దేశించి] కామబఖ్సా!

[కామబఖ్సా ప్రవేశము]

కా — మా! క్యాహుకుం?

గు — (దుర్గాదాసును వానికి చూపుచు) వీనిని వెంటనే వధింపవలెను.

[కామబఖ్సా తరవారు నొఱనుండితీసి దుర్గాదాసును నఱకఁబోవును. దిలేర్ ఖానుఁడు శరవేగమున నచటికి వచ్చును.]

దిలేర్ — (కామబఖ్సాకు పిస్తోలునుకనపరచి) సావధానుఁడవై మెలఁగుము. లేకున్న నిన్నీపిస్తోలున, నరకమున కంపెదను.

గుల్నా.—దిలేర్! ఇందు నీవెందులకు జోక్యము కలిగించుకొనుచున్నావు? నీకుఁగల యధికార మేమి?

దిలేర్—పాపాత్మురాలా! నోరుమూయుము! నే నీశ్వరునకుఁదప్పదదితరులకు భయపడను. (దుర్గాదాసు నవలోకించి) మహాత్మా! లోకమున కాదర్శప్రాయుఁడవగు నీకు నాప్రాణము లడ్డు. (అతని బంధనములఁ విప్పి) ఆవల నొకయశ్వము నుంచి నాడను. దాని నధిరోహించి యథేచ్ఛం జనుఁడు.

(దుర్గాదాసు నిష్క్రమించును. అతని వెంట దిలేర్ ఖానుఁడుఁబోవును.)

శ్రీ

# దుర్గాదాస్

## పంచమాంకము.

### ప్రథమదృశ్యము.

[సింహాసనారూఢుఁడై అక్బరు వెలయాండ్రనృత్యమును చూచుచుండును.]

అ—నాచో, ఖూబ్ నాచో! ఔర్ నాచో! వహావ్వా! బహుత్ అచ్ఛాహై. (ఆడుడు బాగుగ నృత్యముచేయుఁడు. చాల బాగుగానున్నది.)

[కాబ్లుసుఖాన్ ప్రవేశము]

అ—కాబ్లస్! శంభూజీ కహా! (శంభూజీ యెచ్చట?)

కా—(నేల పడిపోవుటను నటించి) మర్ గయా, షాజాదా! (యువరాజా! చనిపోయెను.)

అ—ఏమీ! నీవు సత్యమును పలుకుచున్నావా?

కా—ఔను నిక్కమునే వచించుచున్నాను. శంభూజీమహారాజ్, కారాగారమం దున్నాఁడు. ఇపుడు మీ రేమి చేయఁదలఁచుకొన్నారు? పాదుషావారిచేఁ జిక్కి కారాగృహమందున్న మీ మిత్రునిఁజూడ నభిలాష యున్నయెడల, నాతో మీ రందఱు కడకు రండు.

అ—(వికటముగ నవ్వుచు) అతనిసమీపించుటకంటె వ్యాఘ్రమున కెఱయగుట మేలు.

కా—యువరాజా! నాతో నేగుదెంచిన మీ కెట్టిభయమును చేకూరదు. నాప్రాణముల నొసంగియైనను మిమ్ములఁ గాపాడెదను, రండు!

[దుర్గాదాసు ప్రవేశించును.]

దు—(కాబ్లసు నుద్దేశించి) విశ్వాసఘాతుక! నీమాయావాగుర నక్బరునుసైతము బడద్రోయ నెంచితివా?

కా—(కంపితశరీరుఁడగుచు దుర్గాదాసు నవలోకించుచుండును.)

దు—కాబ్లస్! నీమనోరథ మీడేరినదికాదని, యాలోచించుచున్నావా? నాముఖమువంక నంతతీవ్రముగఁ బరికించుచున్నావేల? నీకేమియుఁగాని నేను మరణించినను నష్టములేదు; కాని, నీ ప్రభువును—శంతూజీనిసైతము ఔరంగజేబున కప్పగించుటకు నీకు చేతు లెట్లువచ్చెను?

కా—(శరీరము కంపింప) నేను—కా...ఆ...

దు—(పండ్లఁ గొఱుకుచు) నీచా! ఆపనిచేసినది నీవుకాదా? నీ ప్రేరేపణమున శంతూజీ యొక బ్రాహ్మణస్త్రీని గవయుటకు, దుర్గమునుండి నిర్గమించుట సత్యమా, యసత్యమా?

కా—నిజమే.

దు—అతఁడట్లు దుర్గప్రధానద్వారముదాఁటి బయటకువచ్చుటయతడవుగ, సైన్యయుతుఁడై యచ్చోట వేచియుండిన, అజీమఖానని పట్టి బంధించుట నిజమా, కాదనెదవా? అనృతమాడినచో నీ కిప్పుడే తగినశిక్షను విధింతును.

కా—(పాఱిపోవుటకుఁ బ్రయత్నించును.)

దు—భాగోమత్! (పాఱిపోవద్దు!) జాగ్రత!



[అనిపలుకుచు దుర్గాదాసు వానిమెడను బట్టును]

దు—అల్లాను స్మరింపుము. మూర్ఖా!

కా—మాఫ్‌కరో! మాఫ్‌కరో! ఖుదాబంద్! (క్షమింపుము. క్షమింపుము. అని దుర్గాదాసు చరణముల వ్రాలును.)

దు—పొమ్ము! నిన్నువధించి నావంశమునకుఁ గళంక మాపాదింపను. నీవు శంతూజీనాశనమునకు మూలకారణమవు. నీకు నరకముననైన దావుండదు. ఆవలకుఁబొమ్ము! (కాలితోఁదన్ని కాబ్లసు నావలకుఁ బడవేయును.)

దు—(అక్బరునుద్దేశించి) షాజాదా! సురపానమే నీసర్వనాశమునకుఁ గారణభూతమగునని, నేనొకనాడు శంతూజీతోఁ బలికియుంటిని. మీరద్దాని నిపుడు ప్రత్యక్షముగఁ గాంచియున్నారు. ఇఁకనైన మేల్కాంచి మీరా దురభ్యాసమును వీడకున్నచో, మీకును శంతూజీగతియె పట్టును.

అక్బ—రాథోరుసేనాధ్యక్షా! ఇంతకాలమైనపిదప, మఱలాభమేమి కలదు?

దు—అట్లనఁబోకుఁడు. ధైర్యము నవలంబించి, చిత్తము నావంక నరువిడకుండ బాధింపఁ బ్రయత్నింతురేని మీకు ముక్తి కలదు. తప్పక విజయముఁ బొందఁగలరు.

అక్బ—(కొంతసేపూరకుండి) దుర్గాదాస్! మీరు సత్యమువక్కాణించితిరి. ఈదురభ్యాసజనితాంతరంగికదురవస్థ నామస్తకమును పాడుచేసినది. నాజీవితముపై నాకే యసహ్యము పుట్టుచున్నది. ఇఁక నే నీప్రపంచముతో సాంగత్యము వీడెదను. వీడెదను. వీడెదను.

దు—అట్లుకాదు. మీరు నాతో మార్వాడమునకు రండు. మీ కేమియును భయములేదు.

అక్బ—మార్వాడముల రాజు. మక్కాకుఁ బోవుచున్నాను. నానిమిత్తము మీరు పోరాటపాట్లను బడియున్నారు. మిమ్ములఁ గష్టపరంపరలలో ముంచినందులకు నన్ను క్షమింపుము. నన్ను నిర్బంధించవలదు.

దు—ఇంక క్షమించుట కేమున్నది? అది నా కర్తవ్యము.

అక్బ—దుర్గాదాస్! నేను మక్కాకుఁబోయి, అట్టికర్తవ్యము నే నేర్చుకొనెదను. అనేకకిల్బిషముల నాచరించితిని. భోగవిలాసములఁ గాలక్షేప మొనరించితిని. తండ్రికి శత్రుప్రుఁడనైతిని. నాభార్య మరణమునకుఁ గారణుఁడనైతిని. నన్ను రక్షింపవచ్చిన మిమ్ముల నాపత్పరంపరల ముంచితిని— ఈపాపపరిహారార్ధము నేను భగవంతుని వేడుకొనవలయును. మీరు నాకొఱకొక్కకార్యమును చేయవలసియున్నది. మీదేశమునకేగి నా "రజియా" నుమాత్రము భద్రముగఁ గాపాడుము. నేను పోవుచున్నాను.

(అవనిక జారును)

## ద్వితీయదృశ్యము.

[కోయలూగుదుర్గశిఖరమున, శీతలచంద్రచంద్రికలఁ జూచుచు,
రజియా-మార్వాడయువరాజగు నజితసింహుఁడు,
కూర్చుండి యుందురు.]

ర—అజిత్! ఆచంద్రుఁ డెంతమనోహరముగనున్నాడో చూడుము! ఆనల్లని మేఘములను భేదించుకొనుచు నుదయించుచున్నాఁడు. వినీలకుంతలసన్నిభకాలమేఘములపై జిగజిగ మెఱయు నగవలెఁ గన్పట్టుచున్నాఁడు. అదిగో, చూడుము! ఇపుడాబింబము జలధరాచ్ఛాదితమై, కేవల మొక రేఖవలె కనఁబడుచున్నది. ఆహా! అకస మెంతరమ్యముగ నున్నది!



అజి—నేనాదృశ్యము నాలోకించుచుండలేదు. నీసుందరవదనారవిందమును తిలకించుచున్నాను.

ర—అజిత్! నీమాటల నాలకించుచున్న నాయాశ్చర్యమునకు మేఱయే లేదు. ఈ ధరాతలమున దర్శనీయములగు వస్తువు లనేకములుండ, నాముఖమువంకనే గమనింపుచుంటివా?

అజిత్—వానికంటె నీమొగమే మిక్కిలియందముగ నున్నది.

ర—అజిత్! నీ వత్యంతబాలుఁడవు. కాకున్నచో నాయంబుదావృత సుందరచంద్రబింబముకంటె నాముఖమే యందముగ నున్నదనుటకు నీవు లజ్జించియుందువు. సముద్రమున జనించి, తద్వేలావిలీనములగుచున్న కెరటములకంటె నావదనము దివ్యముగనున్నదని వచించుటకు సిగ్గుపడియుందువు. రాజకుమారా! సుందరవస్తుమయమగు నీప్రకృతిదేవిని నీవు బాగుగఁ దిలకించినచో, నీరీతిఁ బలికియుండవు.

అజి—రజియా! నేనిఁక బాలకుఁడను కాను. ఈభూతలమునఁ గల సుందరవస్తుజాలములలో స్త్రీ ముఖ్యమైనది- నారీజనములకెల్ల నీవు సౌందర్యవతివి.

ర—ఆమాటను నేను విశ్వసింపను.

అజి—అట్లైన నామీఁద నీకు ప్రేమ లేదన్నమాట.

ర—ఏమీ! ప్రేమించుట లేదనియా, పలుకుచున్నావు? నీవులేని నాజీవితము శూన్యము. నీనామోచ్చారణమున నా కానందము. నీపై నాకత్యంతమోహము.

అజి—నిక్కముగ నన్నుఁ బ్రేమించుచున్నావా?

ర — నే నన్నుతము లాడ నేరను.

అజిత్ — ప్రాణేశ్వరీ ! (అని సంబోధించి, రజియాహస్తమును పట్టు కొనును.)

ర — ప్రాణనాయకా !

(అని యతని నాలింగనముచేసికొను సమయమున ముకుంద దాసునునాతఁడు ప్రవేశించును. తత్‌క్షణము అజితుఁడు కౌఁగిలి వీడును.)

అ — ముకుందా ! ఏలవచ్చితివి ? వింత లేమైనఁ గలవా?

ము — చిత్తము. దుర్గాదాసు దాక్షిణాత్యమునుండి వచ్చియున్నాడు.

అ — (ఆశ్చర్యముతో) ఏమీ ! దుర్గాదాసు వచ్చియున్నాడా ? అతనిని తత్క్షణము లోనికిఁ దోడ్తెమ్ము !

ము — చిత్తము. (నిర్గమించును.)

అ — రజియా! నీవు గృహాభ్యంతరమునకుఁ బొమ్ము!

(రజియా నిష్క్రమించును)

అ — నాప్రాణదాతయగు- నాతండ్రికి విశ్వాసపాత్రుఁడగు — దేశమాతకు ముద్దులపట్టియగు, దుర్గాదాసు వచ్చియున్నాఁడన్న వార్త కర్ణపుటములంబడఁగానే, నా కొకవిధమగు నసూయ జనించుచున్నది. (కొంతవఱకు నాలోచించి) ఛీ! నాదురూహలను పారద్రోలి యతనియెడల నాకును- నాపూర్వుల కుండు గౌరవము నిపుడు చూపించెద.

[ముకుందదాసు, శివసింహుఁడు, వెంటరా దుర్గాదాసు ప్రవేశించును.]

దు — మహారాజ్ ! భృత్యుఁడు తిరిగి స్వరాజ్యమును చేరుకొనినాఁడు. చాలదినముల కీమందభాగ్యునకు, ఋమ్ముల "మహారాజని



పిలచుట కవకాశము చిక్కినందులకు భగవంతుని కొనియాడుచున్నాను. ఇవిగో నావందనసహస్రములు.

(సాష్టాంగపడును.)

అ — సేనాపతీ! క్షేమమా?

దు — చిత్తము కుశలముగనే యున్నాను. యుద్ధవార్త లేమైనఁ గలవా?

ముకుం — సేనానాయకా! ఔరంగజేబు 'మహమ్మదుషా' యనువానిని, యశ్వంతసింహుని పుత్రుఁడని, లోకుల మోసపుచ్చి, వానిని జోధపూర్ సింహాసనమునఁ గూర్చుండఁబెట్టెను. స్వయముగ మహారాజావారు, చక్రవర్తితో యుద్ధ మొనరించి, వాని నోడించినారు. ఆ మహమ్మదుషా కొన్నాళ్ళకు చనిపోయినాడు.

అ — దుర్గాదాస్! జయసింహుని తనయుఁడగు నమరసింహుఁడుతండ్రితో శత్రుత్వమూని, యుద్ధము చేయనున్నాఁడు. జయసింహుఁడు మాసాహాయ్యము నపేక్షించియున్నవాఁడు; కావున మీరందఱు యుద్ధసన్నద్ధులై యుండుడు!

దు — చిత్తము. కాసి మెక్కడ?

అ — లోననున్నాడు. అతని శరీరావస్థ మునుపటివలె లేదు.

దు — అతని నొకసారి చూడ సెలవిండు! (వందనమిడును.)

(ముకుందశివులతో దుర్గాదాసు లోని కేగును.)

## తృతీయదృశ్యము.

స్థానము:— దాక్షిణాత్యమున మొగల్ శిబిరము.

[ఔరంగజేబును దిలేర్ ఖానుఁడును సంభాషించుకొనుచుందురు.]

ఔ — దిలేర్ ! అక్బరు సర్వసంగపరిత్యాగముఁ జేసి మక్కాకుఁ బోయినాడా! ఆహా! వానిమేలుకొఱకే నే నిన్నికష్టములఁ బడ

వలసివచ్చినది; కాని ఫలములేదు. నేనుకూడ మక్కాకుఁ బోయి భగవచ్చింతనమందు కాలయాపనము చేసెదను. కాని, దిలేర్! నీ వింకొక ముఖ్యకార్యమును చేయవలసియున్నది రజియానుద్ధరించుభారము నీపైనుంచితిని. ఆనాఁడు నీవు దుర్గాదాసును విడువకున్నచో నాకార్య మాక్షణముననే సాధించి యుందును.

ది—ఎట్లు సాధించియుందురు? ఆవీరుని భయపెట్టియా? అది యెన్నటికిని సంభవము కానేరదు. ఆయుధపాణియై, తనప్రాణములఁ గొనిపోవుటకై వచ్చిన యమదూతవలె, సమ్ముఖమున నిల్చియున్న కామబఖ్షా కతఁ డిసుమంతయైన జంకక, నొకయచలమువలె నుండెను. అట్టివానిని భయపెట్టి మీరు రజియానుద్ధరించుటయా? కేవల మది ప్రగల్భము.

ఔరం—ఔనౌ, సేనానాయకా! దుర్గాదాసుఁ డుదారపురుషుఁడు. కాని—

దిలేర్—కర్తవ్యమునకొఱకు రాజపుత్రులు జీవములనైతము బలిదాన మొసంగెదరు. దుర్గాదాసుఁడు వారందఱకు నతీతుఁడు.

ఔరం—సత్యము. అయిన నిఁక రజియాను రసపుత్రుల హస్తములనుండి విడిపించుట దుర్లభమగునందువా?

దిలేర్—శ్రీవారు నాకు సర్వాధికారము నిచ్చినచో నామెను విడిపించుటకుఁ బ్రయత్నింతును.

ఔరం—ఉపాయము?

దిలేర్—క్రమక్రమముగఁ దమకుఁ దెలియఁగలదు.

[కాబ్లసుఖానుఁడు ప్రవేశించును.]

ఔరం—కాబ్లస్‌ఖాన్! ఏమి సమాచారము?



కాబ్ల—ఖుదాబంద్! శంతూజీని గార్దభముపై నెక్కించి, పట్టణమంతటను త్రిప్పి తుదకు వధ్యస్థానమునకుఁ దీసికొనిపోతిని. అతనినిచంపుట కేరును సాహసింపమిఁ, దిరుగ నిచ్చోటికిఁ గొనివచ్చితిని.

ఔ—అతని నిచ్చటికిఁ దీసికొనిరమ్ము!

కా—నాబహుమానముమాట మఱచినారా?

ఔ—అతనిని తీసికొనివచ్చినపిదప నీకు బహుమతి నిత్తును.

(సలాంచేసి కాబ్లస్ నిష్క్రమించును.)

ఔ—దిలేర్! నాజీవితముపై నాకే యసహ్యము జనించుచున్నది. అక్బరును విద్రోహిఁగఁ జేసికొంటిని. ముఅజిముతో శత్రుత్వముఁ బూనితిని..............

[ఆజింకాబ్లసులు శంతూజీని తీసికొనివత్తురు.]

ఔ—(శంతూజీని చూచి) శంతూజీమహారాజ్! మామసీదుల నపవిత్రములఁ గావించి, మా మౌల్వీలను బాధించి, మాపురాణమును నిందించుటకుఁగాను, నీకుఁ దగినశిక్షను విధింపవలదా?

కా—జహాఁపనా! ఖురానును, నిందించినందులకు నే నీతని నాలుకను గోసితిని.

ఔ—శంతూజీ! ఇపుడైనను మాఖురానును స్వీకరించినచో, నీకుఁ బ్రాణదాన మొసంగెదను.

[శంతూజీ మారుపలుకక పండ్లుకొఱుకును.]

ఔ—వీఁడు మహాగర్వివలె నున్నాఁడు. తత్క్షణము వీనిని వధించి, వాని శిరస్సును నా కొసంగుడు.

(శంతూజీని వెంటనిడికొని, కాబ్లసును, ఆజిమును నిష్క్రమింతురు.)

ఔ—దిలేర్! ఇస్లామమతమును ప్రచారముచేయుటకే నేను నా తండ్రిని కారాగారబద్ధుని కావించితిని. అన్నదమ్ముల ప్రాణములఁ దీసితిని.

దిలేర్—జహాఁపనా! ఇప్పుడైనను, మీదుష్కృతముల మాని, మందిరములందును, మసీదులందును 'అల్లా' 'పరమేశ్వర' నామముల నినాదములు దిగంతములఁ బ్రతిధ్వనింపనీయకున్నచో, ముసల్మానులు హిందువులపై ద్వేషమును వీడకున్నచో, నార్యావర్త మరాజకమై పోవును. మీరు పేరు ప్రఖ్యాతియు లేక నశింతురు.

ఔ—(చిఱునవ్వు నవ్వి) దిలేర్! హిందూముసల్మానుజాతుల కేకతాభావము కుదురదు. నీవు కలఁగాంచుచున్నావు.

దిలేర్—ఆకలకుఁ గూడ మీరు విఘ్నము కూర్చినారు.

[కాబ్లస్‌ఖాన్ ప్రవేశించి, చక్రవర్తికి శంభూజీ శిరస్సును సమర్పింపఁబోవును.]

ఔ—అరే! హఠావో! హఠావో! (ఆతలను నాముందఱనుండి తొలగించుము.)

దిలేర్—చక్రవర్తీ! మీసహోదరుల రక్తధారలచే సంప్రాప్తించిన యీరాజ్యము, నేఁడీశంభూజీవీరుని రుధిరప్రవాహముతో నంతమొందినది.

(అని యచటినుండి పోవును.)

కాబ్లస్—ప్రభూ! నాబహుమానము నొసంగి నన్ను పంపివేయుఁడు.

ఔ—నిమక్‌హరాం! నీకు బహుమానము కావలయునా? చలో! బాహర్‌జావో, కుత్తా! (కాలితోఁదన్నును.)



## చతుర్థదృశ్యము.

స్థానము:—జోధపురరాజప్రాసాదము.

[అజితసింహ శ్యామసింహులు సంభాషించుచుందురు.]

శ్యామ—శ్రీవా రుదయపురరాణావారి సహోదరపుత్రికను వివాహమాడినారని విని చాల సంతోషించుచున్నాను. నేఁడు కదా, మీవారు మార్వాడరాజ్యముల నైకమత్యము కలిగినది!

అజిత్—ఈసంబంధము దుర్గాదాసు చేసినదే.

[దుర్గాదాసు ప్రవేశించును.]

శ్యామ—దుర్గాదాస్! రజియా యెచ్చటనున్నది?

దుర్గా—ఆమెను సుజాయత్‌ఖానుతో ఢిల్లీకి పంపివేసినాను.

శ్యామ—ఏమీ! నే నామెను భద్రముగఁ గొనిపోయియుందునే. నన్నేల విశ్వసింపకున్నారు?

దుర్గా—నీవు గబ్బిలమువంటివాఁడవు. విశ్వసనీయుఁడవు కావు; కనుకనే యాతనితోఁ బంపితిని.

అజి—ఏమీ! సేనాపతీ! రాజనగు నాయనుజ్ఞ లేనిదే నాప్రాణప్రియను-రజియాను-మొగలుల కప్పగించుటకు నీ కెట్టి యధికారము కలదు?

దుర్గా—అక్బరు సపరివారముగ నన్నాశ్రయించెను; కావున నాకట్టి యధికారము కలిగినది. రజియాను మీరు ప్రేమించుచున్నారని నాకు బాగుగఁ దెలియును; కాని మీ రామెను మోహించుటలో గొప్ప ముప్పు కలదు. నేను బాగుగ నాలోచించియే రజియాను ఢిల్లీకిఁ బనిచితిని.

అజి—(కోపముతో) దుర్గాదాస్! ఈక్షణమునుండి నీవు మార్వాడ

మును విడిచిపోవలయును. నాజీవితమున ని న్నీరాజ్యమునఁ
గాంచినంతనె.......... .........

దు—చిత్తము. (అని సలాంచేసి నిష్క్రమించును.)

అజి—శ్యామసింహా! ఈకుట్రయందు నీవుకూడ నున్నావనుకొనెదను. నీవుకూడ నిచటినుండి తొలఁగిపొమ్ము!

(శ్యామసింహుఁడు నిర్గమించును.)

అజి—(తనలో) రజియా! మనప్రేమబంధము దైవవశమున నిట్లు తెగిపోయినందులకు దురపిల్లుచున్నాను. దైవము నిన్నును నీవలన దుర్గాదాసును సైత మెత్తుకొనిపోయెను. ఇఁక నే నామరణాంతము మీకై వగచుచు, దుఃఖాబ్ధిని మునుఁగుచుండవలసినదే.

[కాసిం ప్రవేశించును.]

కాసిం—అజిత్! దుర్గాదాసుగారేమిచేయుచున్నారు?

అజిత్—రాజ్యపరిత్యాగముఁ జేసి పోయినాడు.

కాసిం—అతఁడు నిజేచ్ఛను రాజ్యమును పరిత్యజించెనా?

అ—లేదు. కొండొకకార్యమున నతఁడు స్వతంత్రించి పనిచేసినందులకు నే నాతని వెడలఁగొట్టించితిని.

కా—అతఁడు స్వతంత్రించెనా? ఎన్నటికి నట్లు చేయఁడు. దుర్గాదాసు స్వతంత్రించినచో నిజపదాఘాతమున నీవంటిరాజుల ననేకులను నేలఁగూల్చి, రాజాధిరాజు కాఁగలిగియుండును. నీవు విశ్వాసఘాతుకుఁడవు. మూర్ఖుఁడవు. నీముఖమును జూచినఁ బాపము వాటిల్లును.

(అని త్వరితగతిని వెడలిపోవును).



## పంచమదృశ్యము.

స్థానము—ఔరంగబాదునందు రాజప్రాసాదాంతఃపురము.

[గుల్నార్ సుఖాసీనయై, ఎదుటనున్న యద్దమునందలి నిజప్రతిబింబము నవలోకించుచుండును.]

గుల్—(అద్దమందలి తనరూపమునుచూచి) ఆహా! నారూప మెంతలో మాఱిపోయినది? నేను మునుపటి గుల్నారును కాను. ఎత్తుగానుండిన నాచెక్కిళ్ళు చిక్కిపోయినవి. ముఖమున వివర్ణమావరించినది. నాకోమలబాహులతలు వాడిపోయిన చంపకమాలికలను పోలియున్నవి. ఆహా! నాతొల్లింటిరూప మెంతలో మాఱిపోయినది! దీనితోపాటు నాయధికారము కూడ నశించినది. నాకుమారుని బిజాపురమునకుఁ బంపవలదని నివారించినను, వినక, ఔరంగజేబు తనకోర్కెఁ జెల్లించుకొనెను. ఒకసారి మాటలాడిపొమ్మని వర్తమానమంప, "సమయములే"దని ప్రత్యుత్తర మిడెను. ఇప్పుడు నాయధికార మెంతసన్నగిల్లినది! ఏనాఁడు దుర్గాదాసు నాప్రేమను నిరాకరించెనో, ఆనాఁటినుండియు నా హీనదశ సంప్రాప్తమైనది.

[రజియా ప్రవేశించును]

గు—రజియా! నేను మునుపటివలె నున్నానా? లేక నారూపమం దెట్టిమార్పయినఁ గలదా?

ర—అమ్మీజాన్! నీవు మునుపటివలె నున్నావో, యిప్పటివలె నున్నావో నేను చెప్పఁజాలకపోయినను, నావలెనే విరహవేదనావస్థయం దున్నావనిమాత్రము చెప్పఁగలను.

గు—ఏమీ! నీవుసైత మొకకఠినహృదయునిఁ బ్రేమించి, నిరాకరింపఁబడితివా?

[దాసి ప్రవేశము]

దాసి—షాజాదీ! భీతర్ చలో! (యువరాజ్ఞీ! లోపలకుఁ బొమ్ము!)

గుల్నా—చుప్! దుష్టురాలా! దాని నెందుకుపిలచుచున్నావు? అది లోపలకుఁ బోదు.

దాసి—ఇది పాదుషావారియాజ్ఞ. (అనిపలుకుచు దాసి రజియాను లోపలకు లాగికొనిపోవును).

గుల్నా—ఇఁక నేను జీవించియుండు టుచితముకాదు. భర్తచేఁ దిరస్కృతనై—బంధువులచే నిరాదృతనై, భృత్యులచే ధిక్కృతనై—ప్రేమికునిచే నిరాకృతనై, జీవనములలో నుండఁజాలను. ఈబ్రతుకు నాకు మిక్కిలి దుర్భరముగ నున్నది. ఆత్మహత్యఁ గావించుకొని పరలోకమున కేగి సుఖముండెదను.

[గుల్నారుతనయుఁడగు కామబఖ్షా ప్రవేశము]

కామ—అమ్మా! నాన్నగారి యాదేశమున నేను బిజాపురమునకుఁ బోవుచున్నాను. సెల వొసంగుము.

గుల్నా—ఔను. ఈసమాచారమును నే నిదివఱకే తెలిసికొంటిని. భగవంతుఁడు నీకు మేలుచేయుఁగాక! ఇదియ నీకు నా యాశీర్వాదము. తిరిగి నీవు నన్నుఁజూడఁజాలవు. (కన్నీరుఁగార్చును)

కామ—తల్లీ! నీమాటలు నాకు బోధపడలేదు.

గుల్నా—ఏమియునులేదు, నాయనా! అన్యమనస్కనై యుంటచే నీతో నేమేమో పలికియుంటిని. పొమ్ము! నీవు నాసమ్ముఖమున నుండుకొలఁది నాదుఃఖము ద్విగుణీకృత మగును.

(కామబఖ్షా నిర్గమించును)

[పిదప గుల్నారుసైత మొకగదినిజొచ్చి, శుభ్రవస్త్రాలంకృతయై మరలివచ్చును.]

ఔరంగజేబు—[ప్రవేశించి] సామ్రాజ్ఞీ!



గుల్నా—ఓహో! పాదుషావారికి గుల్నారుపై ననుగ్రహ ముదయించెనాయేమి?

ఔరం—సామ్రాజ్ఞీ! నీవు నాయెడలనొనర్చిన దోషములకు నిన్ను క్షమించి, పుణ్యక్షేత్ర మగు మక్కాకుఁ బోవుచున్నాను. నాసర్వనాశనమునకు కారణభూతవగు నిన్నిఁకఁ బ్రేమింపఁజాలను. ఇఁకనైన నీవు పశ్చాత్తాపము నొంది, భగవంతుని చింతించి, పుణ్యలోకమును చేరుకొనుము.

గుల్నా—నన్ను 'సామ్రాజ్ఞీ' యని సంబోధింపకుఁడు. నా నేరములకు తగినశిక్ష ననుభవించుదానను నేనుకాని మీరు కానేరరు. నేను పశ్చాత్తాప మొందను. స్త్రీనై జన్మించినందులకు పురుషుని నాయిచ్చకువచ్చినట్లు స్వాధీనపఱచుకొంటిని. సామ్రాజ్ఞినైనందులకు మొగల్ సామ్రాజ్యము [illegible]ముంటిని. అంతకంటె నాకు కావలసిన దేమికలదు? కాని, ఆదీర్ఘకాయుఁడు—నేను ప్రేమించిన దుర్గాదాసుమాత్రము నన్ను జయింపఁగలిగెను. ఆ పరాజయమును సహింపఁజాలక, నాత్మహత్యఁ గావించుకొనుటకై విషపానముఁ జేసితిని. ఇఁక—నే—బ్ర—తు— —(నేలఁగూలును.)

ఔరం—పాపాత్మురాలా! చచ్చుటకుపూర్వ మొకక్షణమైనను, పశ్చాత్తాప మొంది, ఈశ్వరుని తలంచవైతివే. నీకు నరకప్రాప్తియే యగును.

(నిష్క్రమించును)

## షష్ఠదృశ్యము

స్థానము:—జయసముద్రతీరస్థమగు రాణా జయసింహుని భవనము.

[భవనబహిర్వేదికపై నధివసించి, దుర్గాదాసు ప్రకృతి సౌందర్యము నాలోకించుచుండును.]

[జయసింహుఁడును, సరస్వతియు లోపలి నుండివచ్చి, దుర్గాదాసునకు వందన మాచరించి] దేవా! ఫలాహారమునుచేయ లోనికి దయసేయుఁడు.

దు—అమ్మా! ఇదిగో వచ్చుచున్నాను.

జయ—మహాత్మా! మాగృహమున మీకెట్టి యభ్యంతరము నుండదు. ఇచ్చట మీ రామరణము సౌఖ్యముగ నుండవచ్చును. మేము మీకు సేవలొనర్ప సంసిద్ధులము.

[ద్వారపాలుఁడు ప్రవేశము.]

ద్వా—మహారాణా! రాఠోరుసేనాపతి సందర్శనము నభిలషించి మొగల్ సేనాపతియగు దిలేరుఖానుఁ డేతెంచియున్నాఁడు.

దు—(ఆశ్చర్యసూచకముగ) దిలేరు వచ్చియున్నాఁడా! సాదరముగ నతనిఁ దోడ్కొని రమ్ము!

ద్వా—చిత్తము.

(నిష్క్రమించును.)

దు—రాణా! దీనియర్థ మేమై యుండును?

[దిలేరు ప్రవేశించును.]

దిలేరు—బందగీ వీరాగ్రేసరా! బందగీ—నన్ను మఱచుట లేదుగదా?

దుర్గా—నాప్రాణదాతను నేను మఱతునా? దయసేయుఁడు. మీరాకకుఁ గతం బెఱింగింపుఁడు.



దిలేర్—పుణ్యతీర్థసందర్శన మొనరింప నేతెంచియున్నాను. కాశీ ప్రయాగాదిక్షేత్రముల దర్శించుటచే హిందువు లెట్లు పావనులగుచున్నరో, మరణించుటకుఁ బూర్వము, నేనుసైతము నుదారపురుషులగు మీదర్శనముఁ జేసికొని పావనుఁడ నగుటకు వచ్చియున్నాను.

దుర్గా—దిలేర్! సామాన్యుఁడనగు నన్ను మీ రట్లు భావించుటకు, మీకు నాపైఁ గలప్రేమయె ముఖ్యకారణము.

దిలేర్—అట్లనఁబోకుము. ఈకలియుగమున మీవంటి మహాత్ముల సందర్శనమే ప్రజలఁ బావనులఁ జేయఁగలుగును. దీనికిఁ బురాణములు ప్రమాణములు.

దు—సేనాపతీ! పురాణములే కాదు. మీవాఁడగు కాసిమే యిందులకు ప్రత్యక్షప్రమాణము. ముసల్మానుఁ డైనను, విశ్వాసముతోఁ జావునకు భయమొందక, మేముచేయు ప్రతికార్యమందును, సహాయభూతుఁడై ప్రవ[illegible]ను నే నెన్నటికిని మరువను.

[కాసిం ప్రవేశము.

కా—బందగీ, దుర్గాదాస్!

దు—రమ్ము! ఈస్థలము నాక్రమింపుము. మన మహారాజు క్షేమముగ నున్నారా? వింత లేమైనఁ గలవా?

కా—మన మహారాజును గురించి నన్నుఁ బ్రశ్నింపకుఁడు. ఆదుష్టుని నామోచ్చారణమున పాపము సంభవించును. ఔరంగజేబు పాదుషా దౌలతాబాదులోఁ బరలోకప్రాప్తి నొందినాఁడు. అతఁడు మరణించుచు "మరాఠులారా! రాజపుత్రులారా!

నన్ను క్షమించుడు. క్షమించు”డని కేకలిడి బాసెను.

(అందఱును కొంతవఱకు మౌనము వహించియుందురు.)

దుర్గా—ఆతనిమరణమునకుఁ గారణము?

కాసిం — అంతఃపురమునుండి క్రిందికి దిగుచు, కాలుజాఱి, ధరాతల మునఁబడి మరణించెను.

దుర్గా—ఇంతతో మొగల్ మరాఠ రాజస్థానములు విధ్వంసములయ్యెను. హిందూమునల్మానుల మైకమత్యమునకును, ఆర్యభూమి నుద్ధరించుటకును, మేముచేసిన ప్రయత్నములన్నియును వితథములైనవి. మరల నార్యావర్తనమున రాజపుత్రుల కౌన్నత్యము సంప్రాప్తించుననినేను విశ్వసింపను.

జయ—[illegible]తరము సింహాసన మెవరికిఁ జెందును?

[illegible]—[illegible] లందుల కే పోరాడుచున్నారు. ఢిల్లీపాదుషా యెవరు[illegible] ప్రసిద్ధియు సింధుయుద్ధమునందు తెల్లమగును.

జయ—సేనాపతీ! కాసిం! భోజనమునకు వేళయైనది. మేము లోనికిఁ బోవలయును. దయయుంచుము. ఈదుర్గాదాసు నాటకమున కిదియే భరతవాక్యము.

(దిలేర్ ఖాను, కాసిము లతనికి సలాముల నర్పించి నిష్క్రమింతురు.)

---

[redacted] ALL PREVIOUS RULES.

*Estd in 1911.*

**Registered.**

Not this.

TRADE MARK.

భాగవతుల నరసింహాశర్మ ప్రొప్రైటర్

వేగుఁజుక్క—గ్రంథమాల,

పూడిపెద్దివారివీధి, బరంపురం (గంజాం)

**1927**

సంపాదకులు:—బ్ర॥ శ్రీ॥ ఆదిభట్ల [illegible]సిద్ధాంతిగారు.

# నిబంధనలు.

1. నిరూపకనవలలు, హాస్యనవలలు, [illegible] ప్రబంధములు, మనోహర నాటకములు, మనోల్లాస[illegible] తమతో, రమ్యములు [illegible].

2. గ్రంథము వెలువడిన [illegible] గ్రంథము ఒక్కొక్క రూపాయికి వి. పి. చేయబడును. [illegible] ప్రత్యేకము. ఇతరులకు ప్రతిగ్రంథము [illegible] ప్రత్యేకము.

3. *నాలుగు గ్రంథములు (పోస్టేజీలుగాక) [illegible] నాలుగు రూపాయలుమాత్రమే. ఈనాలుగు రూపాయలు [illegible] చందాదార్లకు పోస్టేజి మేమే భరించి పంపుదుము. ఇందువలన చందాదార్లకు నాలుగు గ్రంథములపై రూ 1—12—0 లాభము కలిసివచ్చును. [illegible] లాభమును పొందుచున్నారు.

4. చందాదారులగువారు వెనుకటి గ్రంథములలో నే యొక గ్రంథమునైనఁ గోరిన ప్రవేశరుసుము 0-4-0 మాత్రమే. అట్లుగాక, దాను ప్రవేశించిన పిమ్మట నుండి గ్రంథములఁ బంపఁగోరిన ప్రవేశరుసుము 0-8-0 మాత్రమే.

5. చందాదారులగువారు వెనుకటి గ్రంథములు పుచ్చుకొనవలెనను నిబంధన [illegible]మును లేదు. వారు కోరిన (కోరినగ్రంథములపట్టి) చాకగా ఇచ్చెదము.

6. అప్పుడప్పుడు [illegible] అనుబంధ గ్రంథములు చందాదార్లకుమాత్రమే [illegible]చితము.

---

* సంవత్సరమునకు 6 గ్రంథములు ప్రకటింప ప్రయత్నములో నున్నారము.

# గ్రంథరచనా నియమ[illegible]

1. Characterisation 2 Development of [illegible]
3. New Ideas 4 Historical Beauties 5. Description of nature and other varieties

గమనింపుడు — చందాదారులు ప్రతిగ్రంథము పుచ్చుకొనుట తమకు విధిగా యున్నది తీర పఠించిన పిమ్మట గ్రంథము నెలమాత్రము త్రిప్పివేయరాదు. గ్రంథములకు ముందు ఇంతకుముందు పంపుదుము. ఇష్టములేనివారు వెంటనే మాకు దెలియజేయవలెను. త్రిప్పివేయక ప్రతిగ్రంథము పుచ్చుకొను చందాదారులకు మాత్రమే అనుబంధ ముద్రితముగా పంపుదుము. అట్లాన్ని పంపిన పోస్టేజిఖర్చు లుండవు.

నూతనప్రచురములు. (New Publications)

## శ్రీ తులసీరామాయణము.

[illegible] — చిత్రపటశోభితము.

వాల్మీకి [illegible] హిందూ [illegible] దేశమునందంతట ప్రఖ్యాతిగాంచిన రామాయణమిది [illegible] కారము. ఇది హిందీభాషయందు శ్రీతులసీదాసు [illegible] శ్రీ [illegible] నృసింహశర్మగారిచే [illegible] శ్రీ [illegible] నిత్యము పారాయణ [illegible] అనేకవిధములు [illegible] నిది [illegible] శ్రీతులసీరామాయణము [illegible] ప్రచురింపబడును. బాలకాండను [illegible] అయోధ్యాకాండను రెండుభాగములు [illegible] 1—0—0 ఇతరులకు రూ 1—8—0 పోస్టేజి ప్రత్యేకము.

## ఉగ్రభైరవము.

చందాదార్లకు రు 1—0—0 పోస్టేజి వేరే. ఇతరులకు రు 1—8—0 పోస్టేజి వేరే.

గ్రంథకర్త:—పోడూరి రామచంద్రరావుగారు, బి, ఏ బియల్.

ఇదియొక భయంకరమైన డిటెక్టివ్ నవల. ఆంగ్లమున గల "The Hound of the Baskervilles" అను నవల ననుసరించి వ్రాయబడినది. చిత్రపటశోభితము. [illegible] జాగిలము ద్వారా చేయించిన యత్యద్భుత భయంకర ప్రశ్న లిందు నిరూపింపబడినది. తుదివరకు జదువనిదే విడిచిపెట్టరు. గుండెలవియజేయుచున్నాయి. [illegible] మాత్రము కలవు.

## సర్వమంగళ.

[illegible] రు 1-0-0] [ఇతరులకు రు 1-8-0 ఎల్లగారు పోస్టేజి ప్రత్యేకము.

గ్రంథకర్త:—వారణాసి నరసింహారావుగారు.

ఇదియొక సరసమైన సాంఘికనవల, అష్టుంథతీదయా [illegible] పారి [illegible] సుశీలాసర్వమంగళల భయంకరకష్టములు. [illegible] డాక్టర్ భుజంగసుందరుని దుర్దాంతదురంత కార్యములు, [illegible] ఇంతయేల ఆంధ్రపత్రికాది పత్రికలచే [illegible] పొందినది. [illegible] కాలికో బైండు, మంచిఅచ్చు, మంచికాగితము.

## రసపుత్రజీవనా[illegible]

గ్రంథకర్త:—[illegible]

బంగాళిభాషయందు శ్రీ [illegible] గారిచే ననువదింపబడినది. ప్రథమ [illegible] సిద్ధముగానున్నది. వలయువారు [illegible] ప్రత్యేకము.

[illegible]

1 [illegible]

[illegible] నాటక [illegible] వినవారే [illegible] వ్రాయబడినది [illegible] ప్రత్యేకం

## ప్రతిజ్ఞావిజయరామరాఘవము

లేక

## 2వ చిత్రవీరబొబ్బిలి

బొబ్బిలియుద్ధనాటకము లనేకములున్నవి. [illegible] నాటకరత్నమిదియే. విజయరామరాజుగారి [illegible] బొబ్బిలివారి పరాక్రమము [illegible] వెంగళ్రావు, రంగారావు, పాపయ్య, మొదలగు వీరుల [illegible] వర్ణించును. దీని వెల 0-12-0 పోస్టేజి ప్రత్యేకము. [illegible] మాత్రము కలవు.

# ప్రతిజ్ఞాచాణక్య [illegible]

శ్రీ ద్విజేంద్రలాల్ రాయ్‌గారు వంగభాషయందు [illegible] సుడని ప్రఖ్యాతి. ఆతడు వ్రాసిన నాటకమునకు "చంద్రగుప్త" [illegible] ఆ చంద్రగుప్త నాటకమే యీ ప్రతిజ్ఞాచాణక్యము. అనేక నాటకములవారు [illegible] కూడి ప్రఖ్యాతిగాంచిరి. చాణక్య సేటాంగ దలంచినవారీ నాటకము జదివితీరవలె ను. దేశభక్తి కిది పుట్టినిల్లు. చందాదార్లకు ౧-12-0 ఇతరులకు రు 1-౧-0 పోస్టేజి ప్రత్యేకం.

# అభినవభర్తృహరి.

[illegible] శర్మగారు.

ఈ [illegible] గ్రంథమని తెలియు [illegible] శృంగార [illegible] వైరాగ్యముల కిది పుట్టినిల్లు. [illegible], సారస్వతమవచ్చు. దిట్టమగు నట్ట [illegible] 0-0 పోస్టేజి ప్రత్యేకము.

# [illegible] నము.

[illegible] వెంకటేశముగారు.

[illegible] సాంగ్వనము, [illegible] శృంగా [illegible] శృంగారరసము గుప్తీకరింపబడి [illegible] రత్నమాలిక.

[illegible] —1—0 మాత్రమే.

ఫలమధికము

[illegible] ల్పము !!

# పద్మరాగము.

(అద్భుతమైన నిరూపకము.)

గ్రంథకర్త [illegible] వెంకటరమణయ్యగారు. ఆంగ్లేయమునగల "Reddi of the purple Emperor" అనునవల ననుసరించి స్వతంత్రముగ వ్రాసిన నవ యిది. పద్మరాగాదర్ఘ్యరత్నములకై జరిగిన యద్భుత సంఘటనములతో నిం [illegible] యుండును. ప్రసిద్ధికెక్కిన డిటెక్టివ్ నవలలో నిదియొకటి యని తుల్లరచే గొ [illegible] యాడబడినది.

వెల చందాదారులకు రూ 1—౧—0


---

[illegible] సమితి

[illegible] రత్న, [illegible] సుబ్బారావు,

[illegible] వీధి, బరంపురం (గంజాం)

# వైక్రాంతరసాయనము.



మూర్ఛ, అపస్మారము ఉన్మాదము, పిత్తవికారములు సమస్తప్రదరములు మృతవంధ్య, గర్భస్రావము, హిస్టీరియా అను వెర్రివికారములు, మొదలయినవి ఖండించును. స్త్రీపురుషులకు పనికివచ్చును 40 రోజులకు పనికివచ్చు వెల రు 15—0—0

# విలాసినీవల్లభరసా [illegible] నం.

వృద్ధులను యవ్వనులుగను, బలహీనులను బలవంతులుగను చేయును. ప్రాణాధారమైన రక్తమును శుద్ధిపరచి వృద్ధిచేయును. ఇప్పటి కాలములో ననేకులు దురభ్యాసమునకు లోనై వ్యభిచార దోషమువలన శరీర దార్ఢ్యము తగ్గి రోగములపాలై కష్టముల నొందుచున్నారు. ఇదిగాక ఇట్టివారికి పుట్టిన బిడ్డలు దుర్బలులై క్షీణించుట కూడ చూడగలిగితిమి. పై కారణములచే కంటి [illegible] పు చెడి, కీళ్లనొప్పులచే బాధపడుచు, సంతానహీనులైన వారి ననేకులనున్ను, నరములబలము, ఇంద్రియ పటుత్వము లేక బలహీనులైన యువకుల నెందరినో మా వైద్యపరీక్షానుభవములో చూచి చికిత్సచేయ [illegible] గలిగితిమి.

ఇట్టి బాధితు లనేకులు తమదుస్థితినిగూర్చి మొరపెట్ట పురాతనమగు ఆయుర్వేదశాస్త్రమును శ్రద్ధతో పరిశీలించి, శీఘ్ర గుణకారి యగు మా "విలాసినీ వల్లభరసాయన" మను దివ్యౌషధమును తయారు చేయగలిగితిమి.

దీని ననేకులు సేవించి స్వస్థతజెందిరి. నిస్త్రాణ, సంతానహీనత, అజీర్తి, చూపు తక్కువ, నడుముల పోటు, కీళ్లనొప్పులు, జ్ఞాపకశక్తి చెడుట, నపుంసకత్వము యిత్యాదుల కిది పేరైన యౌషధము. స్వప్నస్ఖలనము నాపును. శుక్లమును వృద్ధిచేయును. శుక్లదోషమును పోగొట్టును. ఇది అమూల్యమైనట్టియు, అమోఘమైనట్టియు యౌషధరాజము.

20 తు॥ డబ్బీ రు 3—0—0 లు

END OF
TITLE